Facebook

# మణిమాలికలు

ద్విపాద కవితలు

**సంపాదకులు**

ప్రసాద్ అట్లూరి

పద్మా శ్రీరామ్

*

**సహాయకులు**

దేవరాజుల దయానంద్ రావ్

లక్ష్మి యలమంచిలి

పాలపిట్ట-బుక్స్
హైదరాబాద్

**MANI MALIKALU-1**
*(Collection of twins)*
by **MANIMALIKA** **GROUP**

Email: manimalika.twins@groups.facebook.com
Copies: 1500

© Poets

| | | |
|---|---|---|
| Cover Design | : | Mahesh Malekar |
| Compose&Layout | : | Akshaya@9010906900 |
| First Edition | : | June, 2014 |
| For Copies | : | **Palapitta Books**<br># 16-11-20/6/1/1<br>403, Vijayasai Residency<br>Saleem Nagar, Malakpet<br>Hyderabad - 500 036<br>Phone: 040-2767 8430<br>palapittabooks@gmail.com<br><br>**Manimalika**<br>P.No: 43, Esswar Villas,<br>Nizampet, Kukatpally,<br>Hyderabad-500 090<br>Mobile: 85000 87000 |
| Printed at | : | Marvellous Printers<br>Nallakunta,<br>Hyderabad |
| Price | : | ₹120<br>$8 |

# మాలికా క్రమం


ప్రసాద్ అట్లూరి . . . . . . . . . . . . . . . . . . . . . 17

పద్మకుమారి వంగర . . . . . . . . . . . . . . . . . . . . . 29

భారతీరాయన్న కాట్రగడ్డ . . . . . . . . . . . . . . . . . . . 41

దేవరాజుల దయానంద్ రావ్ . . . . . . . . . . . . . . . . . 47

జానకి పాదుక . . . . . . . . . . . . . . . . . . . . . 59

లక్ష్మీ యలమంచిలి . . . . . . . . . . . . . . . . . . . . 65

మాధవీ అన్నాప్రగడ . . . . . . . . . . . . . . . . . . . . 77

మాధవీ ప్రసాద్ .కె . . . . . . . . . . . . . . . . . . . . 81

రాజారవి శ్రీనివాస్ యల్లాప్రగడ . . . . . . . . . . . . . . . 85

రాజేష్ యాళ్ళ . . . . . . . . . . . . . . . . . . . . . 97

రాంకిషన్ గొల్లపెల్లి . . . . . . . . . . . . . . . . . . . 109

సాయి కామేష్ గంటి . . . . . . . . . . . . . . . . . . . 113

సంతోష్ కుమార్ కొత్తా . . . . . . . . . . . . . . . . . . 125

సిరి వడ్డే . . . . . . . . . . . . . . . . . . . . . . . 131

శ్రీనివాస్ ఆర్.వీ.ఎస్.ఎస్ . . . . . . . . . . . . . . . . . 143

శ్రీ వెంకటేష్ గ్రంథి . . . . . . . . . . . . . . . . . . . 155

సుకన్యా బీగుడెం . . . . . . . . . . . . . . . . . . . . 161

సురేష్ బాబు రావి . . . . . . . . . . . . . . . . . . . . 165

స్వర్ణలతా నాయుడు సోమిశెట్టి . . . . . . . . . . . . . . . 171

విశ్వనాథ్ గౌడ్ ఈడిగ . . . . . . . . . . . . . . . . . . . 175

# మా భావాక్షరాలు... తొలిపలుకై

నిరంతరం నేర్చుకోవాలన్న తపన మనల్ని పుస్తక ప్రియులను చేస్తుంది. ఎందరో కవులు, రచయితలు తమ ఊహలు, భావాలు, ఆలోచనలు, అనుభవాలను పుస్తకరూపంలో ముద్రించి పఠన ప్రియులకు కానుకగా అందించారు. కొన్ని దశాబ్దాల క్రితం వరకూ పుస్తకం విజ్ఞానాన్ని పంచే మాధ్యమాలలో ముందు వరసలో ఉంటూ వచ్చింది. అయితే విజ్ఞాన రంగంలో వచ్చిన సమూల మార్పులు కారణంగా కంప్యూటర్, అంతర్జాలం అనేవి మనిషి జీవితంలో తమ చోటును సుస్థిరం చేసుకుంటూ వచ్చిన నేపథ్యంలో, ఇప్పుడు రచయితల చూపుకూడా నేటి తరం సోషల్ నెట్‌వర్క్ అయిన ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి వాటిపై పడింది, ఈ పరిస్థితికి ముఖ్య కారణం ఒక రచయిత లేక కవి తన భావాన్ని క్షణాల్లో ప్రపంచం నలుమూలలకు చేర్చగలగడమే కాకుండా ఆ భావంపై ప్రతిస్పందనను కూడా వెంటనే పొందగలిగే అవకాశం మరియు సౌలభ్యం ఉండటమే.

సోషల్ నెట్‌వర్క్ విస్తరిస్తున్న తీరుని గుర్తించి, అప్పటికే ఫేస్‌బుక్కులో గ్రూప్స్ ఏర్పాటు చెయ్యటం ద్వారా చాలామంది కవులను ఒకచోటుకి చేర్చి కవిత్వాన్ని కంప్యూటర్ లోనూ మొబైల్ లోనూ అందుబాటులోకి తేవడానికి ముందుకు వచ్చిన కవి యాకూబ్ గారి "కవి సంగమం" ఇంకా అలాంటి రెండు మూడు ఇతర గ్రూపుల్ని ఆదర్శంగా తీసుకుని "మణిమాలిక" గ్రూప్ జూన్ 20, 2012న ప్రారంబించాం. అయితే ఎప్పటి నుండో కవిత్వం రాస్తున్న, అప్పుడప్పుడే రాయగలుగుతున్న వారికి మాత్రమే పరిమితమై పోకూడదనే ఉద్దేశ్యంతో కవిత్వమంటే ఆసక్తి వున్నవారు, కవిత్వాన్ని ఆసక్తితో చదువుతున్న వారందరూ తాము కూడా కవిత్వం రాయగలమన్న ధీమా, నమ్మకం కల్పించే విధంగా గ్రూపును తీర్చిదిద్దాలని భావించి, రెండు వాక్యాలలో మాత్రమే వుండే "ద్విపాద కవితలను" గ్రూప్ వస్తువుగా ఎన్నిక చేసుకోవటం జరిగింది.

ఏ ప్రక్రియైనా నియమాలతో, పరిమితులతో చెయ్యబడితే కొంత అదనపు సోయగాన్ని, శోభను పొందటం సహజం. అందరికీ అర్థమయ్యేలా సరళంగా ఉండే ఒక నమూనాలో కవిత్వం అందించాలని తలచి "మొదటి వాక్యంలో ఎన్ని పదాలు ఉంటే... రెండో వాక్యంలో కూడా అన్నే పదాలు గాని లేక గుణిజాల్లో గాని వుండాలి" అనే

నమూనాను పదాల గణన ఆధారంగా ఉండేట్టు నిర్ణయించాం. దైనందిన జీవితంలో మనం అనుభవించే ఆనందం, విషాదం, ప్రేమ, విరహం వంటి భావాలు, అనుభూతులే కాకుండా సామాజిక ,రాజకీయ అంశాలలో వేటినైనా రెండు వాక్యాలలోనే స్ఫురించిన వెంటనే చెప్పగలిగే అవకాశం మాలికలుగా మార్చుకునే సౌలభ్యం ఈ నమూనాలో వుండటం వలన, అతి తక్కువ కాలంలో ఎక్కువ మంది మన్ననలు చూరగొని ఇప్పటి వరకూ సుమారు పదిహేను వేల మాలికలు రాయబడి మూడువేల మంది సభ్యులతో ఈ గ్రూపు ప్రస్థానం కొనసాగిస్తోంది. గ్రూపు మొదలు పెట్టినప్పుడు చేరిన చాలామంది సభ్యులు ఇప్పటికీ కొనసాగుతుండగా మధ్యలో ఎంతోమంది కొత్తవారిని కలుపుకుంటూ కవిత్వం రాయాలన్న తపనకు బీజాలు వేస్తూ కవులుగా మారుస్తూ ముందుకు సాగుతోంది మణిమాలిక. ఈ ప్రక్రియలో భాగంగా సభ్యులు రాసిన మాలికల నుండి ప్రతివారం అత్యుత్తమమైన మాలికల్ని సభ్యులచేతనే ఎంపిక చేయిస్తూ ప్రతివారం మధ్యలో “నేటి పదం”, “వాక్యపూరణం” వంటి శీర్షికలతో సభ్యులలో ఆసక్తిని పెంచే కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నాం.

ఇంతమంది కవులు ఇన్నివేల మాలికలు వ్రాసిన తరువాత వారి భావాల్ని, అనుభూతుల్ని అంతర్జాలానికి ఫేస్‌బుక్కుకూ మాత్రమే పరిమితం చెయ్యకుండా, పుస్తకరూపంలోకి తీసుకువచ్చి కవిత్వ ప్రియులకు కూడా అందించాలనే సంకల్పంతో, ఎంత ఎక్కువ మంది సభ్యుల మాలికలు వీలైతే అంతమందివి తీసుకుని పుస్తకంగా అచ్చు వేయించడానికి నడుం బిగించాం. రాసిన అన్ని మాలికల్ని అచ్చుకు తీసుకోలేము కాబట్టి, వారు గ్రూపులో రాసిన మాలికల సంఖ్య ఆధారంగా కొందరికి అవకాశం కల్పిస్తూ, నాణ్యత కలిగిన వాటిని ఎంపిక చేసి ప్రచురణకు స్వీకరించాం. నాణ్యత కలిగిన మాలికల ఎంపికకు గ్రూపు కో-అడ్మిన్‌లు మా ఇద్దరితో పాటు సభ్యులు దయానంద్ దేవరాజుల, లక్ష్మి యలమంచి గార్లతో ఒక కమిటీని ఏర్పరచి 20 మంది సభ్యుల యొక్క మాలికల నుండి అత్యుత్తమ కవితా మాలికలకు పుస్తకంలో చోటు కల్పించాం. ఈ పుస్తకంలో చోటు సంపాదించిన సభ్యులలో ఒకరిద్దరు తప్ప మిగతా సభ్యులందరూ మొదటిసారి తమ కవిత్వాన్ని పుస్తకం రూపంలో చూసుకోబోతున్నందుకు సంతోషపడుతున్న వారే అని చెప్పటంలో అతిశయోక్తి లేదు. ఈ సందర్భంగా మా కమిటీ సభ్యులకు వారు చేసిన సేవలకు మా మనఃపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాం. కోరిన వెంటనే...

తమవంతు సహకారంగా...తమ మాలికల్ని, వారి వివరాల్ని సకాలంలో అందజేసిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

తెలుగు సాహిత్యంలో సరికొత్త ప్రయోగంతో వస్తున్న మా సంకలనానికి ముందుమాట వ్రాసిన ప్రసిద్ధ కవులు శ్రీ యాకూబ్ గారికి, "యానాం కథలు" అక్షరీకులు శ్రీ దాట్ల దేవదానం రాజు గారికి మరియు పాపులర్ తెలుగు సినీ గీత రచయిత శ్రీ సాహితీ గారికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాం. పుస్తకం అచ్చువేయించాలన్న సంకల్పానికి తన వంతు సహకారాన్ని అందించి తమ సంస్థ పాలపిట్ట పబ్లికేషన్స్ ద్వారా పుస్తకాన్ని విడుదల చేస్తున్న శ్రీ గుడిపాటి గారికి, కవర్ పేజీ డిజైన్ చేసి కంపోజ్ చేసిన శ్రీ మహేష్ మాళేకర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

సంపాదక వర్గం...
**ప్రసాద్ అట్లూరి** (వ్యవస్థాపక నిర్వాహకుడు),
**పద్మా శ్రీరామ్** (సహ నిర్వాహకురాలు)

# మణిమాలికలు – మెరుపు కవిత్వం!

– కవి యాకూబ్

*We have a country of words-speak speak*
*so I can put my road on the stone of stone.*

*We have a country of words-speak speak*
*so we may know the end of this travel.*

***- Mahmoud Darwish (Palestinian poet)***

కవిత్వం కేవలం అక్షరాలు మాత్రమే కాదు. అది ప్రపంచం మాట్లాడే భాష.దృష్టి కోణం.కవులనే వాళ్ళు రాస్తున్నదేదీ కేవలం వ్యక్తిగతం మాత్రమే కాదు. అది సమాజపు ప్రతిఫలనం. సాహిత్యకారులు సృజిస్తున్న ఏ అంశమూ కూడా పరిమితమైన అర్థాలతో మాత్రమే ఉండదు. అది మొత్తం సామాజిక వాస్తవికతను ప్రతిఫలిస్తుందనే వాస్తవాన్ని గమనంలో ఉంచుకోవాల్సి వుంటుంది. "మణిమాలికల"ను నేను చదువుతున్నప్పుడు ఇది కేవలం ఆయా కవులకే పరిమితమైన భావాల వ్యక్తీకరణగా మాత్రమే చూడాలనిపించలేదు. సామాజిక సందర్భం,ఇవి రాయడానికి ఏ విధంగా పురికొల్పిందో బేరీజు వేస్తూ చదవడం ముగించాను. ఈ కవులు యాధృచ్ఛికంగానే ఇన్ని భావాలు రాయగల శక్తి వచ్చిందా? లేక చుట్టూవున్న సామాజిక స్థితిగతులు ఇటువంటి "మానసిక కిటికి" తయారవడానికి, తమల్ని తాము ఇప్పుడున్న ఉక్కపోసిన తనం, కుంచించుకు పోతున్న మానవ సంబంధాలు ఇత్యాది అంశాలు outletగా వ్యక్తీకరించుకోడానికి ప్రేరిపించాయా? అనే కోణంలో చూడడానికి కూడా పురికొల్పాయి. ఇక 'మణిమాలికల' సందర్భంలోకి వస్తే..,

చెప్పదలచుకున్న విషయాన్ని వీలైనంత తక్కువ నిడివిలో సూటిగా చెప్పడం "అతిక్లుప్తత" అనే లక్షణం.కవిత్వానికి ప్రధానంగా ఉండాల్సిన ప్రధాన లక్షణమిదే. విషయాన్ని వ్యక్తీకరించే పద్దతి, చెప్పేపద్దతి, అభివ్యక్తి ఇందులో వాక్యనిర్మాణమూ, భాష, వాడిన ప్రతీకలు మొదలగునవన్నీ కలగలిసి, అభివ్యక్తీకరించడంతో పాటు, ఆ అనుభవాన్ని పాఠకుల్లో కలిగించడానికి ఉపయోగపడే భావచిత్రాలను ఆశ్రయించడం ఒక కవితా విధానం. అంటే, కవిత్వంలో చెప్పే విషయమూ, చెప్పే పద్ధతీ రెండూ సమ ప్రాధాన్యతను కలిగి, దృశ్యం రూపుకట్టడంలో భావచిత్రం పనికొస్తుంది. భావచిత్రాలతో చెప్పడం ద్వారా ఎటువంటి ప్రత్యేక ప్రయత్నం లేకుండానే కవి చూపించదలచుకున్న, చెప్పదలచుకున్న విషయం పాఠకుడి మనస్సులో రూపుకడు తుంది.

కవిత్వంలో ఇమాజినేషన్ – భావానాశక్తికి ప్రధానమైన స్థానం వుంది.అంటే ఊహించగల శక్తి. వస్తువులను, వివిధ పరిస్థితులను, వివిధ చర్యలను ప్రతిబింబించే సామర్థ్యం. క్రమబద్ధత లేని అనుభవంలో– ఒక క్రమాన్ని చూపడమే, ఏర్పర్చడమే ఈ భావనాశక్తి అని చెప్పొచ్చు. దీన్ని సృజనాత్మకత, ఊహాశక్తి అని కూడా అనవచ్చు.

ఈ "మణిమాలికలు" క్లుప్తంగా సాగే ఒకానొక ప్రక్రియగా, అతిక్లుప్తతతో, భావనాశక్తితో రూపుదిద్దుకొని పాఠకుల్ని ఆకర్షిస్తున్నాయి. "ఫేసుబుక్"లో ఇదొక గ్రూపుగా, వేదికగా ప్రాచుర్యం పొందుతూ ఉండడం ఈ క్లుప్త కవిత్వప్రయోగ సఫలతను చూపిస్తుంది. మొదటివాక్యము రెండవ వాక్యానికి సంబంధించిన పదాల నిడివిని ముందే నిర్ణయించుకొని, ఆ పరిధిలో, చెప్ప దలచిన భావాన్ని కుదించి చెప్పడం కవి నైపుణ్యానికి సవాలే. ఆ పరిమిత చట్రంలో చెప్పదలచిన, పాఠకుడికి చేరవలసిన భావనను చేరవేయడం కూడా ఎంతో నేర్పుగా వ్యక్తీకరించడం ఒకరకంగా కత్తిమీద సామే. ఇన్ని చట్రాలను, ఇన్ని పరిమితులను అధిగమిస్తూ "మణిమాలికల" వేదికలో అనేకమంది రాయడం సంతోషించే విషయం. అందులోంచి 20 మంది ఇవాళ ఈ పుస్తకరూపంలో వెలుగుచూస్తుండడం మంచి పరిణామం.

"మణిమాలికలు" మెరుపుల్లా, తటిల్లతల్లా ఉంటాయి. వేగవంతమైన ప్రవాహ జీవితంలో రెండుపాదాలుగా విస్తరించే భావ ప్రకటనలివి. ఒక విధంగా చూస్తే ఇవి, సెల్ ఫోనులో మెసేజుల్లా కనిపిస్తున్నాయి.

గతంలో ఈ"మణిమాలికల"కు దగ్గరి పోలికలున్నవి అనేకం కనిపిస్తాయి. కొద్దితేడాతో నానీలు, నానోలు, ఫెంటోలు, ఇంకా వెనక్కువెళితే ద్విపదలు, ధ్యానం రూపుగట్టిన "హైకూలు" కనిపిస్తాయి. ఐతే ఇప్పుడు ఒక విషయాన్ని పాఠకులకు అందించడానికి ఎన్నుకొనే సాధనం, లేదా సాంకేతిక క్రమంగా ఈ "మణిమాలికల" మాధ్యమం కనిపిస్తుంది.

ఇందులో ప్రధానంగా కనిపించే వస్తువులు–ప్రేమ, విరహం, వెన్నెల, ఎడబాటు, ప్రకృతి, కాంక్ష, వైఫల్యాలు, జీవితం మొదలైనవి.

మచ్చుకి, కొన్ని "మణిమాలికలు"

***ప్రసాద్ అట్లూరి***

"నేల నిద్రకి ఉపక్రమించినట్లు ఉన్నది...
వెన్నెలదుప్పటి కప్పుతోంది నింగి ప్రేమతో"

***పద్మకుమారి వంగర***

"ఏంటో పేజీలు తడిసినట్లున్నాయి
నువ్వు ఏడ్చావా డైరీ"

| | |
|---|---|
| **భారతీరాయన్న కాట్రగడ్డ** | "కాలానికి కూడా దుఃఖమే<br>నీవులేని నన్ను చూసి" |
| **దేవరాజుల దయానంద్ రావ్** | "నీకంటే మృత్యువు ఎంతోనయం<br>వేలసార్లు వేధించి వధించదు" |
| **జానకి పాదుక** | "వచ్చివెళ్ళిందే తెలియలేదు<br>యవ్వనానికి బహుశా ఆయువు బహుతక్కువ" |
| **లక్ష్మీ యలమంచిలి** | "అసంకల్పిత చర్యలా<br>కన్నుమూస్తే చాలు కలల్లో చొరబడతావ్" |
| **మాధవీ ప్రసాద్ .కె** | "నీకన్నా అద్దమే ఎంతో నయం<br>నేనేడిస్తే అది ఎప్పుడూ నవ్వదు" |
| **శ్రీనివాస్ యల్లాప్రగడ** | "మనుషుల్ని గుర్తుపట్టాలంటే<br>ముందునువ్వు మనిషివైవుండాలిగా" |
| **రాజేష్ యాళ్ళ** | "నాకు వ్యాకరణం రాదు కానీ<br>నీవే కర్త కర్మ క్రియ" |
| **రాంకిషన్ గొల్లపెల్లి** | "రెండు కణాలు సంకలిస్తే జననం<br>ఒకక్షణం పఠీల్మని పగిలితే మరణం" |
| **సాయి కామేష్ గంటి** | "చెత్తబుట్ట నోరుతెరిచింది<br>తొలి ప్రేమలేఖ రాయడం మొదలెట్టగానే" |
| **సంతోష్ కుమార్ కొత్తా** | "వేసవి తుమ్మెద..సూరీడు<br>ఓపికనే తేనెని జుర్రేస్తూ " |
| **సిరి వడ్డే** | "మరణానికైనా అడ్డుచెప్పను<br>మరుజన్మలోనైనా మనసిస్తానని నువ్ మాటిస్తే" |
| **శ్రీ వెంకటేష్ గ్రంథి** | "ఆరుపలకల దేహం<br>తినకపోవడం వల్లకాదు తినడానికి లేకపోవడంవల్ల" |
| **శ్రీనివాస్ RVSS** | "ఊహాచిత్రాలు గీస్తూనే ఉంటాను అసంఖ్యాకంగా<br>అస్పష్టమైన నీరూపం స్పష్టమయ్యే దాకా" |
| **సుకన్యా బీగుడెం** | "అక్షరాల భావానికి ముద్దివ్వాలి<br>నీ మదిని తాకినందుకు" |
| **సురేష్ బాబు రావి** | "ఈలోకం |

బతికున్న శవాల రంగులరాట్నం"

**స్వర్ణలతా నాయుడు** "జ్ఞాపకాల పుస్తకం తెరిచి చూసా
నవ్వింది కొంటెగా నీ అల్లరిపుట"

**విశ్వనాథ్ గౌడ్ ఈడిగ** "భూమి విశాలమైనదే
నాది, నీదంటూ కంచెలు వేస్తారంతే"

**మాధవీ అన్నాప్రగడ** "కాలం కాన్వాసుపై
క్షణాలుగీసే చిత్రాలెన్నో"

ఇవన్నీ చదివితే చుట్టూవున్న జీవితం, సమాజం, మానవ సంబంధాలు, వాటి పరిణామాలన్నీ ప్రత్యక్షమవుతాయి. ముందుగా చెప్పుకున్నట్టు ప్రేమ, విరహం ఇత్యాది అంశాల గురించి రాసినవి ఎక్కువే. కొన్ని గాఢతగా వ్యక్తీకరించినవి, మరికొన్ని అలవో కతనంతో సాగినవి. ఆశ్చర్యానికి, సంభ్రమానికి గురిచేసే "మణిమాలికలు" కూడా లెక్కకు మించే ఉన్నాయి. సంతోషించాల్సిన విషయమేమిటంటే, ఒకప్పటిలా కాకుండా, ఫేసుబుక్ పుణ్యమా అని కవిత్వరంగానికి దూరంగా బతుకుతున్న వాళ్ళు, తమతమ స్థాయిలలో తమ భావాలను, కవిత్వ వ్యక్తీకరణగా మలిచే ప్రయత్నం చేయడం.

పదునైన, మెరుగైన ఊహాశాలిత్వం ప్రదర్శించడం. దానికి "మణిమాలిక" వేదిక కావడం శుభపరిణామం. సహజంగా స్పందించడం, రాయడం, జీవితాన్ని పలకడం, జీవితాన్ని చుట్టుకొనివున్న ప్రకంపనాల్ని, వేదనల్ని, సంతోషాల్ని, సందర్భాల్ని కవిత్వీ కరించడం అనే పనికి పూనుకున్నందుకు ఇందులో రాసిన ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ... జయహో!

# రెండు పాదాల నిండు కవిత్వం

తెలుగు సాహిత్య పరిణామక్రమంలో అనేక ప్రక్రియలు వెలుగు చూస్తుంటాయి. అన్నీ ఆహ్వానించదగినవే. భావాన్ని ఇతరులతో పంచుకుని రసాస్వాదన చేయడం ప్రధానం. సమస్త బంధనాన్ని తెంచుకుని స్వేచ్ఛగా పదాల్ని కూర్చడం అందర్నీ ఆకర్షిస్తుంది. అంతే కాకుండా కఠిన పదాలు, దీర్ఘసమాసాలు ఉండవు. సూటిగా మనసుకు హత్తుకునేలా చెప్పడమే నియమం. అంతే. కవితా నిర్మాణాన్ని ఆకళింపు చేసుకుంటే చాలు ఒక అభిరుచి సొంతమవుతుంది. మణిమాలికల పట్ల అనేకమంది యువకవులకు మక్కువ కలిగింది అందుకే, ఇక్కడ యువకవులు అంటే వయసుకు సంబంధించి కాదు. కొత్తగా కవితారంగంలోకి ప్రవేశించేవారని అర్థం చేసుకోవాలి. ప్రతి వ్యక్తికీ తనకే సొంతమైన అనుభవాలుంటాయి. ఉద్వేగాలుంటాయి. ఆనందానుభూతులుంటాయి. ఎవరికి చెప్పుకోవాలి? ఎలా వ్యక్తపరచుకోవాలి? చాలినంత సమయం, వెసులుబాటు ఉండదు. మొలకలెత్తే భావాల్ని అక్షరబద్ధం చేసే ఓపిక ఉండదు. నిత్య దైనందిన వ్యాపకాల్లో కూరుకుపోయి తనలోని సృజనను చంపేసుకోవాలి తప్ప మార్గం లేదు. సరైన వేదిక లభించకపోవడమే కారణం. అట్లాంటి వారికి దొరికితే భావాలు కవిత్వమై అవిచ్ఛన్నంగా ఊపిరిపోసుకుంటాయనడానికి ఇదిగో ఈ మణిమాలికలే గొప్ప ఉదాహరణ.

ఏకరీతి అభిరుచులు గల వ్యక్తులే. కాకపోతే ముఖపరిచయాలుండవు. భిన్న ప్రాంతాల్లో భిన్న భాషా సమూహాల్లో సరిహద్దుల్లేని ప్రపంచంలో బిజీగా ఉంటారు. అంతర్జాలం (ఇంటర్నెట్) అనే ఒక ఉపకరణం. అందర్నీ ఒకచోట రచ్చబండ మీద కూర్చుని ముచ్చట్లాడుకునే అవకాశం కల్పించింది. అనుసంధానమంతా దాని ద్వారానే. ఎన్నో ఆలోచనలు, ఊహలు, అనుభూతి స్పందనలు అద్భుతంగా భావప్రసారమౌతున్నాయి. వీరందర్నీ ఒక సమూహంలోకి కూడగట్టడం పెద్దపనే. ఆ పనిని విజయంతంగా చేసి ఒక ప్రక్రియకు రూపశిల్పి అయినవారు ప్రసాద్ అట్లూరి. సుమారు మూడవేలమంది సభ్యుల్ని ఒక చోట చేర్చడం అంటే అందులో ఎంతటి ఆకర్షణశక్తి మిళితమైందో అర్థం చేసుకోవాలి. ప్రసాద్ వృత్తి రీత్యా భవన నిర్మాణ కర్త. ప్రవృత్తి రీత్యా సేద తీరేది కవిత్వంలో ఆయన లోని సహృదయత, స్నేహపాత్రత ఫేస్‌బుక్ సాక్షిగా వీరందరూ కవులుగా ప్రత్యక్షమై మనముందు ఇలా నిలబడ్డానికి కారణమైంది.

ఇప్పటికే తెలుగు సాహితీ లోకంలో హైకూలు, నానీలు, రెక్కలు వంటి లఘు ప్రక్రియలు ప్రవేశించి కవిత్వాన్ని సుసంపన్నం చేసాయి. ప్రకృతి ప్రధానంగా హైకూలు, తాత్విక వివేచనతో రెక్కలు అర్థసమన్వయంతో నానీలు ఘనతకెక్కాయి. ఆయా ప్రక్రియల్లో వందలాది కవితాసంపుటులు వెలువడ్డాయి. పైన పేర్కొన్న ప్రక్రియలకు మణిమాలికలకు

మౌలికమైన భేదం ఉంది. వాటన్నిటికీ అక్షరాలు, క్లుప్తతే ప్రాతిపదిక. అయితే ఇందులో పదాల సంఖ్య ముఖ్యం. క్లుప్తత అనేది రెండింటిలోనూ సమానధర్మం. మణిమాలికలు మొదటి పాదంలో అవసరాన్ని బట్టి రెండో మూడో పదాలుంటాయి. రెండో పాదంలో మొదటి పాదం పదాల సంఖ్యతో సమానంగా నైనా ఉండొచ్చు లేదా దాని గుణిజాల్లో పదాలు ఉండొచ్చు. ఉదాహరణకు మొదటి పాదంలో రెండు పదాలుంటే రెండో పాదంలో రెండుగానీ నాలుగుగానీ ఆరుగానీ పదాలుంటాయి. ఆరు కంటే ఎక్కువ పదాలుండకూడదనే నియమం ఉంది. ఇక నిర్మాణరీతి వల్ల ఒక లయ స్వచ్ఛంగా ఏర్పడే అవకాశం ఉండనే ఉంది. మణి మాలికలు తెలుగు కవిత్వానికి ఒక చేర్పుగా వినూత్న కవితారూపంగా సృజనాత్మకతలో కొత్తదనం గల ప్రక్రియగా అవతరించగలదని ఆశించవచ్చు.

మణిమాలికల్లో తాత్త్విక భావ చైతన్యం మెండుగా ఉంది. హైకూలు కాసింత విరామం పాటించి చదివితే ఊహించుకునే కొలదీ పెద్ద దృశ్యం మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది. ఇందులో అలా కాదు. తక్షణమైన స్పందన మెరుపులా తడుతుంది. అడ్డంకులు లేకుండా సులభంగా ప్రవేశించగలగడం పనుల మధ్యా, ప్రయాణాల్లోనూ మనసులో కలిగిన భావాన్ని అంది పుచ్చుకుని సులువుగా రాయొచ్చు. రాసేవారికి చదివే వారికీ ఆత్మతృప్తి.

సౌందర్యాత్మకత, తత్వ జిజ్ఞాస అనుభూతి అనుభవ సాంద్రత జీవిత సత్యాన్వేషణ ఈ మణి మాలికలలో పుష్కలంగా ఉంది. సాధారణ పదాల ద్వారా కవితా నిర్మాణాన్ని సాధించి గంభీరమైన లోతైన అర్థాన్నిచ్చే ద్విపదలెన్నో ఉన్నాయి. ఇందులో వేగం, యాంత్రికత చోటు చేసుకున్న నేటి కాలంలో ఇట్లాంటి లఘు ప్రక్రియలు పుట్టుకు రావడం సహజమే. అది చొచ్చుకుపోయి నలుగుర్నీ ఆకర్షించి పదికాలలు నిలబడుతుందా లేదా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

ఒక చిన్న కవితలో అనంతమైన అర్థవిస్తృతి ఉంటుంది. చదవగానే మనం కొన్ని అనుభవాలు తవ్వుకోవాలి. కొన్ని జ్ఞాపకాల్ని స్మృతికి తెచ్చుకోవాలి. కొన్ని అనుభూతుల్ని సంలీనం చేసుకోవాలి. ఏకకాలంలో ఇవన్నీ సంభవించి మన సంస్కారం ఉన్నతీకరించబడాలి. కొన్ని మణిమాలికల్ని పరిశీలిద్దాం.

**ఊహలు మనసును మోసే గుర్రాలైతే**
**వాస్తవాలు ఎగిరి తన్నే గాడిదలు (ప్రసాద్ అట్లూరి)**

ఊహలకు అదుపాజ్ఞలు ఉండవు. అవకాశం ఇవ్వాలే గానీ చెలరేగిపోతాయి. అవి ఎట్లాంటివి? మనసును మోసే గుర్రాల్లాంటివి. అది అలా ఉంచండి. మరి వాస్తవాలు? గిల్లి చూసుకుంటే వాస్తవంలోకి వస్తాం. వాస్తవాలు ఊహలంత సజావుగా ఉంటాయని చెప్పలేం. ఊహలకు భిన్నంగా ఉంటాయి. అవి ఎట్లాంటివి? ఎగిరి తన్నే గాడిదల్లాంటివి.

గుర్రం, గాడిదలతో ఊహల్నీ వాస్తవాల్నీ పోలిక చేసి చెప్పడం వల్ల ఒక తాత్విక భావాల్ని సునాయాసంగా అందివ్వగలిగింది ఈ మణి మాలిక.

**నాది ఊష్ణపు శరీరమే మరి**
**నీజ్ఞాపకాల కుంపటి గుండెల్లో రగిలించాక (దయానందరావ్ దేవరాజుల)**

జ్ఞాపకాలు చేదుగా ఉంటే గుండె కుంపటవుతుంది. ఫలితం–నిద్రలేని రాత్రులు... చిట్లుతున్న మెదడు వెరశి శరీరమంతా ఊష్ణమే. గుండెల్ని రగలించని జ్ఞాపకం గురించి అయితే మరో మణి మాలిక రాయాల్సిందే.

**కన్నుల మాటునే కాపు కాసా**
**కౌగిళ్ళకు నెలవు కలలే అన్నావని (జానకి పాదుక)**

కలల చిరునామా ఎప్పుడూ వైయక్తిక అనుభూతే. అది కన్నుల మాటునో రెప్పల ప్రకంపనాల చెంతో కాపు కాస్తే చిక్కేది కాదని తెలుసు. అంతర్గత భావన నుంచి కూడ కవి ఏదైనా ఆశిస్తాడు.

**మాట గుండెను భేదిస్తే**
**మౌనం మనసును కోసేస్తుంది (శ్రీనివాస్ ఆర్.వి.ఎస్.ఎస్)**

పెళుసు మాట గుండెను బాధిస్తుంది.తట్టుకోడానికి కొంత సమయం పడుతుంది. మౌనం కూడా ఒకలాంటి ఆయుధమే. అది ఎన్నో ప్రశ్నలకు సమాధానం చెబుతుంది. ఒకోసారి మనసును విరిచేస్తుంది. కోసేస్తుంది. దీన్ని అధిగమించడం కష్టం.

**మానవత్వం మరణిస్తుంది**
**ఓ నిముషం మౌనం పాటిద్దాం (పద్మకుమారి వంగర)**

తెల్లారి లేచి దినపత్రికలు, చానల్స్‌లోకి వెళితే మానవత్వం మంటగలిసే సంఘటనలెన్నో. మౌనం పాటించడం అంటే సానుభూతి తెలయజేయడం. అశకత్త, నైరాశ్యమేనా మిగిలేది? కాదు.. కాకూడదు. మానవత్వం పరిమళించాలని మనసారా కోరుకోవడం ఈ మణి మాలికలో ఉంది.

**నాలోని నిన్ను వేరుచేయమన్నా**
**వల్ల కాదంటూ చేతులెత్తేసింది రాయంచ (లక్ష్మి యలమంచిలి)**

మమ్మల్ని ఎవరూ విడదీయలేరు. మేమిద్దరం ఒకటే. ఇక్కడ ప్రేమబంధాన్ని వేరు చేసే వారెవ్వరూ లేరు. హంస పాలు నీళ్ళు వేరు చేస్తుందంటారూ కదా. అది కూడ ఏమీ చేయలేదు. ఏకత్వం ఎంతగా పెనవేసుకున్నదో చెబుతుంది ఇది.

**హోళీ అంటే తనకిష్టమంది**
**నల్లరంగే చల్లుతోంది... మనసుపై (సాయి కామేష్)**

ఇష్టాన్ని రంగుల్లో చెప్పొచ్చు. ఏ రంగైనా పర్వాలేదు. కాని నల్లరంగు దేనికి

ప్రతీక? మనుసుపై అది చల్లుతుందట. వైముఖ్యాన్ని తెలియజేయడానికి అంతకంటే మార్గం లేదు. దీనికి వ్యాఖ్యానం ఎంతైనా చెప్పుకోవచ్చు.

**నిలువెల్లా గాయాలే చేసినా**
**మది వేణవుకెందుకో నీతలపుల గేయాలు (సిరి వడ్డే)**

ఎన్నో గాయాలు చేసావు.. నిలువెల్లా. తట్టుకోలేరెవ్వరూ. అయినా చిత్రం – నా మది వేణవు ఎందుకో నీ తలపుల గేయాలే పాడుతూంది. ప్రేమ విఫలం అయినా తలపులు మాసిపోవు.

మణిమాలికలు కవులు గొప్ప ఉత్సాహంగా రాస్తున్నారు. తమ స్పందనను పదాలుగా గుచ్చి పరిమళాలుగా వెదజల్లుతూ భవిష్యత్‌లో మంచి కవులుగా మారే వాగ్దానం చేస్తున్నారు. ఆ దాఖలాలు ప్రతి ద్విపదలోనూ కనిపించింది. ఉదాహరణగా చెప్పాలి కదా అన్ని కొన్నింటిని గురించి మాత్రమే రాయడం జరిగింది.

మణి మాలిక... మధుర భావాక్షర దీపిక గ్రూప్‌లోకి ప్రవేశించి చూడండి. అక్కడ తెలుగు పదాల చక్కని అల్లికతో భావామృతం తొణికిసలాడే మాలికలు కనిపిస్తాయి. కవిత్వం మనకు సరిపడదులే అనుకున్న వాళ్ళు కూడా కవులైపోతారు. నాకైతే ఎంతో ఆనందమూ ఆశ్చర్యమూ కలిగింది. ఔత్సాహిక కవుల పరంపర విరజిమ్మన కవిత్వం గుబాళించింది. అనేకానేక స్పందనలు, భావ వీచికలు మనల్ని తప్పక రసానుభూతికి లోను చేస్తాయి. ప్రచురణ మాధ్యమం లోని కూర్పుల అంక్షలు లేవు. పరిధి విశాలం. అంతర్జాలం ఒక ఉపకరణంగా ఎంతో మంది కవిత్వం పట్ల ఆకర్షితులవు తున్నారు. ఇప్పటికే 'కవి సంగమం' ఇదే విషయాన్ని ఋజువు చేసింది. కంప్యూటరు సౌకర్యం ఉన్న వారికి పరిమితం కాకుండా పుస్తకంగా తీసుకురావడం అభినందనీయం. వీరంతా భవిష్యత్తు తెలుగు కవిత్వానికి ఆశాదీపాలు. అంతర్జాలం ఇచ్చిన స్ఫూర్తితో వీరందరూ తెలుగునాట గర్వించదగిన కవులుగా రూపాంతరం చెందుతారని ఆకాంక్షిస్తున్నాను.

యానాం,
25-5-2014

**– దాట్ల దేవదానం రాజు**

## మణిమాలిక... ముందుమాట

సృష్టికి మూలం ప్రణవనాదమని శృతుల నుడి !

ఆ "ఓం"కార నాదం నుండి పుట్టినవే సకల ప్రపంచ భాషలూ యాసలూ... అరుదైన అజంత భాషలో ఒకటైన తెనుగు భాష అతి మధురమైనది... అనేక మంది పరభాషీయులు ఒప్పుకున్నారు... తెనుగున యాసలు మాండలీకాలు జానపదాల ప్రభావం మెండు... అయినప్పటికీ సంస్కృత పద భూయిష్టమన తెనుగుభాష... ప్రామాణికంగా చెలామణీ అవుతోంది, దీనినే శిష్టభాష పండిత భాష అని కూడా అనవచ్చేమో... కాలక్రమేణా అనేక సాహితీ ప్రక్రియలు మన తెనుగున వెల్లివిరిసాయి... పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు, నాటకాలు, నవలలు మొదలగునవి. "ముఖపుస్తకావిష్కరణము"తో అన్నిరంగాలలోనూ సంపర్కత, సమాచార ప్రసరణ మరింత వేగవంతమైంది. నేటి ముఖపుస్తక సాహితీ ప్రక్రియల్లో నన్ను అమితంగా ఆకట్టుకున్నది ఈ "మణిమాలిక".

అలతి పదాలతో అనంతార్థమును ఆవిష్కరించే సాహితీ సాధన ఈ మణిమాలిక. అడ్మిన్స్ శ్రీ ప్రసాద్ అట్లూరి గారు, శ్రీమతి పద్మాశ్రీరాం గారు నన్ను ముందు మాట వ్రాయమన్నప్పుడు నాకు బెరుకు కలిగింది సుమా! నాకున్న పరిమిత తెనుగు సాహితీ పరిజ్ఞానంతో నేను నిజమైన నిక్కచ్చైన విశ్లేషణ ఇవ్వగలనా అని... కానీ వారి మాట కాదనలేక ముందుమాట వ్రాయుటకు సాహసిస్తున్నాను..

ఈ మణిమాలిక ముందుమాటకై వారు పంపిన అందరు రచయితల, రచయిత్రుల కవితా లతికలను ఎన్నాళ్ళనుంచో చదువుతున్నాను. ఇప్పుడు మరలా చదివాను. తెనుగున ఇంతవరకూ ఏ సాహితీ ప్రక్రియకు తీసిపోని అద్భుత ప్రయోగం ఈ మణిమాలిక. ఎవరి మస్తిష్కంలో తొలుతగా ఈ ప్రయోగానికి బీజం పడిందో కానీ నిజంగా వారెంతో అభినందనీయులు...

ప్రతిమనిషి తన దైనందిన జీవితంలో ఎదుర్కొనే వివిధ సమస్యలు, కష్టసుఖాలు, వేదాంత చింతనలు, శూన్యవాదాలు, మిథ్యావాదనలు, వాద... ప్రతివాదాలు, ప్రేమలు, ఆపేక్షలు, మమతానురాగాలు, విరహాలు ఇలా ఎన్నో... మరెన్నో... అన్ని భావాలు కేవలం రెండే రెండు వాక్యాల్లో తెలుపటం త్రుటిలో చదువరులను తమ భావ పరంపరతో కన్నీరు పెట్టించడం, నవ్వించడం, నిరాశావాదం నుండి ఆశావాదానికి మళ్ళించి కార్యోన్ముఖులను చేయటం సాధారణ విషయం కాదు! అదే ఈ మణిమాలికల గొప్పతనం! క్లుప్తత...భావసాంద్రత...తద్వారా

ఆశయసాధన సకారాత్మక దిశలో!

అందుకే నా హృదయాన్ని ఈ మణిమాలికలు అంతగా చూరగొన్నాయి! ఈ మణిమాలికలను సాటి మానవుల, చదువరుల కష్టాలను ఆనంద డోలికలు గాను, కరదీపికలుగాను మార్చి నీలో మంచిని అలాగే ఉంచుకో... రోజుకొక మంచి చొప్పున ఇంకా నీలో పెంచుకో అన్న చందాన సాగిస్తూ కవితా వ్యవసాయం చేస్తున్న అనేకమంది నా సోదర సోదరీమణులు వెలయిస్తున్న మణిమాలికా కవితల విలువ ఇంత అని చెప్పగలమా?

ఓ ఇరవై సంవత్సరాల లోపు కుర్రాడి మాలిక చదివాను...ఇతనిలో ఇంత మానసిక పరిపక్వతా? అని ఆశ్చర్యపోయాను! మరో మధ్య వయస్కుని మాలిక చదివాను కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి... అమ్మ గురించిన మధురానుభూతితో..! మరో సోదరి మాలిక చదివాను ప్రతిరోజు ఆ మాలికను మెడను ధరించకుండా మెదడున స్మరించకుండా ఉండలేక పోతున్నాను..

అనేకమంది సోదరీమణులు కూడా మణిమాలికలల్లడం కడు శ్లాఘనీయం! "యత్రానార్యస్తు పూజ్యంతే" నిజం చెప్పొద్దూ నేను స్త్రీ పక్షపాతిని! ఏ ప్రతిభ నాలోవుండి ఈ ముందుమాట వ్రాస్తున్నానో నాకు తెలియదు కానీ... ప్రతి మణిమాలిక ఓ గతకాల గమనిక, ఓ వర్తమాన ప్రచలగీతిక! ఓ భవిష్యకాల "అభ్యుదయవేదిక" అని ప్రగాఢంగా విశ్వసిస్తూ...

భవదీయుడు
**సాహితి**
సినీ గీత రచయిత



**ప్రసాద్ అట్లూరి**
ప్లాట్ నెం. 43, ఈశ్వర్ విల్లాస్,
నిజాంపేట, కూకట్ పల్లి,
హైదరాబాద్ - 500090
కలం పేరు: )-బాణం->
వృత్తి : బిల్డర్ (నిర్మాణ రంగం)
మొబైల్ : 85000 87000
ఈ-మెయిల్: prasadatluri18@gmail.com
వెబ్: www.telugulokavithalu.com

# మది(ణి) మౌక్తికాలు...

1. సుఖదుఃఖాలను వేరుగాచూస్తావే
కన్నీళ్ళైనా ఆనందభాష్పాలైనా ఉప్పగానేగా ఉంటాయి

2. ఊహలు  మనసును మోసే గుఱ్ఱాలైతే
వాస్తవాలు ఎగిరి తన్నే గాడిదలు

3. ఇంకా ఎన్ని అడుగులు వేయాలి?
నన్ను వీడడానికి ... నిన్ను చేరడానికి!

4. నువ్వు లేవని తెలిసింది
నవ్వుకూడా ముఖం చాటేసింది

5. నీ వయ్యారాన్ని వర్ణిస్తూంటే
నా మాటలన్నీ ఖర్చయిపోతున్నాయి

6. నా ఊహల విహంగాలు నన్నొదలి
నీ మనసు ద్వీపానికే వలసపోతున్నాయ్!

7. పగలూ రేయీ రెండూ నాకిష్టమే
లేదంటే కలువ...పంకజం అలుగుతాయి

8. మాసిన బట్టల్లో చిరుగులు
దాయలేని దారిద్య్రం గురుతులు

9. ఎక్కుపెట్టిన ఇంద్రచాపంలా తను
తప్పుకోలేక తట్టుకోలేక నేను

10. మగాడి కళ్ళలో తిరిగే సుడిగుండాలు
ఎన్నటికీ తీరందాటలేని కడలి అలలు

11. నేల నిద్రకి ఉపక్రమించినట్లు ఉన్నది
వెన్నెలదుప్పటి కప్పుతోంది నింగి ప్రేమతో

12. ఆశల పల్లకిలో జీవితం ఊరేగుతోంది
బోయీనైన నన్నుచూసి జాలిగా నవ్వుతోంది

13. నీమనసు గెలిచే ధ్యాసలో పడి
నామనసు పారేసుకున్న విషయం మర్చిపోయా!

14. పగలురాత్రి చెప్పకనే చెబుతున్నాయ్
దేవుడు ఆడుతున్న దాగుడుమూతల్ని

15. నిన్ను కలసిన తొలి క్షణమే
నన్నుమరచిన మొదటి క్షణం యాదృచ్ఛికంగా

16. ఎప్పట్నుంచో నాకు ఒక కల
వచ్చిన కలలన్నీ గుర్తుపెట్టుకొని అచ్చేయించాలని

17. పంటకి ఎరువుకోసం రైతులు క్యూల్లోనా
పండించింది తింటూ జనం హోటళ్ళలోనా

18. నీ స్మృతుల సుడిగుండంలో చిక్కితే
వాస్తవం వడ్డుకి చేరటం కష్టమేసుమా!

19. పౌర్ణమికి తెల్లచీర అందం
నెలవంకకి తెల్లంచునల్లచీర అందం

20. జీవితం ముళ్ళున్న పువ్వుల చెట్టు
తెలివిగా పూలెలా కోసుకుంటావో నీఇష్టం

21. మాటల తోటలో పరిచయమైంది ఎదకు
విరహాల వీధిలో వదిలిపోయింది తుదకు

22. స్వాతంత్ర్యం వెలుగు తెస్తుందనుకొంటే
నల్లదొరల్ని నల్లధనాన్ని తెచ్చిందేమిటి

23. గతం కొలను తిరగ తోడుతుంటే
ప్రతి బిందువులో ప్రతిబింబమై తను!

24. అలవాటు ప్రకారం ఆరింటికే లేద్దామని అనుకున్నా
స్వప్నసుందరి వచ్చి దుప్పట్లో దూరింది ఇంతలో

25. ఏమన్నా పోగొట్టుకుంటే తెగ బాధపడిపోతుంటాం
మరి మనసు పారేసుకుని మురిసిపోతామేంటి

26. నీ జ్ఞాపకాల కవాతుని ఆపవా
నా మనసు నేల ఛిద్రమవుతోంది

27. నీ ప్రేమలేఖలన్నీ తెల్లకాగితాలు అయ్యాయి
నువ్వేంటో తెలిసి తెల్లబోయిన అక్షరాలతో

28. కలల కొలనులోకి జారిపడిన ప్రతిసారీ
తనే వద్దుచేరుస్తుంటే పేరడిగా... 'వేకువట'

29. గతానికి ఎప్పుడూ బడాయే
వర్తమానాన్ని తనే మోస్తోందని

30. నాగుండె నిండుగా జ్ఞాపకాలు
కొన్ని నీఅధరంలా తీయగా..ఇంకొన్ని నీహృదయంలా చేదుగా

31. నా గుండె ఆగిపోయేలా ఉంది
నీ జ్ఞాపకాల బరువును మోయలేక

32. 'నన్ను ప్రేమించడానికి ఎన్ని గుండెలు' అంటోంది
మీరే చెప్పండి, ఎన్నికావాలి ఒక్కటి చాలదూ

33. మూగదని మనసుని గేలిచేస్తాం కానీ
మాటలొచ్చి మనం మాత్రం చేస్తున్నదేమిటి

34. నీచూపులు గుచ్చుకుంటున్నాయ్
విలుకానివా నువ్వు ....అడిగింది తను

35. నీ నవ్వొచ్చి
నా నవ్వుని చెడగొట్టింది తెలుసా

36. ఆకాశం వంగిపోయింది
బహుశా వయోభారమేమో!

37. ప్రతిదాన్ని బూతద్దంలో చూస్తావే నువ్వు
మనసు కాగితం మండిపోతుందని చెప్పానా?

38. నీమౌనమూ ఒకోసారి బావుటుంది
నీపై నాకున్న ప్రేమను తెలుసుకొనే అవకాశాన్ని కల్పిస్తూ

39. దస్తావేజులతో వచ్చింది తింగరబుచ్చి
'నా మనసుపై హక్కులన్నీ నీకే రాసిచ్చేస్తా' అన్నానని

40. జీవితాంతం బ్రతికేవాళ్ళమే అందరం
బ్రతికినంతకాలం జీవించేది ఎందరం?

41. నా మనసేమైనా ప్రేమసత్రమా..?
నీ ఇష్టమైనప్పుడు వచ్చిపోవడానికి..!

42. రాత్రి పెరట్లో రాలాయి వెండిపువ్వులు
తెల్లారేసరికి ఎవరో ఏరుకుపోయారు మొత్తంగా

43. నీగుండెల్లో కొంచెం చోటిస్తావా
ఇంటికి అద్దెకట్టలేక చస్తున్నా

44. ప్రతి పలకరింతకీ ఓనవ్వుల పువ్వు విసురుతోంది
బహుశా...తను వసంతుడి కూతురై ఉంటుందేమో!

45. అయిష్టంగానే నిష్క్రమించింది పాపం ప్రేమ
మనమధ్య తనకిక చోటులేదని తెలుసుకున్నాక

46. గతించిన కాలంలో గడించిన అనుభవమంతా
రాబోయే రోజుల్లో కాబోయే మూలధనమేగా!

47. రహదారి నిండా రాలినపూలే
మానవత్వాన్ని ఈదారినే తీసుకుపోయారా!

48. అందరూ తిడుతున్నారు తెలుసా
అక్షరాలన్నీ నీకోసమే ఖర్చుచేసేస్తున్నానని

49. నీపరిచయంలోని మాధుర్యమేగా
నాకు మధుమేహాన్ని పరిచయం చేసింది

50. ఎంత విచిత్రం!
నువ్వులేని నీలో నేనుండటం, నేనులేని నాలో నువ్వుండటం

51. నీ తలపుల తాకిడి తీవ్రతకి
నామది తలుపులు బద్దలయ్యేలా ఉన్నాయి

52. వేకువ వళ్ళు విరుచుకుంటోంది
చీకటి చాపని చుట్టేసి... దిక్కుల చాటుకి విసిరేసి

53. నా కలల్ని పండించుకోవాలి
నీ హృదయాన్ని కౌలుకిస్తావా!

54. రాతిరంతా గస్తీ తిరుగుతాడు చందురుడు
కలువబాల మనసు ఎవరైనా కొల్లగొడతారేమోనని

55. నా హృదయాన్ని సిద్ధం చేసా
నీ ప్రేమ వంగడాన్ని సాగుచేయడానికి

56. నామనసుకి వైధవ్యం ప్రాప్తించింది
చచ్చిపోయిన నీప్రేమ కారణంగా

57. గుడిమెట్లపై ఎదురుపడతాయేమో ప్రతిరోజూ
పాపం పుణ్యం, వస్తూ ఒకటి పోతూ ఇంకొకటి

58. అప్పుడే తెల్లారిందా మళ్ళీ!
మార్నింగువాక్కి వచ్చేశావు గుండెల్లోకి

59. నా గుండెకు ఊబకాయం వచ్చేలావుంది
నీ మధురస్మృతులు అపరిమితంగా రుచిచూస్తుంటే

60. నామనసుకు ఆజ్ఞలు జారీచేస్తున్నావ్
హృదయపు సింహాసనంపై కుర్చోపెట్టుకున్నాననేగా

61. పాపం, ఏమి బాకీఉన్నాడో
చుక్కలన్నీ చంద్రునిచుట్టూ తిరుగుతున్నాయ్

62. ప్రశ్నార్ధకంగానే మిగిలిపోయింది
నీ జవాబురాని .. నా జీవితం

63. అక్షరాలను ఎంతలా మచ్చిక చేసుకున్నావ్!
ఎప్పుడూ నీగురించే వ్రాయటానికి ఇష్టపడుతున్నాయ్

64. చీకటి వెలుగుల జీవన వేదికపై
కష్టసుఖాల నాటకం ఆద్యంతం వైవిధ్యభరితం

65. చూశావా, ఎన్ని మధురానుభూతుల్ని విరబూస్తోందో
నాహృదయంలో నువ్వు నాటిన ప్రేమమొలక

66. నా ప్రేమని ముడుపు కడుతున్నా
నీ దర్శనానికి సమయం కుదరటంలేదని

67. కన్నీళ్లను తుడవటం తెలిసిన చేతులున్నవాడికి
కన్నీళ్ళు పెట్టించకుండా చూసుకునే మనసుండదా

68. నీ జ్ఞాపకాల చిక్కుముడుల్ని విప్పవా
నా గతాన్ని నీనుంచి విడిపించుకోవాలి

69. నీమనసులో ఏముందో తెలుసుకోడానికి
ఎన్ని ఊసుల ఉపగ్రహాల్ని పంపాలి నీహృదయం పైకి

70. ఎంతటి నిర్దాక్షిణ్యం
నా మనసుని అన్యాక్రాంతం చేస్తున్న నీ తలపులకి!

71. నా మనసు పుస్తకం పేజీలు తిరగేస్తుంటే
ఎదురైన ప్రతి అక్షరమూ నీగురించే అడుగుతోంది

72. కన్నీళ్ళనే కానుకగా ఇచ్చిపోతుంది ఎందుకనో
తను గుండెల్లోకి వచ్చిన ప్రతిసారీ..!

73. నీచూపులతో చుట్టరికం కుదిరింది
బ్రహ్మముడితో బంధాన్ని బలపర్చుకుందామా

74. వసంతంలా విరబూసిన నా ప్రేమకి
శిశిరాన్ని పరిచయంచేసిన ఘనత నీదే

75. అలుపెరుగని పయనం కాలానిది
అడుగడుక్కీ మరణం క్షణానిది

76. రాత్రి డాబాపై కురిసిన వెన్నెలవాన
తెల్లారేసరికి ఇంకిపోయింది చుక్క మిగలకుండా!

77. మీఅమ్మాయికి సిగ్గెక్కువా
ఆహా.. కాలిబ్రొటనవేలు సగం అరిగిపోతేను

78. రాజకీయ క్రీడ
ఎవరెవరితో ఆడుతున్నారో తెలియదు చూసేవాడికి

79. నా ఆశల్ని నిమజ్జనం చేస్తున్నా
లోతు తెలియని కన్నీటి జలాశయంలో

80. అదృష్టం తీరం తాకేవరకూ ఆగవులే
కష్టాల కడలిలో అవస్థల ఆలలు

81. ఇంత మత్తుగా ఉంటోంది!
నీప్రేమలో.. క్లోరోఫాం కలిపావా!

82. ఎన్ని నిఘంటువుల్ని మింగేసుంటావో చిన్నప్పుడు
నీచూపుల్లో ఇన్నిన్ని అర్థాలు దొరుకుతున్నాయ్

83. అనుబంధాల్లో ఆత్మీయత తగ్గినప్పుడు
బంధాలన్నీ పలుపుతాళ్ళగానే తోస్తాయి

84. నా జీవిత నవలకి నాయికవి నువ్వు
నా మనసు పుస్తకానికి ముఖచిత్రానివి నువ్వు

85. నా గుండె గాదుల్నిండా
తీపి జ్ఞాపకాల ధాన్యాలు, అన్నీ నువ్వు నింపినవే

86. నేల రాలిన పూలమని చులకనేల
దైవాన్ని పూజించని తప్పు మీదికాదా

87. చివరిబెంచి కుర్రాడినే తరగతిలో
ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడినయ్యాగా నీప్రేమలో

88. నీ నిర్లక్ష్యపు చూపులని త్రిప్పుకోవా
నా మధుర స్మృతులు మాడిపోతున్నాయ్

89. నీకన్నుల్లో ఉదయాన్నే ఉదయించా
సాయంత్రానికల్లా అస్తమింపజేస్తావని తెలియక

90. ఏ న్యూటనూ చెప్పలేదే..?
నీ గురుత్వాకర్షణ శక్తి నానుండి నన్ను లాక్కెళుతుందని..!

91. గుడిమెట్లపై పేదరికం గుడ్డలు పరిచింది
దేవుని పక్షపాతానికి పరిహారం కోరుతూ

92. పల్లెలు వెలవెలబోతున్నాయ్... బ్రతుకుల్లాగ
పట్టణాలు ఇరుకైపోతున్నాయ్... మనసుల్లాగ

93. నిన్ను నువ్వు తీసుకున్నంత సులువుగా
నన్నూ నాకు ఇచ్చేయగలవా యధాతథంగా

94. దరహాసంతో పెంచావ్ పరిచయాన్ని
పరిహాసంతో విరిచావ్ హృదయాన్ని

95. పరిచయాలు కావాలా
మనిషివని చెప్పడానికి..మానవత్వం చూపడానికి

96. మనసు ప్రమిదలో ప్రేమదీపం వెలుగుతోంది
తలపుల తైలాన్ని మురిపంగా వంపుకుంటూ

97. ఆనందం తనకు అమరత్వం కావాలంది
చిరునవ్వై నీ పెదవులపై చేరిపొమ్మన్నా

98. వెన్నల కళ్ళాపి జల్లుతోంది జాబిల్లి
చుక్కల్ని పట్టుకొచ్చి ముగ్గులు వేస్తుందేమో

99. శ్రద్ధగా వినవే!
నీ ముంగురులు ముచ్చటించేది నాగురించే

100. 'నిన్న' అలిగింది నా మీద
నాతో తనని నేటికి తీసుకురాలేదని

101. నీపేరు 'లతే'కదా?
అలవోకగా అబద్ధాలల్లేస్తుంటేను!

102. నీ మనసులో చోటడిగితే తప్పేంటి?
నా మనసుని పారేసుకున్నది నీకోసమేగా

103. మల్లెలు తేలేదని అలిగినట్టుంది
మందారాలు పూయిస్తోంది కళ్ళల్లో

104. దస్తూరి బాగుందని ప్రేమించిందంట
జాతకాలు కుదరట్లేదు విడిపోదామంటోంది

105. గమ్యంలేని గాలిపటమైంది మనసు
నీఅభిమానపు దారం తెగిపోయాక

106. ఊరబావి గిలక శబ్దం మూగబోయింది
ఊరికొచ్చిన కర్మాగారం రాకాసి కేకలకి

107. ఆడపిల్లవేనా నువ్వసలు అన్నానని
బుగ్గన సిగ్గుల ముగ్గులేసి మరీ చూపించింది చెలి!

108. వెన్నెల మత్తుగా నవ్విందంటే
చీకటి చిత్తుగా ఓడిపోవలసిందే

109. నీ పెదవులు తియ్యదనం ఎంతో
నీ చిరునవ్వుని చూస్తే తెలుస్తుంది!

110. నిన్నీ పూతోటలోకి రావద్దంటే వినవు
నీనవ్వుల్ని పువ్వుల్ని వేరుచేయలేక చస్తున్నా

111. ఓ క్షణం క్షమాపణ అడిగింది
నిన్ను నానుండి దూరం చేసినందుకు

112. ఎదురుచూపుల కాగడా ఆరిపోయింది
నీ నిర్లక్ష్యపు గాలిదుమారానికి

113. ముదనష్టపు రాజకీయాలు ఇంకెన్నాళ్ళు?
మేనిఫెస్టోల కర్చీపుతో కళ్ళుతుడుస్తూ

114. మండుతున్న గుండెపై
మంటలార్పుతున్న ఫైరింజను నీళ్ళులా...వెన్నెల

115. మాటి మాటికి గుండెల్లో గుడారాలేస్తావ్
అదేమన్నా పర్యాటకప్రాంతమా విహారానికి రావడానికి!



**పద్మకుమారి వంగర**
ప్లాట్ నెం. 201, హౌస్ నెం.5-9-22/1/1
అశోకా ఛాంబర్స్, ఆదర్శనగర్,
హైదరాబాద్-500063
కలం పేరు: స్ఫూర్తి
వృత్తి: సివిల్ ఇంజనీర్
మొబైల్ నెం. 93913 57134
ఈ-మెయిల్: vpadma39@yahoo.com
వెబ్: www.sphoorty1.blogspot.in

# మాలికా పద్మాలు...

1. నాప్రేమ స్వచ్ఛమైనదైతే
   నువ్వెందుకు నాకు నీజ్ఞాపకమే చాలు

2. ఆకాశానికి అరనిమిషం విందు
   హరివిల్లొచ్చింది ఇవాళ మరి

3. మందారం సిగ్గుతో ముడుచుకుంది
   మల్లిక పరిమళం తాకి

4. మదిగది ఖాళీ చేస్తేచేసారు
   కనుల కొలను నింపిపోతారెందుకో

5. కన్నీళ్ళూ కాకెంగిళ్ళూ దోస్తీ
   అందమైన బాల్యం మరది.

6. తోటంతా పూసాయి పూలు
ఏవెక్కడకెడతాయో తెలీదు గానీ

7. మానవత్వం మరణించింది
ఓ నిమిషం మౌనం పాటిద్దాం

8. తనువెంత శ్రమిస్తోందీ
చచ్చేదాక బ్రతికేందుకు

9. కాయితప్పడవలకిక శలవే
నే పెద్దైపోయానుగా

10. పడిపోతానని భయమేమో
జాబిలెప్పుడు ఇంద్రధనుసు పల్లకీ ఎక్కదు

11. చందమామని గోడకుర్చీ వేయించాలి
ప్రతీఅమాసకీ స్కూల్ మానేస్తాడు

12. చినుకుపిల్లకి భలే ధైర్యం
ఎవరికీ చెప్పకుండా వచ్చేస్తుందెప్పుడూ

13. తుషార కన్యది ఏ కాలేజో
గడ్డిపరకలపై కూడా ఇళ్ళు కట్టేస్తుంది

14. మట్టి చల్లబడుతోంది
రాలిన పూల పరిమళం పీల్చుతూ

15. వసంతం
ప్రకృతికి సీమంతమేమో

16. మౌనపు బిరడా తీయవా
ఊసుల తాయిలం పెడతా

17. అనుకున్నప్పుడల్లా కొనుక్కోలేము
ఆనందం అంగడి సరుకు కాదు

18. ఏంటో పేజీలు తడిసినట్లున్నాయి
నువ్వూ ఏడ్చావా డైరీ

19. వసంతానికేం తెలుసు విరబూయడం తప్ప
శిశిరానికేం తెలుసు రాల్చేయడం తప్ప

20. ఉలి తాకితేనే వికసిస్తాయి రాయీ రప్పా
కవి అడిగితే పూలు వికసించడమేమి గొప్పా?

21. గాయం చేసే మాటతూటాకు తెలియదు
తగిలి ముక్కలైన మనసు చిరునామా

22. ఆకాశం పాత బడదుగా
సూర్యోదయం రోజూ ఉన్నా

23. ప్రతిపదం కవితవుతోంది
ఏం మహత్తు పూసావు నాఅక్షరాలకు

24. అక్షరం అలంకారాలద్దుకుంటోంది
ఆకాంక్షలకు ఆకారాన్నిస్తూ

25. నాశిష్యుడు అమెరికాలో ఇల్లుకట్టాడు
పూరిగుడిసెలోని బడిపంతులు ఆనందం

26. శిశిరమొచ్చింది మరి
తుమ్మెదకిక సాపాటుక్కరువే

27. గోరింట రాలాక అందమిస్తుంది
చిత్రం వరిపంట కూడా రాలాకే ఆకలి తీరుస్తుంది

28. అరచేతిలోనే చందమామ ఎర్రగా
పాపాయి నిద్రిస్తోంది ఆదమరచి

29. అడవిలో ఎర్రపూల తురాయిచెట్టు
అందమంతా అడవిపాలంటే అర్థమయ్యేట్టు

30. నువ్వూ నిద్రా రెండూ ఇష్టమే
నిన్ను కలలో తెస్తుందమ్మా నిద్ర

31. ఏంటో నువ్వెళ్ళిపోయావ్
నీ తలపులు మిగిల్చిన విషాదం నాతోనే ఆపి

32. మర్రిచెట్టు విస్తరిస్తూనే ఉంది
నేలరాలిన ఆకుమాత్రం గొణుక్కుంటూనే

33. పిచ్చిదారం పూలకు బంధాలల్లుతోంది
పూలు వాడి రాలిపోతూ దారం ఏకాకిగా  మిగిలిపోతూ

34. రాత్రి కొండమీంచి దూకాడేమో సూరీడు
గాయాలతో పొద్దున్నే వచ్చాడు ఎర్రగామండుతూ

35. ఉదయాన్నే చల్లనిగాలి
రాతిరి జాబిలి వదిలిన వెన్నెలదేమో

36. మది ఎడారైంది
ఎన్ని జ్ఞాపకాల వసంతాలనివ్వాలో పచ్చదనానికి

37. బాల్యాన్ని దాటి ఎదిగింది యవ్వనపు జలపాతం
ఇప్పుడు నిశ్శబ్దమైన మౌనపు నదే..మరి

38. వసంతం గొప్ప గాయని
ఏడాదికి ఒకసారొచ్చే కోకిలకు ఇట్టే సంగీతం నేర్పేస్తుంది

39. జీవన ప్రయాణంలో ఎన్ని ఊర్లు మారానో
నా తలపులు మాత్రం నీతోనే.... నీదగ్గరే

40. గాలి గొప్పసోషలిస్ట్
పూలను ఆటపట్టిస్తూనే ముళ్ళతోనూ ముచ్చట్లాడుతుంది

41. నువ్వు కలలోకి వస్తానంటే
జీవితాంతం నిదురిస్తూనే ఉంటా రాని కలల కోసం!

42. మౌనం బలమైన ఆయుధం
చేజారనీకు నిశ్శబ్దంలో సైతం సవ్వడించే ఏకైక నేస్తమది

43. విజయమెప్పుడూ ఒంటరిగానే పయనమౌతుంది
విజేతమాత్రం ఎప్పుడూ ఒంటరవడు

44. కళ్ళల్లో మేఘాలున్నాయా
నా చూపు సమీరానికి వర్షిస్తావ్

45. ఆకాశరాజు ప్రేమలేఖలు
కుండపోతగా వాన ధరణి కన్నెపై

46. రాలిన పూలు చెప్పాయి
నీ శ్వాస తాకలేదని

47. కవిత్వం నా భాష కాదు
భావదారిద్ర్యంలో మగ్గిన నా అక్షరఘోష

48. నీ మాటలకన్నా నీ మౌనమే తేలిక
నాకు ఇష్టమొచ్చిన భాషలో అర్థం చేసుకోగలను

49. మృత్యు దేవత జెండర్ మార్చేసుకుందట
మృగాళ్ళ దగ్గరకీ వెళ్ళాలిగా మరి

50. ధనుర్మాసపు శీతలం
తారలన్నీ సూర్యుణ్ణి చేరాయట జాబిలినొదిలి

51. వసంతం పరుగెత్తుకొచ్చింది
నా పిలుపు కోయిల పాటనుకొని

52. పలకరింపుల విత్తులు నాటు
ప్రేమ పంట మనసుకొస్తుంది

53. అక్షరం అల్లిబిల్లిగా అల్లుకుపోతోంది
ఉంటుందో లేదో తెలియని రేపటి కవిత కోసం

54. ఒంటరైనా విలువే
సాహితీ ముత్యానికి

55. ఎంతవానో
ఇంద్రధనుస్సు మాత్రం తడవట్లేదు

56. పరిమళాలు గాలికి గంధాలద్దుతున్నాయి
చెలి చెక్కిళ్ళు తాకొచ్చాయేమో

57. మళ్ళీ చేద్దాం పయనం
మురిపిస్తోందిగా ముద్దుగా బాల్యం

58. నిశ్శబ్దానికీ కన్నీళ్ళున్నాయి
ఒంటరినదికీ కడగండ్లున్నట్లు

59. పిచ్చి కళ్ళు
పరాయిబాధకు సైతం మండే వాకిళ్ళు

60. దూరంగా ఓ మౌనం
జ్ఞాపకాలకు తెర దించుతూ

61. తేలికయింది మది
ఊసులన్నీ నీ ముంగిట చల్లి

62. శిలగా మారు
ఉలికైనా పనొస్తుంది

63. గుండెకు గాయమైనా
కళ్ళే ఏడుస్తాయి అదేంటో మరి

64. పాపిట సింధూరం
చెలి సిగ్గుల్లో సైతం సింగారాలొలకబోస్తూ

65. చేజారిన చెలిమినడుగు
మాట తూలిన మనసెంత తు(స్వ)చ్ఛమో

66. పూబాలలకెలా తెలుసు
నీపై వీచినగాలి తాకిందని..పరిమళిస్తున్నాయి

67. అద్భుతాలన్నీ నీ అలవోకలోనే
ఏడేడు వింతలు వేరెక్కడ

68. రేపటితో నాకు పనేంటి...
నిన్నల్లో నీతో నిలిచాక

69. ప్రేమంటే –
ఒకనువ్వు ఒకనేనూ... కానే కాదు ఒక మనం...

70. మూగవోయింది కంటి విపంచి
ఎదకు చెలమతీగలు బిగిస్తూ

71. రేయి గడవకుంది
ఏంటో... సూరీడిక్కూడా ఆదివారం శలవేమో

72. తుషారకన్నెకి తెల్లవారలేదేమో
కురుస్తూనేవుంది గుబులుగా

73. ఆరితే వెలిగించేందుకు తప్ప
నా అరచేతులు దీపానికెందుకు

74. ఓ గుప్పెడు ఊసులీయవూ
నా ఊపిరికూపిరి పోస్తా

75. గుండెలో భావాలన్నీ ఒలికిపోతున్నాయి
శూన్యమైపోతుందేమో ఎద పాత్ర.

76. అడుగుజాడలు కనపడుతున్నా
అనుసరించలేని అక్షరం నా కవిత్వం.

77. మరణిస్తాను
నువ్వు తోడుండే నిన్నల్లోనే

78. ఉలౌదామనుకున్నా
నొప్పి కలుగుతుందని అలగా మారా

79. లోలాకులూ చాటు కావాలంటున్నాయి
నీ చిలిపికబుర్లు వింటున్నాయిగా

80. వర్తమానమో అతుకుల బొంత
ఎప్పుడూ మదిచిరుగులు కనిపిస్తూనే

81. మరణం చిన్నబోతోంది
మరికొందరికి అవయవదానంతో జీవం చూసి

82. మేధావివే నెత్తురు రానీయవు
సుతిమెత్తగా గుండెను కోస్తూ

83. వేచి విసుగ్గా రాల్తునాయి
కాలపుకొమ్మ నుంచి క్షణాలపూలు

84. గడియారానికీ నాలా బద్ధకమేమో
నెమ్మదిగా ముళ్ళను కదిలిస్తూ

85. ష్... చెలిమి నిదురిస్తోంది
నీ పలుకుల అలికిడినీయకు

86. చెక్కిళ్ళకెందుకో ఇంత నిస్పృహ
ఎన్నినీళ్ళు కారినా నిలవనీక

87. నాతో ఉన్న నిన్నల్నడుగు
నేడు నీకున్న మధురాలేమిటో

88. శిలనే
నువ్వు ఉలివై తాకేవరకు

89. శబ్దమే హాయి..
నిశ్శబ్దం నిన్ను మించిన నియంత

90. అక్షరాలకు చిలిపితనం అబ్బేసింది
సాహిత్యమంతా చిరునవ్వుల జలపాతమౌతూ

91. నీ వలపు గులాబీల నది
నామమతను గుచ్చుతున్న ముళ్ళుసైతం మోస్తూ

92. నిద్ర చాలని నిశిలో
ఈదుకొస్తూ ఎదురుగా ... నీజ్ఞాపకం

93. ప్రేమగా పదిజన్మలు మోస్తా
ఈజన్మలో తలకొరివి పెట్టవూ

94. ఉలికులికి పడుతున్నావ్
బలమైన జ్ఞాపకం సూటిగా తాకిందా

95. పూలు సింగారించుకొంటునట్లున్నాయి
పరిమళాన్నో పరవశాన్నో

96. అలక పాట కష్టమే
గొంతు బొంగురు పోతూ

97. ఎంత త్యాగమో...చిత్రంకదూ
నిలువెల్లా గాయాలయిన వేణువు సైతం పాటపాపకు ఊపిరినిస్తూ

98. కాగితం వయారాలు పోతోంది
అందాల అక్షర కన్యలన్నీ తన ముంగిట కొలువుంటాయని

99. ఏది పగిలినా ఆవేదనే
నిశ్శబ్దం పగిలితేనే ....ఆనందం

100. యామినికి మర్యాద తెలీదు
జాబిలికి దప్పికైనా తీర్చదెపుడూ

101. చెలిమి జీవిస్తోంది
చచ్చేదాక బ్రతికించేందుకు

102. అక్షరం పొరాడుతోంది
కవితలో పరిమళించాలని

103. అలుకింత శీతలమా
గుండె గదిని గడ్డ కట్టిస్తూ

104. కాళ్ళు నొప్పిగా ఉన్నాయ్
నీ కలల్లో నడిచివచ్చా

105. ఉత్తరమెంత బరువో...
'అత్తింటికెళ్ళిన ఆడ' పిల్ల వ్రాసిందేమో

106. నిదురభామ అలకతో
కలలకన్యలకు మరణాలు

107. మావికన్యకి పెదవిగాటు
వసంతుడు కోయిలతో గాయం చేయించాడేమో

108. తీరానికెన్ని గాయాలో
అలలకన్య ముద్దాడుతుంటే

109. శిశిరకన్య గాయపడ్డట్లుంది.
పత్రరుధిరాలు జార్చుతోంది

110. లెక్కించలేనన్ని వెక్కిళ్ళు
కాలం వేళ్ళ సందుల్లోంచి జారిపోయిన గతం వెక్కిరిస్తుంటే...

111. కలల కన్య చీకటిపై అలిగిందట
నాకళ్ళవాకిలికి రానంటోంది మరి నిద్దుర

112. ప్రేమలేఖ ఎలా వ్రాయాలి
ప్రతి తలపూ విరహగీతమౌతుంటే

113. కెంపులు పూయకు చెక్కిలికి
సూర్యాస్తమయం అవుతుందేమో పుడమికి

114. గుండెఎండలో ఆరేస్తున్నా
తడిసిపోతున్న జ్ఞాపకాలన్నీ

115. విషాదానికి మనసంటే ఎంతిష్టమో
పిలవకపోయినా పరుగెత్తుకొచ్చి కౌగిలిస్తుంది



**భారతీరాయన్న కాట్రగడ్డ**
ఇంటి.నెం.1-1-1523,
రాకాసి పేట్, బోధన్ మండలం,
నిజామాబాద్ జిల్లా-503185
వృత్తి: అధ్యాపకురాలు
మొబైల్ నెం: 8500450540
ఈ-మెయిల్: bharathikatragadda4@gmail.com
వెబ్: www.bharathirayanna.blogspot.in

# జ్ఞాపకాల పరిమళాలు...

1. నీ జ్ఞాపకాల జలపాతంలో..
నిరంతరం అభ్యంగన స్నానమే!

2. కాలం సైతం కన్నీరు కారుస్తుంది
నీవు గతమై నేను వర్తమానమైనందుకు

3. కడలికి ఎంత గుట్టో
నామీద నీకున్న ప్రేమలా!

4. మరణాన్ని సైతం ఆహ్వానిస్తున్నా
మరుజన్మలో నిన్ను కలవడానికి

5. ఆకాశానికే జాలేసింది కాబోలు నాఒంటరితనమ్మీద
అందుకే రోదిస్తుంది ఎడతెరపి లేకుండా!

6. నా ప్రేమ అగరుబత్తీనే
నీవెంత కాల్చినా సువాసనలనే ఇస్తుంది

7. ఆకాశం అవనీ ఎప్పుడూ ఎదురెదురే
కానీ దూరమెంతో మన ఇద్దరిలా

8. కలకాలం కంటినిండుగా వుంటావనుకుంటే
కలలాజారిపోయావు నిద్రలేని నిశిరాత్రులనిచ్చి

9. నీజ్ఞాపకాలను అశ్రువులుగా రాలుస్తూ
అలసి పోతున్నాయి నాకళ్ళు

10. రావొద్దన్నా పదేపదే వస్తావు
జ్ఞాపకపు పరిమళమై పెనవేసుకుంటావు

11. భూమాతవంటూ తెగ పొగుడుతున్నావు
నువ్వేమి చేసినా భరించాలనా?

12. మరపునివ్వమని వేధిస్తావే
నీ జ్ఞాపకాలతో నేను పరిమళిస్తుంటే

13. నా ప్రేమ అక్షయపాత్రే
ఎంతైనా వస్తూనేవుంటుంది

14. మేఘాలకి బాగా అలవాటే
నాకన్నీటి కడలిని లాక్కోవడం

15. నీవు లేవని తెలిసిందేమో
రేయంతా నత్తనడక నడుస్తుంది

16. కన్నీరుకెందుకో ఇంత జాలి
ఎడతెరిపి లేకుండా తనను కారుస్తున్న కంటిని చూసి

17. పేదరికాన్ని తరిమికొడదామంటే
ధనవంతుల గుండెల్లో ఎందుకో ఆగుబులు?

18. నాలో ఉన్న ఏకాంతాన్ని పంచుకోవడానికి
చివరకు నాకు నేనే మిగిలాను

19. నన్ను నేనే కాల్చుకుంటున్నా
నీజ్ఞాపకాల అగ్గి రవ్వలతో

20. నీతోగడిపిన ప్రతిక్షణమూ
నాకెప్పుడూ వర్తమానమే

21. వెతలన్నీ నాకిచ్చావు
నవ్వులన్నీ నువ్వేరుకెళ్ళావు

22. నాకన్నీటి కావ్యం నిండా
నీవిచ్చిన చేదు జ్ఞాపకాలే

23. మరపు మందిస్తావా ప్రియతమా
నీవుచేసిన గాయానికి పూసుకుంటాను

24. సాగరానికి నాకళ్ళను ఏలుకొమ్మని
నీవింత వింతగా మాయమయ్యావే?.

25. కన్నుల్లో అన్నీ బంగారుకలలే
కనురెప్పపై నీవు ఉన్నందుకేమో

26. నెలరాజు కొంటె పనులకి
మబ్బుల బుగ్గలు సిగ్గిల్లాయి!

27. విచ్చుకుంది వెన్నెలమొగ్గ
అందమైన పున్నమిలోన

28. నాకు ఏకాంతమా!
అనుక్షణం నీజ్ఞాపకాలతో నన్ను పెనవేసుకుపోతుంటే?

29. రాత్రంతా విరిసిన నీస్మృతుల్లో
నిద్ర సైతం నివ్వెరపోయింది.

30. కాలానికో ఉత్తరం రాస్తున్నా
హరించిన నా నాథుణ్ణి నాకు తిరిగి ఇచ్చేయమని!

31. నాశ్వాసలో ఎక్కడిదీ సంగీతం
రహస్యంగా నీవొచ్చి చేరినందుకేమో

32. నీజ్ఞాపకాల వర్షంలో
నిత్యం తడుస్తున్నా

33. మువ్వలు మూగబోయాయి
నీసవ్వడులు లేక

34. నా కన్నీటిసాగరం నిండా
నీ జ్ఞాపకాల అలలే!

35. సంక్రాంతికి మాఇల్లు ముస్తాబయ్యింది
వెన్నెల కిరణంలా నీవొస్తున్నావని

36. కారుమబ్బులన్నీ తేలిపోయాయి.
నీ వలపు వీక్షణం సోకగానే

37. సాగరకెరటాలు రావొద్దన్నా ఆగవు.
నీగురించి వచ్చే నాఆలోచనల్లా

38. నాకు షరామామూలేగా
నీలో నన్ను నేను వెతుక్కోవడం

39. ఎంతని తడవను?
నిత్యం నీ జ్ఞాపకాల జడులలో

40. నీకే...మౌనంగానే వెళ్ళిపోయావు
నేనే...వెళ్లలేక శిలనయ్యాను

41. నీజ్ఞాపకాల పుటలు..ఎంత చదివినా
సశేషమనే వస్తుంది ముగింపనేది లేక

42. నామనసు వాలిన ప్రతీ చోటా
నే వెతికేది నీ కోసమే

43. కాలంతోపాటు నేనూ పరుగెడుతున్నా
త్వరగా నిన్ను చేరుకోవాలని

44. గరళాన్ని నాకలవాటు చేసి
గగనంలోకి చిరంజీవిలా వెళ్ళావు

45. ఆదమరచి నిద్ర పోతున్నా
కవ్వించే నీకలల తీరంలో

46. బాల్యం బందీ అవుతోంది
కేజీలకొద్దీ బరువున్న పుస్తకాలసంచీలో

47. నీమనసుకి రెక్కలున్నాయి కాబోలు
అస్తమానూ నాముంగిట్లోనే వాలుతుంది

48. కళ్ళకెందుకయ్యా కన్నీళ్ళనిచ్చావు.
దుఃఖమైనా ఆనందమైనా మేమే వస్తామంటున్నాయే

49. గతం చేసిన గాయానికి
భవిత లేని శిలనయ్యాను

50. నీ జ్ఞాపకాల గాయాలే
నా కవితలకి సిరాచుక్కలయ్యాయి

51. గాయాలెన్నైనా చేయగలవు
పారేది నా రక్తకన్నీరే కదా

52. నా మనసు భ్రమరమే!
నిరంతరం నీ ప్రేమ పుప్పొడి కోసం పరుగెడుతుంది

53. కాలానికి కూడా దుఃఖమే
నీవులేని నన్ను చూసి

54. నీ జ్ఞాపకాల వీధుల్లో విహరిస్తున్నా!
మనసుని పునీతం చేసుకుంటూ

55. నీవు దూరమయ్యావన్న భ్రాంతిలోనే వున్నా
కనుల వెంబడి కన్నీరు వస్తున్నాకూడా



**దేవరాజుల దయానంద్ రావ్**
ఫ్లాటు నెం. 204, సాయినిలయం,
రోడ్డు నెం.9, వేంకటేశ్వరకాలనీ,
సరూర్ నగర్, హైదరాబాద్ - 35
వృత్తి : జూనియర్ లెక్చరర్
(సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ)
మొబైల్ నెం: 9440819817
ఈ-మెయిల్: daya.devarajula@gmail.com

# హృ'దయ' రాగాలు...

1) హృదయం ముక్కలయ్యాకే తెలిసింది
అన్ని ముక్కలు చేయడం నీకు మాత్రమే సాధ్యమని

2) నీతలపులు నాహృదిని మీటేవరకు తెలియదు
సరిగమల్లో అంతుచిక్కని క్రొంగొత్త రాగాలుంటాయని

3) మాధుర్యమంటే ఎంతిష్టమో నామనసుకి
నీపలుకుల్నే పోగేసుకుంటూ దాచుకుంటూ

4) నీసౌందర్యాన్ని ఏమని వర్ణించను
కావ్యయుగంలో పుట్టుంటే అన్ని కావ్యాల్లో నువ్వేగా కథానాయకివి

5) నీపలుకుల మధురిమలను నేర్చుకోవాలని కాబోలు
కోయిలలన్నీ నీముంగిట బుద్ధిగా కూర్చున్నాయి

6) నీజ్ఞాపకాల ఊపిరి నాహృదయంలోకి ఊదినావుగా
చూడు గుండెసన్నాయి కళ్యాణిరాగాల్నెలా మ్రోగిస్తున్నదో..!

7) అవును నేను అపర గజినీనే
నువ్వు తప్ప మరేమీ గుర్తుండదుగా

8) నావ్యధ నీమదిలో వెన్నెలసుమమై వికసిస్తే
నీజ్ఞాపకం నాకనుకొలుకుల్లో అశ్రువై నిలిచింది

9) నీ సౌందర్యంతో నారదుని సోదరివయ్యావుగా
రెండుకళ్ళూ పరస్పరం పోట్లాడుతూ తిలకిస్తున్నాయి

10) వింతగాక మరేమిటి ?
ప్రేమ విత్తనాలు చల్లితే విరహం పంటగా చేతికొస్తే!

11) గడిపేక్షణాలకు ఈత రాదుగా
కాలప్రవాహంలో కొట్టుకుపోతూనే ఉన్నాయి

12) అయ్యో నేను వికలాంగుడిని కాదంటే నమ్మరేం
కలలపల్లకీలో చెలిని మోసి తనువిలా తయారైతే

13) నామదికి నిదురేదీ
నీతలపులు నిరంతరం అలారం మ్రోగిస్తుంటే

14) నిరంతరం నీఆలోచనలతో జుట్టుపీక్కుంటున్నా
కత్తిలేకుండానే బోడిగుండు చేసిపెట్టావుగా

15) అంధకార జీవితంలో ఒక్కోక్షణాన్నీ కాల్చేస్తూ చూస్తున్నా
ఏనాటికైనా వెలుగులు వెదజల్లుతూ నువ్వు వస్తావని

16) మనసు బీడుపై నీచూపుల వర్షాన్ని కురిపించు
నాలో నవ్వులమొక్కలు మొలకెత్తక చాలా కాలమయ్యింది

17) ఎదుగుతున్న కొమ్మలేగా నీతలపులు
మదిలో మహావృక్షమైన నాప్రేమకి

18) విశ్వవిజేతనే..!
నీ శిలాహృదయంలో నాప్రేమవిత్తులు మొలకెత్తించగల్గితే

19) ఒకటే తుమ్ములూ, దగ్గులు
నీజ్ఞాపకాలు జడివానగ కురుస్తుంటే

20) గజీతగాడినే...ఏంలాభం
నీ ప్రేమసాగరంలో గజమైనా ఈదలేకపోయా

21) సంధించిన నీశరం లక్ష్యాన్నే తాకింది
నేను పోగేసుకున్న కలలన్నీ చెల్లాచెదురయ్యాయి

22) నిజమే...మదాంధుడినే..!
నీజ్ఞాపకాల గర్వంతో నిన్ను గుడ్డిగాప్రేమిస్తూ

23) నాకథ పంచమవేదమే
నీఅష్టాదశ ప్రణయపర్వాలతో

24) నాకే కాదు
నిరంతరం వేధించే నాఏకాంతానికీ నిదురలేదు

25) నాది ఊష్ణపు శరీరమే మరి..!
నీజ్ఞాపకాల కుంపటి గుండెల్లో రగిలించాక

26) విలోమానుపాతమే నాబ్రతుకు
నేనెంత దగ్గరవ్వాలనుకుంటే.. నువ్వంత దూరంజరుగుతూ..

27) నీ తలపులకు ఫెవికాల్ అంటించావేమో
గడిపే ప్రతిక్షణానికీ వదలకుండా అతుక్కున్నాయి

28) నీకంటే మృత్యువే ఎంతోనయం
వేలసార్లు వేధించి వధించదు

29) చకోరాలన్నీ నాచుట్టే తిరుగుతున్నాయి
వాటికెలా తెలిసిందో జాబిలివై నాలో నువ్వు దాగున్నావని

30) తరువులకూ నీతలపులు తాకాయేమో
తమకంతో తలలూపుతూ తూగుతున్నాయి

31) కన్నుగీటి కవ్వించుట నీవంతు
కాలమెరుగక కుప్పిగంతులేయుట నావంతు

32) నేను ఆడితే అది ఆట
నువ్వు నన్నాడిస్తే అది జీవితం

33) రక్తహీనత తప్పదేమో
గాయపడిన గుండె స్రవిస్తున్నంత కాలం

34) జ్ఞాపకాల గునపాన్ని గుండెల్లో గుచ్చకు
గావుకేక వేయలేని 'గాయ'కుడినే అవుతా

35) నామనసుకి సిగ్గులేదు
ఎన్నిదెబ్బలు తిన్నా మార్పు రాదుగా

36) నీతలపుల పల్లకీలోనే నాఊరేగింపు
నేడైనా... అంతిమ ప్రయాణంలోనైనా

37) నీది విశాలహృదయమనే అంటావు
నాకంటూ ఇరుకుస్థలమైనా లేదే..?

38) నీతలపులు గంధపుచెక్కలే
ప్రతిక్షణం చస్తున్న నామనసుని కాల్చేస్తూ

39) నేను ఎగరలేని పక్షినే
నీజ్ఞాపకాల పంజరంలో చిక్కి

40) సర్వకాలాల్లో సమన్యాయమే నీది
మొన్నల్లో నిన్నల్లో నేడుల్లో రేపుల్లో అంతా నువ్వేనిండి

41) గడిపేక్షణాల ద్విపాత్రాభినయం
నీసమక్షంలో సంతసిస్తూ..ఎడబాటులో చింతిస్తూ

42) నీకు ఎంత ఋణపడి ఉన్నానో
ఏకాంతంలోనూ ఒంటరిని చేయని జ్ఞాపకాలిచ్చావుగా

43) నువ్వు నరకానికి వెళ్ళాకే తెలుస్తుందిలే
నీలోని ప్రేమరాహిత్యం ఎంత పాపమో

44) నాబాధ...నువ్వు గాయపరిచినందుకు కాదు
దాని మచ్చ ఇంకా మెరుస్తున్నందుకే

45) నామది దానిమ్మపండు కాదుగా
అడగ్గానే పేర్చుకున్న నీ జ్ఞాపకాలదొంతరలని వలిచి చూపడానికి

46) మధురమైన గేయాలంటే నేనెలా పాడను..?
గాయపడిన మదికి మౌనగీతాలేగా వచ్చు

47) ఇదీ మనకళ్ళ వరుస
కన్నీరాపని నాకళ్ళూ...నాకై ఒకచుక్కా రాల్చని నీకళ్ళు

48) బలహీనమైనదే నామనసు
బలమైన నీతలపుల ముందెప్పుడూ తలవంచుకునే

49) ప్రేమ విశ్వమంత విశాలమైనది
ఇరుకైన మనిషిగుండెలో పట్టడంలేదు

50) ఆశాజీవివే కదూ..!
నువ్వల్లుకున్న ఆశలగూడు చెదిరినపుడే అనుకున్నా

51) అవిశ్రాంతంగా విహరిస్తూనే ఉన్నా
గుండెకు మొలచిన నీఆశలరెక్కలతో

52) గుండె బరువెక్కుతూనే ఉంది
గుట్టలై పేరుతున్న నీజ్ఞాపకాలతో

53) నాగుండెది మూగప్రేమే
మెత్తగా కోస్తుంటే..మౌనంగా రోదిస్తున్నది

54) జీవిద్దాం ఇలాగే
మౌనంతో నువ్వు..మతితప్పుతూ నేనూ

55) నిశ్చలమైన సరస్సునే ఒకనాడు
నీ రాకతో కల్లోల తరంగాల సాగరాన్ని నేడు

56) కీర్తి, సంపద, హోదాలకై ఆరాటమెందుకు..?
కడకు తెల్లబట్టలో కాలి కనుమరుగయ్యేవేగా

57) గుప్పెడు సంతోషతారల్ని నామదిలో నాటరాదూ
ఆకాశమంత ప్రేమవెలుగుని నీగుండెలో నింపనూ..

58) చంద్రుడూ నాలాగే..
గాయపు మచ్చ చెరగకుండానే జీవిస్తూ!

59) గడ్డకట్టకుండా గుండెను రగిలించుకుంటూనే ఉన్నా
నిరంతరం మదిలో మండే నీజ్ఞాపకాలతో

60) నామది సముద్రమే
పాయలుపాయలుగా చేరిన నీ జ్ఞాపకలతో

61) నువ్వు ఆనందాన్ని పంచినా అదేమిటో
చెక్కిళ్ళు కన్నీళ్ళతో తడిసి పోతున్నాయి

62) ప్రొద్దున్నే లేచినప్పుడల్లా నాకు సందేహమే
కనపడేది నీమోమా వేకువ వెలుగాయని

63) ఏకైక శ్రోతనే
నాహృదయపు ఆర్తనాదాల్ని ఆర్తిగా వింటూ

64) కంటివైద్యుడే కలవరపడ్డాడు
కంటిపాపల్లో పువ్వులా నిన్ను చూసి

65) నీలా నాకసాధ్యం
మాయలతో కాకుండా.. మనసుతో పెరిగా

66) పరిమళం పరిచయమయ్యింది
నీజ్ఞాపకాల గుబాళింపుతో

67) ప్రతిరాత్రీ అందమైనదే
నిదురలేమితో నీ తలపుల్లో కరిగినదల్లా

68) వారిది పొలాల్లో పనిచేసిన అనుభవమేమో
మానవత్వాన్ని కొడవళ్ళతో పరపరా కోస్తున్నారు

69) కలుపు బాగా పెరిగింది
మనుషుల్లోనూ..వారి మనసుల్లోనూ

70) తుడిపేయడానికవి వాకిట ముగ్గులు కావు
చెరిపేయలేని నామది గాయపు మచ్చలు

71) కనురెప్పల్ని మోయడం కష్టమయ్యింది
కన్నీటితో తడిచితడిచి భారమయ్యాయిగా

72) మరుజన్మలో తోడవుతానంటే
క్షణం చాలదూ... ఈజన్మ వదిలించుకోడానికి

73) నాకళ్ళ పుస్తకంలో
కన్నీటిసిరాతో కనురెప్పలు రాసిన కథలెన్నో

74) నామనసు అనంతశూన్యాన్ని నీముందు ఉంచింది
చకచకా నింపడం నీతలపులకే సాధ్యమని

75) కన్నీళ్ళకి కరువొచ్చింది
మనసుల మధ్య ఆర్ద్రత కరువయ్యిందిగా

76) తిరగబడలేని బానిసే నామనసు
నియంతలా నీ జ్ఞాపకాలతో నిరంతరం దాడులు చేస్తున్నా

77) మన తలలు నిటారైన ధ్వజస్తంబాలే కదూ
సిగ్గులేని పనులు చేసినా దిగవూ...వంగవు

78) మనుషుల కంటే రాబందులెంతో నయం
చచ్చిన శవాల్ని మాత్రమే పీక్కుతింటాయి

79) కుక్కలు నిత్యం మొరుగుతూనే ఉన్నాయ్
విశ్వాసం లేని మనుషుల్ని చూసి

80) నిన్ను జాబిలితో పోల్చుటలో అతిశయోక్తి లేదులే
చూడగానే నాముఖం కలువలా వికసిస్తున్నది మరి

81) కాలానికెంత దాహమో..?
కన్నీటిప్రవాహాల్ని ఎంత తాగినా నిరంతరం దోసిళ్ళు పడుతూ

82) నిజమే..నీరు పల్లమే ఎరుగును
అశ్రుప్రవాహమంతా సరాసరి గుండెలోకే చేరుతున్నదిగా

83) ఇన్నాళ్ళ నీచెలిమి వింతగా తెలిపింది
పగళ్ళన్నీ వేదనలనీ..రాత్రులన్నీ కన్నీళ్ళని

84) నీలో అనంతప్రేమ ఉందని మిడిసిపాటు ఎందుకు
నాకు పంచని ప్రేమ అడవిగాచిన వెన్నెలేగా

85) నువ్వు చేసిన గాయాలు ఎంత భయపెట్టాయో
హత్తుకున్న పెదవులు మౌనముద్రను విడవడం లేదు

86) గాయపడిన పక్షి రామాయణాన్ని రాయిస్తే..
గాయపడిన నాగుండె ప్రేమాయణాన్ని రాయిస్తున్నది..

87) నీఆలోచనలకి దొంగతనం నేర్పావేమో..!
నా కంటినిద్రనంతా దోచుకెళ్తున్నాయి

88) అందమైన నీకళ్ళల్లో నన్ను నింపుకోరాదూ
నిరంతరం నీఆనందభాష్పాలై కరుగుతూ ఉండనూ

89) కనపడని జ్వాలలేగా...అంతరంగ బడబాగ్నివి
వినపడని రోదనలేగా...మూగబోయిన మనసువి

90) నాతనువు ఎటుతిరిగితేనేం..!
మనసు మాత్రం నిరంతరం నీచుట్టేగా..

91) నువ్వు నాపై కోపగించుకున్నా సంతోషమే
అలకల మబ్బులతో ముసుగేసుకున్న శశివేగా

92) కణకణంలో నువ్వు నిండాకే తెలిసింది
విషమేకాదు అమృతమూ నిలువెల్లా పాకుతుందని

93) చివరికి చితిమంటల్లో కాలడమెలాగూ తప్పదుగా
ఇప్పుడెందుకు అసూయమంటల్లో కాలుతూనే ఉండడం

94) కనురెప్పలుండడం శాపమయ్యింది
తదేకంగా నిన్ను చూస్తూంటే మధ్యమధ్య ఆటంకం కలిగిస్తూ

95) పెట్టిన పరీక్షలో కాలం ఓడిపోయింది
చెరగని నీ జ్ఞాపకాన్ని కడగలేక

96) నీ మౌనం ఏంభయం పెట్టిందో..?
నా మనసు చీకటివెనుకే దాక్కుంటున్నది

97) కన్నీటితో ఎంత తడిపినా ఏంలాభం..?
గుండెలో చెలరేగే దావాగ్ని చల్లారునా..!

98) నానుండి బయటపడి ఎటెళ్ళాలని నీఆరాటం..?
నా మనసుని విశ్వమంతా పరిచానుగా

99) చేతకానివాళ్ళమేగా మనం
మంచీచెడూ తెలిసి ఎవరికీ చెప్పలేక

100) గణితశాస్త్రజ్ఞుడికీ అసాధ్యమే
నీపై నాకున్న ప్రేమను లెక్కించడం

101) మబ్బులు తొలగిన నెలవంక
పైట పక్కకు తప్పుకున్న నీ నడుము వంపులా

102) నీ మనసుకెంత మోమాటం
కలలోకూడా నామనసుని హత్తుకోవాలంటే

103) నీసౌందర్యం మందుపాతరే
చూసిన కళ్ళనన్నింటినీ ఆశ్చర్యాలతో పేల్చేయదూ

104) ఎప్పటికీ మనమింతేనేమో
సుదూరంలో కలిసినట్టున్న భూమ్యాకాశాల భ్రమతో

105) నాప్రేమను తెలపడానికి స్వరభాషెందుకు..?
నిను చూడగానే విప్పారే నాకనుల భాష చాలదూ..!

106) షరామమూలే నాప్రేమలో
వెక్కిరింతలతో నువ్వు...వెక్కిళ్ళతో నాహృదయం

107) నేనేమైనా ఎడారిమొక్కనా
నీపలకరింపుల చినుకుల్లేక ఎలా జీవించనూ

108) నినువిడిచి జీవిస్తుంటే తెలుస్తున్నది
మరణమంటే కేవలం ప్రాణం పోవడం మాత్రమే కాదని

109) అపార్థాల పరదాలు తొలిగిస్తావా
నన్నర్థంచేసుకున్న నీహృదయాన్ని చూడాలి

110) ఒంటరిగా పోయాడనే అపఖ్యాతి రావద్దనే
నిరంతరం నీతలపుల్ని తోడుగా పెట్టుకుంటున్నా

111) అదేమిటో.. ప్రతీది రెండుగా కనిపిస్తున్నాయ్
నాలో నిండిన నీకళ్ళతోపాటూ చూస్తున్నందుకేమో..!

112) నావ్యధ చూడలేకేమో సూర్యుడు వడిగా వెళ్ళిపోతున్నాడు
పిచ్చివాడు..మరింత పెంచడానికి చంద్రుడొస్తాడని తెలియక

113) వికృతమైన మనుషులు
పైపైకి హూందాతనాలు.. లోలోన దిగజారుడుతనాలు

114) గుండెపొరలపై ఎరుపెలా పండిందో చూడు
వలపు గోరింటను మురిపెంగా అద్దావుగా..!

115) నాలో నువ్వు ఛిద్రం కావద్దనే
నా మనసుని ముక్కలవ్వకుండా చూసుకుంటున్నా



**జానకి పాదుక**
ఆర్ కె పాలెం, సూళ్ళూరుపేట,
నెల్లూరు జిల్లా - 524121
వృత్తి: గృహిణి
మొబైల్ నెం. 9490414291

# పారిజాత పరిమళాలు...

1. తడి ఆరని నా కన్నులు
తరిగిన నీ ప్రేమకు తార్కాణాలు

2. నటనెంత చేసినా బయటపడుతూ కొంత
నర నారీమణుల నగ్న తత్వాలు

3. కన్నుల మాటునే కాపు కాసా
కౌగిళ్ళకు నెలవు కలలే అన్నావని

4. బ్రతుకు వర్ణచిత్రం వెలిసిపోయింది
రంగులద్ద రారాదూ రమణీయంగా

5. హాస్యాస్పదమే
ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టి ఆత్మతృప్తిని కొనగలమనుకోవడం!

6. ఆన్నివేళలా అభిలషణీయం
అపరాధభావం అణువంతైనా లేని కర్మలే

7. అన్వేషిస్తున్నా అనుక్షణం
నిన్ను తలవని క్షణం యేమూలైనా దాగుందేమో అని

8. కనులకూ కోరికే
కన్నీరుగానైనా నిన్ను తనలో నింపుకోవాలని

9. బదులే లేని ప్రశ్నవు నీవు
విజయమందుకుని తీరాలనుకునే విద్యార్థిని నేను

10. అంటే అన్నానంటావ్ గానీ
నీజ్ఞాపకాలకూ నీల్గుదెక్కువే అచ్చంనీలా

11. కన్నీరే తోడిక
కలవని హృదయాలకు

12. దైవానికి నాపట్ల దాతృత్వము ఎక్కువ
వద్దన్నకొద్దీ ఇస్తూనే ఉన్నాడు రోజులెన్నింటినో

13. వెర్రిగా వెతుకుతున్నా
వరముగ నిన్నిచ్చే వేలుపు కోసం

14. సంస్కృతి సంప్రదాయాలు
భవిష్యత్తవ్వకాల్లో శిధిలాలుగా

15. గతమైనక్షణాలు కొన్ని
వర్తమానాన్ని వేధిస్తూ..భవిష్యత్తును భయపెడుతూ

16. మధురక్షణాలను నిలవేసే మంత్రమొకటి చెపుతా
చిట్టిగుండెను వలపు ముదుపుగా చెల్లిస్తే

17. దొర్లిపోతున్నాయి దొంతరలుగా
క్షణాలన్నీ వీక్షణాలలోనే

18. జీవితమొక బహుమతే
ఈక్షణం యొక్క అనివార్యతను గుర్తిస్తే

19. బంగారంటూ ఆనాడు
భారమంటూ ఈనాడు

20. సూరీడుకే వందనాలు అన్నీ
చందమామతో మాత్రం తందనాలే

21. కాలానికెంత పక్షపాతమో
నువ్వుంటే ఉరుకులూ పరుగులూ లేకుంటే కదలక మొరాయింపులు

22. వలపువడ్డీ చెల్లిస్తా
అసలుమనసు అప్పిస్తే

23. ముద్దుల ముదుపులు ముట్టాకనే
కౌగిళ్ళ ఖైదు ఖరారు

24. కోరి వలచిననాడు..అనుకోలేదు
కొరివితో తల గోక్కుంటానని

25. నీపిలుపే చాలు
పరవశించి పరువాలు పదిలంగా అప్పచెప్పటానికి

26. తెల్లారింది...తేడా యేంలేదు
నిన్నటి రోజున నీతో... నేడు నీ తలపులతో

27. బాహ్యానికే అలవాటు పడ్డ కన్ను
దుర్లభమే దర్శించుట అంతరంగపు తీరుతెన్ను

28. శరీరమంతా హృదయమే
ఆర్తిగా నువ్వు హత్తుకున్న సమయాన

29. తెల్లారింది షరామామూలే
నా సణుగుడులు నీ ముక్తాయింపులు

30. ఆశ
సరసన నువు చేరినపుడు సమయము స్తంభించాలని

31. ఆంక్షల ఆధీనంలో
అంతరంగం అతలాకుతలం

32. నలుగుతుంటాము నాటకీయంగా
నకిలీప్రేమలకు నాజూకు ఎక్కువ మరి

33. ఊ...అంటేనే ఎగిసిన మది సంద్రం
ఉహూ..అంటే పాతాళానికి ఇంకును..ఇదిసత్యం

34. నీవు పలికిన చందానికే
నా పేరుకింతటి అందం

35. వచ్చివెళ్ళిందే తెలియలేదు
యవ్వనానికి  బహుశా ఆయువు బహుతక్కువ

36. ఐనవారే అందరూ
అవసరానికే అందరు

37. నిత్యయవ్వనమే ఇక
నీ మమతల మధువును త్రాగేనుగా

38. జీవనదే...నాహృదయం
నీకై ప్రేమ సుగంధాలను ప్రవహింపచేస్తూ

39. ఎంత చదివినా కొంత మిగులే
నీ సొగసుపుస్తక మధుర సమాచారం

40. మార్గమేముంది మౌనాన్ని ఆశ్రయించక
వ్యర్ధమేతప్ప అర్ధమేకాని అనుబంధాలలో

41. ఆలపించకున్నా అలరిస్తున్నాయి
మదిమాటున మౌనరాగాలు

42. నిశ్శబ్ధ విస్ఫోటకం
నీమౌనం... నామదిలో

43. మౌనంగా నిష్క్రమిస్తున్నా
నీ మాటల కాఠిన్యాన్ని మోయలేక

44. మూలం మౌనమే
జ్ఞానానికైనా..ధ్యానానికైనా

45. మాటలలోనే మౌనం
నా మనసున సదా కదనం

46. ఎపుడూ తికమకే
మన అనురాగానికి సాధికారిక చిరునామా నానువ్వా? నీనేనా?

47. కనికరమేలేదు కదలని కాలానికి
కలగానైనా కానుకివ్వకుంది నిన్ను

48. ఒద్దికగా నాలో ఒదిగొదిగి పొమ్మంటే.
నువ్వేకాదు..పొద్దూ నవ్వుతోంది పువ్వులా

49. అతివే కాదు
అతడూ అంతుబట్టడు...అనుబంధాల అగాధాలలో

50. నా గుండె బరువెక్కింది
నిష్కర్షపు నీ మాటలమూటలతో

51. మనసు చల్లనే..మాటలే మంటలు
గుప్పున ఎగసి చప్పున చల్లరుతూ

52. అందగాడివే...
ఆత్మ సౌందర్యంతో నను అలరిస్తూ ..ఆకర్షిస్తూ

53. గడుసరివే
కష్టాలన్నీ బదలాయిస్తూ సుఖానికి వాటాకొస్తూ

54. మౌనినే
నీపేరే జపిస్తూ..నీప్రేమకై తపిస్తూ

55. స్వార్థం అసత్యపు దుర్వాసనలతో
భారంగా తల్లిభారతి సంతానం



**లక్ష్మి యలమంచిలి**
నిజాంపేట్, కూకట్‌పల్లి,
హైదరాబాదు-500090.
వృత్తి: గృహిణి
ఈ-మెయిల్:
yalamanchili.lakshmi69@gmail.com
మొబైల్: 9553309911

# స్మృతి'లయ'లు...

1. మది మౌనరాగాలు ఆలపిస్తోంది
   మనోప్రాంగణంలో నీఅలికిడి పసికట్టిందేమో

2. మది అగ్నిగుండమే
   నీ తలపు చితుకులతో దహించుకుపోతూ

3. కరగమంటే కుదరదంటోంది కన్నీటిచుక్క
   మదిభారాన్ని మరింత పెంచుతూ

4. నీ అలక్ష్యం ఖరీదు
   బ్రద్దలైన నా హృదయభాండమే

5. అరిషడ్వర్గాలను జయించుట అత్యాశే
   బాహ్యాన్నే జయించలేని అసహాయను

6. నలుగుతూనే ఉన్నా
బిగుస్తున్న బంధాలను ఉంచనూలేక తెంచనూలేక

7. నాలోని నిన్ను వేరుచేయమన్నా
వల్లకాదంటూ చేతులెత్తేసింది రాయంచ

8. అడుగడుగునా ఆవేదనలే
అంతరాత్మ గొంతు నులమలేని అశక్తితో

9. నిజాలు నిండుగా నవ్వుతున్నాయి
మాయాలోకపు మర్మాన్ని భేదిస్తూ

10. ఆనందమేగా ఆహ్వానమొస్తే
అవనమ్మ ఒడిలో అనంత సౌఖ్యాలకై

11. భావాల్ని కుమ్మరిద్దామంటే
అక్షరాలు అందనంటూ ఒకటే అల్లరి

12. అడుగడుగునా రాజీలే
అతివ నుదుట వ్రాసిన అజుని అలక్ష్యపు అక్షరాలతో

13. ఆక్షేపణలే జీవితమంతా
ఆనందాల్ని ఆవిరిచేస్తూ

14. అమాసపున్నములు నామోములోనే
నీ ఆగ్రహానుగ్రహాలలో

15. వెల కట్టలేని పెన్నిధి కొందరికే
విలువే లేని ఆడది ఎందరికో

16. అమృతమూ చేదే
నిను కోల్పోయిన నా జీవితాన

17. వలపులు పండించమంటే
తలపుల్లో తచ్చాడుతానంటావే

18. శిశిరాన్ని దరి చేరనీయదు
నీ చెలిమి వసంతం

19. కలను సాకారం చేసుకోగల శక్తే ఉంటే
క్షణాల్లో నీ రూపానికి ఊపిరి పోయనూ

20. అమ్మకానికి అంగట్లో అందం
అమ్మ కూడా అతివేనని లోకులు మరచిన వైనం

21. జీవం లేని నా మనికి(మనుగడ)
నీ ఉనికిని శాశ్వతంగా కోల్పోయి

22. దేవుడు కరుణించి వరమందిస్తే
నిన్నటి నీ క్షణాల వద్దే కాలాన్ని స్తంభింపచేయనూ

23. జీవన వైకుంఠపాళి
అనురాగాల నిచ్చెనలు, తిరస్కరణ సర్పాలతో

24. కాలానికి ఎప్పుడూ ఓటమే
నిన్ను చేరే పందెంలో నా మనసును గెలవలేక

25. తప్పని తాపత్రయాలు
జీవితం మూన్నాళ్ళ ముచ్చటని తెలిసినా

26. కన్నీరెంత వెచ్చనో
నీ వియోగజ్వాలల్లో నుంచి పుట్టుకొస్తున్నందుకేమో

27. కలయికలోని మధురగేయాలే
మన వియోగంలో మానని గాయాలు

28. ఎందుకు కలిపాడో? ఆ బ్రహ్మ
నిత్యం తగవుల తెరలే మనమధ్య

29. తెల్లారనంటూ మారాం చేస్తోంది రేయి
కలగా అయినా నువ్వు కనికరించకుంటే

30. నీ జతలో స్వర్గానికి నిచ్చెనలే ఆనాడు
నీ నిష్క్రమణతో అంతులేని అగాధాలే ఈనాడు

31. జీవిత నౌక సాగుతూనే ఉంది
మనుషులు మమతలు శాశ్వతమని భ్రమిస్తూ

32. నీతలపుల పతంగం
నా మనోవీధిలో యధేచ్ఛగా విహరిస్తూ

33. మౌనం తప్ప గత్యంతరం లేకుంది
కలలు కల్లలై ఎదను తడుపుతుంటే

34. అందనంత దూరంలో నీవున్నా
నేనెప్పుడు నీవెంటే నాఊహలరెక్కలతో

35. నిన్నే స్వప్నిస్తూ బాహ్యాన్ని పూర్తిగా మరిచా
వాస్తవం వణికిస్తూ కలల్లోనే కాలాన్ని కరిగించమంటుంటే

36. రాతిని నాతిగ మార్చిన కథ ఆనాడు
నాతిని రాతిగ మార్చే వ్యథలెన్నో ఈనాడు

37. సంగీతానికి శిలలు కరుగుతాయి అంటారు
వేవేలరాగాలు ఆలపించినా నీహృదయం కరగదే

38. మన బ్రతుకుపుస్తకంలో ప్రతిఅక్షరం మధురం
మన అనురాగం అన్యస్వరంలేని సుస్వరం

39. నాప్రాప్తమో ప్రారబ్ధమో
వలదన్నా నీతలపులు నన్నొదలక చుట్టేస్తూ

40. తీరం చేరని నాకలల అలలు
గుండెనిండా నింపుకున్న వ్యథల బరువుతో

41. హృదయం లేని శిలనైనాను
నీతోపాటు నామనసుని సమాధిచేసి

42. మువ్వలు పదాలు పాడుతున్నాయి
నీపాదాన్ని తాకిన పరవశంతో

43. నా నుదిటిని తాకిపోయే పిల్లతెమ్మెరల అల్లరులు
గాలితో నువ్వు పంపే గుసగుసల రాయబారాలు

44. నిరంతరం గమనంలోనే
నీకై అన్వేషిస్తూ నాప్రతి అడుగు

45. మందుతున్న వెన్నెల
మరుగుతున్న నా మనసును తలపిస్తూ

46. సాగరం లోతుల్లో ముత్యాల నిధులు
నాగుండె లోతుల్లో నీజ్ఞాపకాల నిధులు

47. విశ్వవిజేతనైనట్టే
నీమదిలో నాస్థానం సుస్థిరమైతే

48. అసంకల్పితచర్యలా
కన్నుమూస్తే చాలు కలల్లో చొరబడతావ్

49. నడిరేయైనా కునుకేరాదు
సుతిమెత్తని నీహృది తలగడ లేనిదే

50. మంచుబొమ్మనే
క్షణక్షణం కన్నీళ్ళలో ఘనీభవిస్తూ

51. మనసు ముంగిట నీజ్ఞాపకం
కడలిపై తేలియాడే కార్తీకదీపంలా

52. మదిలో మెదిలే నీ జ్ఞాపకం
ఒక్కోసారి బాధిస్తూ అంతలోనే ఊరడిస్తూ

53. అందరు హరిశ్చంద్రులే
సందర్భం వస్తేనే నిజాయితీ నిగ్గుతేలేది

54. తారల్లో చేరిపోయావ్
ఇక్కడ నాఉనికిని ప్రశ్నార్థకం చేస్తూ

55. నీవు లేక మోడైన నా మది
కొత్త చిగుర్లు వేస్తోంది నీ ఆగమనంతో

56. కన్నీటి సేద్యం చేస్తున్నా
నీ జ్ఞాపకాల పంట పండించాలని

57. కన్నీటి చుక్కవై జారుతూ
ప్రతిక్షణం నన్ను ముద్దాడుతూనే ఉన్నావు

58. నీస్మృతుల చమురు నింపుతున్నా
నా ప్రాణదీపం కొడిగట్టకుండా

59. నిన్న జననం రేపు మరణం
నడుమ ఎన్ని ఆరాటాలు? ఎన్నిపోరాటాలు?

60. నిలువెల్లా నేను  తడుస్తున్నా
వర్షించేది కన్నో..మిన్నో..?

61. నిశీధి నీడలలో ఒంటిగా
గగనాన్ని వీడివస్తావని ఆశగాచూస్తూ

62. నిను కోల్పోయాననుకున్నా
నా ప్రతికదలికలోను నువ్వున్నావని తెలుసుకోలేక

63. హాయిగా నిదురిస్తా
రెప్పలమాటున ఊహవై నువ్వొదిగి ఉంటే

64. నీ జ్ఞాపకాలే మరువలేకున్నా
పంచిన నిన్ను మరిచేదెలా

65. నువ్వొచ్చివెళ్లావుగా
మదిలో ప్రకృతిలో పులకరింతల్లా

66. గుండెనిండా గుప్తనిధులే
ఎంత తవ్వినా తరగని మధురజ్ఞాపకాలు

67. మౌనరాగాల వీణియనే
నీవు మదితంత్రులు మీటే వేళ

68. నా జీవితం ఒక మధురకావ్యం
ప్రతిపేజీ నీ ప్రేమాక్షరాలతో నిండి

69. అందకుండా ఊరిస్తూ చందురుడు
అందుకోవాలనే ఆరాటంలో సముద్రుడు

70. జీవితం రంగులమయం నీ జతలో
మిగిలింది నలుపే నీ వియోగంలో

71. క్షణాలకెప్పుడూ తొందరే
మది వేదన పట్టనట్టే కరిగిపోతుంటాయి

72. అంతం లేని ఎదురీత
పోటెత్తుతున్న నీతలపుల వరదలో

73. అర్థంలేని నీ అహంకారం
ఆవేదనతో నామతి గతితప్పుతూ

74. మాయదారి కాలం
ఆనందంలో పరిగెడుతూ వేదనలో నత్త నడకలు నడుస్తూ

75. బ్రతుకు పూదోటకు మాలివని ఆశపడ్డా
కలుపుమొక్కై కన్నీళ్ళ గాయాల్ని మిగిల్చావు

76. అంతరాల ఆభిజాత్యం
మానవత్వానికి సమాధికడుతూ

77. వ్యర్థమే అపూర్వ మేధస్సు
మనిషిలోని స్వార్థాన్ని చంపకుంటే

78. అహాన్ని చంపకుంటే
అనుబంధాలకు తిలోదకాలే

79. మదిలో తీయని అలజడి
నీజ్ఞాపకం మెత్తగా తాకినందుకేమో

80. బంధమై అల్లుకోమంటే బ్రతుకే భారం చేసావు
మోదమై మురిపించమంటే ఖేదమే కానుక ఇచ్చావు

81. మనస్తాపాలే నీజతలో
మాటలముళ్ళు గుచ్చుతూ ఆనందాల్ని ఆవిరిచేస్తూ

82. అతిశయమే నా మదికి
తనలో నిన్ను నింపేసుకుందిగా

83. పేరుకి పెద్ద మనుషులే
మనసులు మాత్రం మరుగుజ్జులు

84. ప్రేమకు తావేది?
పైకం పెత్తనంచెలాయిస్తుంటే

85. అనురాగాల కొమ్మ, ఆకలి తీర్చే అన్నపూర్ణ
ఆగ్రహించిందా అంతు చూసే అపర కాళిక

86. నిర్మల అంతరంగం నీ అందం
అంతెరగని మమకారం నీ చందం

87. భామలందరూ బంగారాలే
భార్య తప్ప... కొందరు ఘనులకి

88. మదిలో పదిలమే
చెరగని చెదరని నీఊసుల మధురిమ

89. అరణ్య రోదనలే ఈ జనారణ్యంలో
అబలల ఆక్రందనలు, అన్నార్తుల ఆకలికేకలు

90. మదనుడు వదిలిన విరిశరానివే
మౌనపు పరదాలు తొలగిస్తూ మదిలో మోహాలు రేపుతూ

91. నీకై అలుపెరుగని అన్వేషణ
దిగంతాల అంచులదాకా పయనిస్తూ

92. చుక్కలతో చంద్రయ్య దోబూచులాట
వెండి మబ్బుల చాటుగా వెన్నెల విహారం చేస్తూ

93. నీరాక నామదికి ఆనందాలమహోత్సవం
కనులకు సహస్రచంద్ర దర్శనం

94. జీవచ్ఛవాన్నే
నీప్రేమ సంజీవనితో ఊపిరి పోయరాదా

95. విధి చేసిన ఆకస్మికదాడి
ఫలితం నీ తస్కరణ

96. ఎప్పుడు కలల విందులేనా
ఎదుటికొచ్చి కనులవిందు చేసేదెప్పుడో?

97. రాయివనుకున్నా
చేజారాకే తెలుసుకున్నా వజ్రానివని

98. ఎదలో నీ తలపుల రొద
ఝుమ్మని మూగే తుమ్మెద ఝుంకారాల్లా

99. అలిగావంటే
ఎదలో అణువిస్ఫోటనాలే

100. మది కల్లోల సాగరమే
నిమిషం నీవు కానరాకున్నా

101. సుడిగుండాల సంద్రంలో నేను
చుక్కానిలేని నావలా దిక్కుతోచక

102. నీ తలపులు తెచ్చెను తంటా
నా ఎదలో చేలరేగెను సన్ననిమంట

103. నిన్ను చూసే మధుర క్షణాన
కన్నుల్లో గంగపొంగుతో అస్పష్టంగా నీరూపం

104. మైనంతో చేసాడాఏం? ఆబ్రహ్మ
నాచూపులవేడి సోకితేనే కరిగిపోతున్నావు

105. ఘనంగా పేరెంట్స్ డే
వృద్ధాశ్రమంలో అమ్మకు నాన్నకు నమస్కరిస్తూ

106. మది సంబరాల అంబరమే
నీవలపు తలపుల ముచ్చట్లలో

107. కన్నీరై కరిగిపోతా
నులి వెచ్చని ఓదార్పు నీవైతే

108. మనసుకు వేరే పని లేదు
ఎప్పుడు నీ జ్ఞాపకాల వీక్షణలోనే

109. నీ కనుపాపల్లో చోటిస్తావా?
మధురస్వప్నమై ఒదిగి ఉంటా

110. నువ్వొచ్చివెళ్లావుగా
మదిలో ప్రకృతిలో పులకరింతల్లా

111. మనసింకా కాలుతూనే ఉంది
నీ జ్ఞాపకాల చితిలో

112. నాలోనీవు నాతోనీవు
శోధిస్తున్నా నేనేమయ్యానని

113. వెచ్చగా తాకే వేకువ నీవు
వేకువ వాకిట ముగ్గును నేను

114. నిర్దయుడవే
నా కలల్ని సైతం కబళిస్తూ

115. నాలో నన్నే మాయం చేసావే
నిలువు దోపిడీ అంటే ఇదేనేమో



**మాధవి అన్నా ప్రగడ**
ఎ1-204, సిల్వర్ స్ప్రింగ్స్ (మోడి),
హెచ్.ఎమ్.టి.టౌన్‌షిప్,
కుత్బుల్లాపూర్, హైదరాబాద్-54.
వృత్తి: గృహిణి
మొబైల్ నెం: 9441938135
ఈ-మెయిల్:
madhavi.annapragada@yahoo.com

# మధుర మాలికలు...

1. నాతలపుల పుస్తకంలో దాచుకున్నా
నీ జ్ఞాపకాల పరిమళాలన్నీ

2. అచ్చం మనప్రేమలానే
కాలాల కౌగిళ్ళల్లో క్షణాలు కరిగిపోతున్నాయి

3. నా తలలో జాజులై పరిమళిస్తున్నాయి
నన్నొంపుకున్న కళ్ళలో నిన్ను నింపుకున్నాను

4. కన్నీరై కరుగువో... ఎదకు పన్నీరే చిలకరిస్తావో
నిన్న నా కౌగిలిలో ఒదిగిన నువ్వునేడు...

5. నా అక్షరాల్లో మాత్రమే మిగిలావు
నువ్వు ఎదురుచూసే నేటిని నేను

6. మేఘమై నువ్వొస్తావని
నామది సంద్రమై ఎదురు చూస్తోంది

7. మోహాల వాకిట్లో నువ్వున్నావు
ప్రేమవాకిట్లో నేను ఎదురుచూస్తుంటే

8. నాచుట్టూ నువ్వో మరి నీచుట్టూ నేనో
అల్లుకుపోతున్నాం అందంగా ఏదో తెలియని బంధంగా

9. గాయాన్నే నేను
గతించిన మన జ్ఞాపకాల గేయంలో

10. వలపుతీరాన్ని చేరే అలను నేను
గాయాల వలవేసే జాలరివి నువ్వు

11. కవ్వించే కాలమే
కాలనాగై కాటేస్తుందెందుకో..!

12. కలల వాకిళ్ళు
నీకై చేస్తున్నాయి వెన్నెల జాగారాలు

13. మౌనాన్నో మంత్రాన్నో మరి
నీకై తపించే వలపుతీరాన్ని

14. తప్పక చేస్తున్నా మదిని ముక్కలు
గాయం నాకే అని తెలిసినా

15. జీవితకాలపు ఖైదీనే
నీమది చెరసాలలో

16. నీ జ్ఞాపకాల వర్షం..
నాచెక్కిట కన్నీరై కురుస్తోంది

17. తొలకరిచినుకులు చెప్పేశాయి
మన ప్రేమాభిషేకానికి తలంబ్రాలై తరలొస్తామని

18. తనువంతా తలపుల గాయం
నీ జ్ఞాపకాల చెమరింతల్లో

19. నీ మనసే తలపుల విషాదాన్ని మిగిల్చింది
మళ్లీ మళ్ళీ జ్ఞాపకాల రంపంతో కోస్తూ

20. జ్ఞాపకాల తలపుల్లో
చెరో తలుపు చివర మనం

21. తలపుల చెమరింతల్లో
ఊసుల గంధం నువ్వు వలపుల బంధం నేను

22. దెబ్బేదైనా తల్లడిల్లే తీరొకటే
కళ్ళేపైనా చెమరింతల తడుపొకటే

23. నువ్వు విసిరేసిన జ్ఞాపకాలన్నీ
అక్షరాల మైదానంలో వెతుక్కుంటున్నా

24. వెలుగు ముగ్గులు పెడుతున్నా
కలల దారిన నువ్వొస్తావని

25. అక్షరాలకందని శిక్షేదో వేశావు
మది మౌన పోరాటంలో నను బందీని చేశావు

26. ఆరు ఋతువులు ఆరు క్షణాలే నువ్వుతోడుంటే
అర క్షణమైనా కదలదు నావెంట నువ్వులేకుంటే

27. కాలం కాన్వాసుపై
క్షణాలుగీసే చిత్రాలెన్నో

28. నీ పేరే లిఖిస్తున్నా
ఆవిరైన నా ఆశలపైన

29. నీ జ్ఞాపకాల పువ్వులన్నీ దాచుకున్నా
మరు జన్మల ప్రేమ సంతకానికై

30. కన్నీటిని వర్షించే గగనాన్నే
బాధలమేఘాలు గుండెల్లో దాచుకుని

31. అంబరమే నామది
నీ చెలిమి సంబరమై చేరేవేళ

32. జ్ఞాపకాలని చిదిమేస్తున్నా
రాలిన నా ఆశలకు సాక్ష్యంలేకుండా

33. కలవరింతల సుప్రభాతాన్నే
నీచూపుల సూర్యోదయంలో

34. ఆనందపు వెన్నెలనే నీ జతలో
అమాస నిశినే నీజాడలేని నిశీధిలో

35. ప్రతిపేజీలో నీ జ్ఞాపకాలే
నా ఒంటరితనాన్ని వెక్కిరిస్తూ



**మాధవి ప్రసాద్ .కె**
హౌస్ నెం.40, వెంకటాద్రి నగర్ కాలనీ,
హుమాయూన్ నగర్,
హైదరాబాద్-500028.
వృత్తి : గృహిణి
మొబైల్ నెం: 7386860976
ఈ-మెయిల్:
kp.madhavilatha@gmail.com

# మధు మాలికలు...

1) నీకన్నా అద్దమే ఎంతో నయం
నేనేడిస్తే అది ఎప్పుడూ నవ్వదు

2) జాబిల్లికీ తప్పలేదు
ఉల్కాపాతాల గాయాలు

3) ప్రేమ చేసే గాయాలకు...
కాలం మందువేస్తుంది మరపుతొ!

4) తుమ్మెదలు దాడిచేస్తున్నాయి...
నీఅధరసుధలపై వాటికీ హక్కు కావాలని!

5) అలసిపోతోంది గుండె కొట్టుకోలేక
నన్నొదిలిన నీకోసం పరుగెత్తలేక!

6) ఎందుకలా నువ్వూ కోపంగా చూస్తావు?
అస్సలే బయట ఎండలూ మండిస్తున్నాయ్!

7) గుండెని రాయి చేసుకుంటా
రామపాదంలా నువ్వే వస్తానంటే

8) కాలమా...పరుగెత్తు నా అంతానికి
తెరపడిపోనీ...తనతోడులేని నా జీవితానికి

9) ఇద్దరమూ నలుగుతున్నాం
కాలానికి బంధీనై నేను.. కర్తవ్యానికి బద్దుడవై నీవు

10) మళ్లీ ఎదురుచూడటం మొదలెట్టింది..మనసు
నిన్ననేగా నువ్వెళ్ళావన్న సంగతి మరచి

11) మనసెంత పిచ్చిది
వరించింది గతంలో.. తరిస్తున్నది నీజ్ఞాపకాల్లో

12) కళ్లకెపుడూ చమరింతలే
నీతలపు పలకరింతలతో

13) నేను నీతలపులని తరుముతుంటే
నాఆత్మ నన్నే వెలివేస్తోంది

14) విచిత్రమే...!
నామనసు బాధ అక్కడే ఉన్న నీకు తెలియకపోవటం !

15) గుబులుపిట్ట
ఎంతకీ గుండెగూడు వదిలి పోదేమి?

16) ఒకటి పొందాలంటే..మరోటి వదిలెయ్యాలట
నిన్నొందటానికి నన్ను నీలోనే కోల్పోతాను

17) నీ తలపు తట్టినపుడల్లా
కంటిపాప తడుస్తోంది ఎందుకో..?

18) చిరునవ్వుల్ని ఒక్కొక్కటిగా కూడబెడుతున్నా
నీవొచ్చినపుడు అడుగడుగునా అందిచటానికి

19) కాలాలెన్ని మారుతున్నా
నా కళ్ళకెపుడూ వర్షాకాలమే నీతోడులేక!

20) ఈరోజైనా మనసు శివునిపై లగ్నం చేద్దామంటే
నువ్వేంటి మధ్యలో నాదీక్ష భగ్నం చేస్తూ

21) ఎవరు కాసారో పందెం
ప్రతిక్షణం పరిగెడుతూ క్షణాలు

22) గడిచిన క్షణాలను రాలుస్తూ కాలం
నీతోగడిపిన మధురక్షణాలను ఏరుకుంటూ మానసం

23) అందనంత ఆకాశానివి నువ్వు
తదేకంగా చూస్తూ నేను..అందరినీ అలరిస్తూ నువ్వూ

24) సిగ్గు బుగ్గలకి రంగులద్దడమేకాదు
కాలికి ముగ్గులెయ్యటమూ నేర్పిస్తోంది

25) అలసిన మనసుకింత ఊరట
అలుపెరుగని నీతలపుల కౌగిలిలోనేనట

26) మాటైనా చెప్పకుండా వెళ్ళిపోవాలని నువ్వూ
మరలా వస్తాననే మాటతీసుకోవాలని నేనూ

27) చీకటే అంతా
కనుపాపలేని కంటిలోనూ ..నీవులేని ఈగుండెలోనూ

28) వెక్కిరిస్తోంది జీవితం
అన్నీవున్నా ..ఇవ్వకుండా దాచినవెన్నో ఉన్నాయంటూ

29) మరలిరావు మరి కాలేజీ రోజులు
వడలిపోవు మది దోచిన రోజాలు

30) గుండెగూటికి పండగొచ్చింది నీచెలిమితో
కనులలోగిలికి వెలుగొచ్చింది నీరాకతో


31) మల్లెలు జాజులు పోటీపడుతున్నాయి
నీ నవ్వుల్లోని స్వచ్ఛతతో

32) నువ్వు అలిగావనేమో
గాలి కూడా వీచటం మానేసింది

33) నిద్రాణమైన హృదిని తట్టిలేపావు
ఆలస్యంగా వచ్చినా ఆరోప్రాణమైనావు

34) చుక్కల తోటలో జాబిల్లిపువ్వు
నింగిచెట్టుకి రోజూ పూస్తాడు

35) ఆకులల్లె రాలుతున్నాయి
నీపై నేను పెట్టుకున్న ఆశలు



**రాజా రవి శ్రీనివాస్ యల్లాప్రగడ**
ప్లాట్ నెం. 103/B,
ఈశ్వర్ విల్లాస్, నిజాంపేట్,
హైదరాబాద్ - 500090
కలం పేరు: సూరీడు
వృత్తి: ప్లానింగ్ మానేజర్ (L&T)
మొబైల్: 9948595957
ఈ-మెయిల్: rajask11@gmail.com
వెబ్: www.velugurekhalu.com

# సూరీడు వెలుగులు...

1. నాకు మృగమంటే జాలి
మనుషుల్ని దాంతో పోలుస్తారని

2. సగం పిచ్చోడు ఆస్పత్రిలో
పూర్తి పిచ్చోడు అధికారంలో

3. నువ్వు నీప్రేమలొంచి తోసేసావ్
నేన్నీతో సహా ప్రేమించా

4. ఆత్మహత్య చేసుకున్నాడు
మనసుపై భూతద్దం వద్దని చెబుతూనేవున్నా..!

5. కనిపించే రూపం కన్నా
రూపంలేని ప్రతిభలు మిన్న

6. కొన్ని పాపాల వాసన
మరణంతో కడిగినా వదలదు

7. సత్కార్యానికి శుభముహూర్తం
రేపు, ఇవాళ కాదు...ఇప్పుడే

8. ప్రేమించే హృదయం కన్నా
ప్రేమనుపంచే చేతులు మిన్న

9. అంతర్చక్షువులు విప్పార్చి చూడు
నువ్వు చూసేదంతా ఎంత అబద్ధమో తెలుస్తుంది నేడు

10. మనసుని ఓ మూల విడిగా ఉంచు
అప్పుడే అది నీకు తల వంచు

11. ప్రేమకు భాషెందుకు
భావప్రసారం చాలు నిశ్శబ్దపు మాధ్యమంలో

12. గోరంత ప్రేమదీపాన్ని గుండెకవాటాలలో కాపాడు
రేపు కొండంత వెలుగునిస్తుంది చూడు

13. వేరే జ్ఞానం ఎందుకు
వేదం వింటున్నాగా నీఎదసవ్వడిలో

14. వెనకేమున్నది గతం తప్ప
ముందుకు చూడకనే నేను నా గతి తప్పా

15. నా కలం ఎర్రగా రాస్తోందేం?
పొరపాటున నీసింధూరం అద్దావా ప్రకృతీ?

16. నేనో వలస పక్షిని
మనుష్య తీరం నుంచి...ఎక్కడ వాలాను ఇంతకీ?

17. భూతం, వర్తమానం, భవిష్యం...అంతామంచే
నాల్గు మాటల గీతా సారం

18. కూసింత దారి చూపించరూ
తప్పిపోయా..రత్నగర్భ భారతదేశానికి

19. జ్ఞాపకాల అరలు ఈ రోజు ఆత్రంగా తడుముతుంటే
అన్నీ ఖాళీలే..నువ్వెలా వదిలేసి వెళ్ళావో అలాగే

20. దుప్పటి నిండా అవినీతి చిరుగులే
పేదరికం చలేస్తోందని ప్రభుత్వదుప్పటి కప్పుకుంటే

21. ఎందుకలా తేరిపార చూస్తావ్
నువ్వేగా క్రితం జన్మలో పునర్జన్మలో మళ్ళీ కలుస్తానన్నావ్

22. నే ప్రపంచంలో లేను
ప్రపంచమే నాలో ఉంది

23. అన్వేషించు
కానీ అది నీతో ఆరంభించు

24. అనుకున్నది చెయ్యి
తగిలితే సరే..లేకుంటే అనుభవం

25. మరణం
జీవితానుభవ విరామం

26. గుడ్డివాడట బిచ్చం అడిగాడు
మరి అంతర్చక్షువుల గుడ్డివాడికి ఏ బిచ్చం వెయ్యాలి?

27. మానవత్వం కారుతోంది
మనసు బీటల్లోంచి...జ్ఞానకట్ట వేయండి

28. అసాధ్యంలో
"అ" తుడిపివేత...కృషితో

29. పయనం ఎప్పుడూ ఒంటరే
తోడుందనుకోవడం మన తృప్తే

30. ఈ లోకంలో ఉన్నామన్న ఊహలో మనం
అసలు ఈ లోకమే ఊహని అతడు

31. అసలు దుఃఖం ఏది?
అంతా అనుభవమే తప్ప!

32. దండం పెట్టి వరాలు కావాల్ట
దానికి మానవ జన్మే ఎందుకు?

33. కాలే కడుపుకి
కవితా? పట్టెడన్నమా?

34. నువ్వు దైవాన్ని నమ్మినట్టే
దైవం నిన్ను నమ్ముతాడు...సృష్టి వృధా పోదని

35. ఇప్పుడే కానిచ్చొచ్చా
ఊహల శవయాత్ర..నిజం కోసం

36. నువ్వు ఋణపడుండాలి కన్నీటికి
నిన్నొదుల్తూ నీ బాధనొదిలిస్తోంది

37. మనుషుల్ని గుర్తుపట్టాలంటే
ముందు నువ్వు మనిషివి అయ్యుండాలిగా

38. మానవత్వం కాలి బూడిదవుతుంటే
చీకట్లో కవితల్రాసుకోడానికి వెలుగడిగాట్ట

39. కిలకిలరావాల్తో నిద్దర లేచాను
చూస్తే మాఆవిడ నవ్వుతోంది

40. మంచి, చెడు
నువ్వటు చూసి, నేనిటు చూసి

41. ఎందుకలా నువ్వుపట్టిన కుందేలుకి మూడు కాళ్ళంటావు?
అదేంటి ఏకుందేలుకైనా మూడు కాళ్ళేగా ఉంటా

42. ఓడిపోతే చిన్నతనమా?
కాదు ఒకపాఠం ఎక్కువ అనుభవం

43. ఏదీ ప్రేమించలేని మనసెందుకు
తిరిగి ఆశించే బతుకెందుకు

44. ఇంతోటి దానికి విరించెందుకు?
మనమే రాసుకుంటే పోలా?

45. నన్ను నేను తవ్వుకుంటే
నాకు నేను దొరికాను

46. వాన వస్తుంది పోతుంది
ఆకాశం మాత్రం స్థిరం

47. గీతా ప్రథమ శ్రోత అతడు
రోజూ ప్రసరిస్తున్నా మనకెందుకో చీకటే

48. విలువలు వలువల్లా జారాయి
మనసు నగ్నత్వం బైటపడ్డది

49. కష్టాల కొలిమిలో కాల్తేనే...
మనసు బంగారం మెరుస్తుంది!

50. విరించి కష్టాల రాత
నా విశ్వాసంతో తుడిపివేత!

51. రోడ్డుమీద కాగితం విసిరావా నువ్వు
దేశాన్ని విమర్శించే హక్కే కోల్పోయావు

52. కలదో లేదో సందేహమేల
కళ్ళున్న వాడికి కనిపిస్తుందిగా

53. నీతో నిన్ను తీసుకోచ్చావు
తిరిగి నిన్నే తీసుకుపోతావు

54. కళ్ళతో చూసి
నిజమని నమ్మావా?..ఏ కళ్ళు?

55. వజ్రాన్ని కూడా కోస్తుందది తెలుసుగా
సంకల్పాన్ని తీసుకోకు ఎప్పుడూ అలుసుగా

56. కవితా హారం తయారు చేసే క్రమంలో
పాపం అక్షరాలను గుచ్చుతున్నానన్న సంగతి మరిచా!

57. మనిషంటే మనిషే అనుకున్నా
మనసుకి తొడుగని తెలుసుకోలేకున్నా

58. అతడి గొంతులో గరళం
అందుకే ఆకాశమంతా నీలం

59. మనసు పేరంటానికొచ్చా
వలపుగంధం పూయవూ?

60. మానవ మృగమట
బహుశా పొగడ్తేమో!

61. గందరగోళంలో చెప్పబట్టే
గీత బాగా ఎక్కి ఉంటుంది

62. అతడికి చెప్పడానికి మాత్రం ఇరవై నిముషాలు
మనకు అర్థం అవ్వడానికి జీవితాలకి జీవితాలు

63. అల పాఠం నేర్చుకోవూ
వెనక్కెళ్ళినా అదే స్ఫూర్తితో ముందుకు దూసుకు రావాలని

64. తీరం నవ్వుతోంది అలెప్పుడూ తనని చేరలేదని
దానికి తెలీదు అల తనని కోసుకుపోతోందని !

65. ఆశల సౌధం కూలితే
ఇంకా ఒకటి కట్టే పని నీ చేతుల్లో..

66. మనసు చేతిలో మనిషి
గుర్రం చేతిలో కళ్ళెమున్నట్టు

67. పోయిందని విలపిస్తున్నావా
తెగితేనేగా ముందుకుపోయేది!

68. ఎక్కడ వదిలేసొచ్చావు నాజ్ఞాపకాన్ని
ఇంకా ఇది ఆరోజన్మేగా!

69. ఎక్కడో తపస్సెందుకు
అందుకు జీవితముందిగా

70. వెనక్కో ముందుకో
అసలు నడిస్తేనేగా పయనం అయ్యేది

71. నేను మనమవలేమా
నలుగురూ మోసేలోగా!

72. నన్నొదిలెయ్యండి అంటూ కలవరింత
ఎలక్షన్లొచ్చాయని కలొచ్చినట్టుంది పాపం

73. అర్ధరాత్రి సూర్యోదయమయ్యిందనుకున్నా
వలపుసయ్యాట తర్వాత ఎర్రబడ్డ నీ మోము చూసి

74. నిద్దర లోనుంచి లేచా
స్వప్నం మాత్రం విడలేదు

75. నువ్విక్కడికి వచ్చావంటే
ప్రయాణం మొదలని కాదు..ఆఖరవబోతోందని

76. కవితలు రాయాలంట
ఉన్నది లేనట్టా...లేనిది ఉన్నట్టా...లేనిది లేనట్టా

77. మన పూర్వీకులందరూ ఋషులేనంట
మనం జబ్బలు చరుద్దాం!

78. చూడ్డం కంటే కలే నయం
కనీసం నిద్రొదిలాక కలని తెలుస్తుంది

79. చెప్పారు అటొద్దని
అందుకే నేనెంచుకున్నా

80. ఒంటరితనమా
నిన్ను కూడా వదిలేసుకున్నావా

81. భయం వెంబడిస్తోందా
అయితే వెనక్కి తిరిగి ఎదురెళ్ళు

82. ఊరూ పేరూ లేని అనామకుడినంటున్నాడు
అయితే వాడు దారిలో పడ్డట్టే

83. అందరమూ బాకీయే
ఎప్పుడో చేసుకున్న అప్పులకర్మలు తీరుస్తూ

84. భూమి గుండ్రమన్నప్పుడు
గెలీలియోని కొట్టారు

85. విధి రాతా?
నీకు నువ్వు రాసుకున్న రాతా?

86. కనిపించేది మాయమౌతుంది
మాయలేకుండా చూస్తే!!

87. ఎక్కడేముందో వెతుక్కోవాలి
అహం అంధకారం కప్పేసిన చోట

88. కను రెప్పలు మూస్తేనే
మొత్తం లోకాన్ని చూడగలిగేది

89. దేవుడా అని పైకి చూస్తావెందుకు
నీలో నున్న గుండెల్లో చూడకుండా

90. సంభవం...అసంభవం రెండు ధృవాలు
మధ్య విశ్వాసానికి అటూ ఇటూ

91. నేను నువ్వను బేధమున్నా
కాల్చే కట్టె ఒక్కటే

92. మనుషులమని గుర్తిద్దాం
తర్వాతే మనసుల గురించి మాట్లాడదాం

93. ఎప్పుడూ ఉన్నదొకటే దారి
రెండోది అడ్డుగోడే చూడు

94. వెనక్కి జారిపోతున్నావా
అట్టడుక్కెళ్ళేలోపు ఓ గడ్డిపరక దొరుకుతుందిగా

95. పౌర్ణమైనా రోజూ రాదు
చంద్రుడు తరిగి పెరిగితేనే

96. కారణం లేకుండా ఏదీ ఉండదు
ఆఖరికి నీ పుట్టుకతో సహా

97. సంకల్పకలంలో చెమటసిరా నింపు
నీరాత నువ్వు రాసుకునేందుకు

98. అతడిచ్చిన జీవితం, శరీరం, రక్తం, సంకల్పం
ఇంకెంత సైన్యం కావాలి బతుకు పోరాటానికి

99. కొంచెం బిజీ...
మనిషిగా బతికేందుకు!

100. ప్రపంచం ఊగుతోంది
మనసు మత్తులో!

101. సాగర మథనం
ముందు గరళం తర్వాతే అమృతం

102. పాడె మీద గుర్తొస్తుంది
మనిషిగా బతికితే బాగుండేదని

103. పరిగెత్తు...గుద్దుకుంటే మంచిదే
నీలో రక్తముందని గుర్తొస్తుంది

104. కాలం కాదు
నీకు నువ్వు కలిసి రాక

105. ఆవేదనకు అక్షర రూపం బాధ్యత
స్వీయ ఆచరణ రూపం హక్కు

106. దురదృష్టం మాయమవదూ
ధృడనిశ్చయం చెంత

107. వెలుగు రేఖలు ఆగవు
నువ్వు నిద్ర లేవకపోయినా

108. నీప్రేమను తెనిగించ
మరుజన్మకై చూస్తున్నా

109. మాటల్లేని భావాలకు
విలువెప్పుడు దొరికేనో

110. ఊత తొలగితేనే
మనకు నడకొచ్చేది

111. అంధుడు ఏనుగును చెప్పే చందం
మనం ప్రేమకు చెప్పే భాష్యం

112. మాటల దుస్తులు బాగున్నాయి
మనసు నగ్నత్వాన్ని కప్పుతూ

113. నీ మనసు తోటకు మాలివి నువ్వే
విరబూయిస్తావో...చెత్తగా మలుస్తావో నీ ఇష్టం

114. అక్షరాలే కాదు
భావాలూ కనుమరుగు...పైకెళ్ళే కొద్దీ

115. కాల్చే కట్టే ఒకటే
దహనానికైనా...వెలుగు చూపేదైనా



**రాజేష్ యాళ్ల**
హౌస్ నెం. 38-31-150/1,
గ్రీన్ గార్డెన్స్, మర్రిపాలెం,
విశాఖపట్నం - 530018
వృత్తి: బ్యాంకు కేషియర్ (IOB)
మొబైల్ నెం: 9700467675
ఈ-మెయిల్: rajeshyalla@gmail.com

# మాలికా 'రాజ'తరంగిణి...

1. మన పెళ్ళి రోజే అసూయ పడ్డా
నీ బుగ్గను ముందే ముద్దాడిన దిష్టిచుక్కపై

2. రెక్కలు వచ్చి పిల్లలెక్కడికో
రెక్కలుడిగి... కళ్ళుకాయలై... అమ్మానాన్నా

3. చాప కింద నీరులా ముదిమి
వెలిసే హరివింటికి రంగులెలా వేసేది?

4. సమసమాజాన్ని నిర్మిద్దాం
మన కులంవాళ్ళు ముందుకు రండి

5. పొద్దుటే విప్పారుస్తుంది ముఖం
నిన్ను చూడగానే అద్దం

6. ఎకరాలు గజాలు ఐపోతున్నాయ్
ఆరాటమేల? ఆరడుగులేగా చివరకు!

7. హృదయ కవాటం తెరిస్తే
కనులు రెండూ జలాశయాలే

8. నాదిష్టే పడేలా ఉంది నీపై
బుగ్గపై చుక్క పెట్టనా పెదవులతో?

9. సూరీడులా ఆమె
ప్రొద్దుతిరుగుడుపువ్వుల్లా కుర్రకారు

10. చితే చల్లన
చితికిన మనసుకన్న

11. వేదని శిలకు నైవేద్యం
వేడుతున్న బిచ్చగాడికి పూజ్యం

12. అమావాస్య రోజూ వెన్నెల
చెలిజాబిలి జ్ఞాపకాలు పరుస్తూ

13. చెలి నీడ జాడైనా లేదు
పిచ్చి కాకపోతే వెన్నెలకు నీడేంటీ?

14. ఆకాశపు దారాలతో
నీలంచీర నేసినట్టుగా చినుకులలో సముద్రం

15. నేనెన్ని లెక్కలు రాసినా
నీ లెక్క ముందే రాసి పెట్టేసావుగా విధీ?

16. ముంగురుల కాపలా
నీమోవి చెంతకు నేను రాకుండా

17. కాసేపు ఉండనీ...
కన్నీటి తటాకంలో... బాధలకు సేద

18. కోమలి కోపం కాసేపైనా
కోటి రైళ్ళు గుండెల్లో

19. అసలే అధిక జనాభా
అమృతం అందించకు నీనవ్వుల్తో

20. నాకలానికి ఆకలెక్కువే
సిరా తాగేస్తుంది... భావాలు ఒంపదు

21. ఏడుపెక్కువైపోతోంది..నాకు
ఎదిగెదిగిపోతున్నాడు పక్కవాడు

22. తమకంలో అక్షరాలు
తమలో తాము నీవర్ణన చదువుకుంటూ

23. పెళ్ళికి ముందెన్ని చెప్పావ్.
బాణాసంచాకు బయల్దేరిన నాన్నలా?

24. భయపడకు... చావంటే
బ్రతుక్కంటే భయంకరమైనది మాత్రం కాదులే

25. జ్ఞాపకాలను గుచ్చుతోంటే
వాలిపోతోంది భారంతో... మస్తిష్కపు దారం

26. నలుగురక్కల్ని చంపావట
నన్నైనా బైటకు రానీ నాన్నా -నీ కూతురు

27. గుండెనిపుణుడివి నీవు
ఎలా చీల్చాలో బాగా తెలుసు

28.. చీకటంటే నచ్చదా?
చందమామకు కళ తెచ్చేది తనేగా

29. నేత్రాల నైజాన్ని నిద్రపుచ్చావు
నిద్రన్నదే వాటికి మరిపించావు

30. మువ్వలకా అందమెట్టాగబ్బా?
నీ కాలిని చుట్టాకే కదా

31. నాకు వ్యాకరణం రాదు కానీ
నీవే కర్తా కర్మా క్రియా

32. దూరంగా నీవు
శిశిరంగా నేను

33. తను ముగ్గేస్తుంది
బంగారు కలువల్లోంచి వెండిపొడి రాలుతున్నట్టుగా!

34. కొత్త అత్తర్లు ఎన్నొచ్చినా
తొలకరిలో మట్టివాసన తేలేవుగా

35. ఇంకొన్ని అక్షరాలు...ఇంకొంచం భాష
తెలుగుకి కావాలి...నిన్ను వర్ణించడానికి

36. మల్లెల శరాన్ని విసరకు
వాలుజడను మంత్రదండం చేయకు

37. ష్... మెల్లగా చిరుగాలీ
సుమబాలలు గాయపడతాయి పాపం

38. చెలి ఒడి చిలిపిబడి
అమ్మ ఒడి ఆప్యాయతగుడి

39. భావచిత్రాలు గీసుకోడానికి
మరో చోటు లేదా... నాబుగ్గలేనా

40. మనసద్దం ముక్కలైనా
అన్ని ముక్కల్లోనూ ఇంకా నీముఖమే

41. కోకిల రావడంలేదు
కాలుష్యం కారణమనుకున్నా.... నీ మాటలనుకోలేదు

42. ముత్యాల వ్యాపారులు వరసకట్టారు
నవ్వుల్ని కాసేపు దాచుకుంటావా

43. చెరసాలలో చందమామ
కొబ్బరాకు కటకటాల్లోంచి తొంగి చూస్తుంటే

44. నువ్వు హత్యలు బాగా చేస్తావ్
నవ్వు నవ్వుకీ చంపేస్తూనే ఉంటావ్

45. నీ చెలికన్నా మేమే సున్నితమన్నాయి పూలు
పోనీలే.. నీ బాటకు నా అరచేతులున్నాయిగా

46. శీతాకాలమంటే అసూయ
నీ అణువణువునూ గిలి పెడుతోంది.

47. కుసుమాలన్నీ కోయబోయి.
కన్నీటి మంచు చూసి ఆగిపోయా

48. ఇరుకిల్లన్న బాధలేదు
నీ విశాల నయనాలు చాలు.

49. డాబామీద వెన్నెల ముగ్గులు
జాబిల్లీ కొబ్బరాకులూ కలిసి

50. శాశ్వతనేస్తం కన్నీరే
ప్రతిసారీ నాకోసం వెచ్చదనం వెచ్చిస్తూ

51. పసితనపు స్కూలుపెట్టె
పరిమళాలను తెచ్చేపెట్టె.

52. నాలో నేనుగా మొదలయ్యా
నీలో నేనుగా మరణిస్తా

53. నిష్పక్షపాత నయనాలు
కలలూ కంటాయి! కన్నీరూ కారుస్తాయి

54. జాబిల్లిని జత రమ్మంటే
ఉరిమి మూసేసింది మబ్బు

55. సూరీడి తుదిమెరుగులు
మబ్బు అంచులకు మెరుపులు పూస్తూ

56. చెరిగితే ఒట్టు
గుండెలో నీ జ్ఞాపకాల పచ్చబొట్టు

57. కులాన్నేం అనకు
కనిపెట్టిన కుటిలత మనిషిది కదా

58. ఆకాశంలోనూ షరతులే
అందుకే అన్ని పువ్వు గుర్తులు

59. జ్ఞాపకాలపూలు దండ చేస్తుంటే
వర్తమానపు సూది కసుక్కుమంది.

60. అడుగులో అడుగెయ్యను
చేతిలో చెయ్యే బావుంది నీ పక్కన నడుస్తూ

61. అవినీతి-కులాల మబ్బుల్లో
మా ప్రజాస్వామ్యపు చందమామ

62. పెళ్ళే!! తగలబడుతోంది..
నీవు పేర్చిన ఒంటరితనపు చితిలో

63. జీవిత శిశిరం
వసంతించేలోగా మరణించే ఆలోచన దేనికి?

64. నీ సాంత్వన సంద్రం ముందు
నా కన్నీటి అల చిన్నదే.

65. తులసీదళాల్లా నీ జ్ఞాపకాలు
బ్రతుకుభారాన్ని మరింతగా పెంచుతూ

66. అమ్మ వదిలిన ప్రతినిధి
గోరుముద్దలు గుర్తుతెస్తూ జాబిలమ్మ

67. సమతూకం అంటే
పిడికెడు గుండె, కడలంత దు:ఖమూనా?

68. రెప్పల రగడతో ఛస్తున్నా
నీవెదురుగా వస్తేనే తెరుచుకుంటాయట

69. పెదాల పడవ తపిస్తోంది.
అధరాల మధురతీరం చేరాలని

70. ప్రేమించడం నేర్పినవాడివి
విరహాన్నీ నేర్పలేదేం?

71. బాల్యం తలొంచుకుంది...
నా పెద్దరికపు చిన్నతనాన్ని చూస్తూ

72. క్రొంగొత్త రంగులతో మనసు.
నీ తలపుల కుంచెతో

73. చల్లని నీడ కోరుకున్నా
మల్లెల మేడనే ఇచ్చావు

74. అక్షరాలు తలొంచుతున్నాయి
నిన్ను వర్ణించడానికి వాటికి సిగ్గట

75. దిష్టి తీయనా
నీ అందాల మోముపై పుట్టుమచ్చనై?

76. ఎలా ఉంచుతావ్ తాజాగా
అహరహం అమృతమయమే అధరాలు

77. అద్భుతాలు రాస్తోంది
నా ఎదకాగితంపై నీ అధరకలం

78. చాలా మంచివైద్యుడు
పెద్దాస్పత్రిలో కాదు.. సొంతాస్పత్రిలో చూస్తాడు

79. నీవేనా దొంగిలిస్తున్నది
నిదురంతా నీవై నా నిదురను?

80. రెప్పల్ని తెరవలేనిక
కలలోని నీవు దూరమైపోతే ఎలా?

81. అబద్ధాల చితిపై
బ్రతుకు శవం

82. నీరదమై కురుస్తావని
నేలంతా నేత్రాలుగా చేసికొని నేను

83. ప్రబంధాలకంది ఉండవు
ప్రాచీనకాలంలో పుట్టుంటే

84. కలల్ని కబ్జా చేస్తూ ఎన్నాళ్ళు?
నిజంగా ఎదురు రా.... చూసుకుందాం

85. అప్పుడూ ఇప్పుడూ ముత్యాలే
నవ్వులు కన్నీటిగా మారి

86. అలవోకగా నవ్వుతావు
అల్లకల్లోలం రేపుతావు

87. జ్ఞాపకాల చేదుమాత్రలకు
వర్తమానపంచదార పూస్తున్నా

88. మంత్రాలతో బందీనయ్యా
నీ పెదవులతో కదా మంత్రించావు

89. నిలువద్దం నిరసించింది
నీ అందంతో పోటీ పడలేదట

90. ఇసుకలో గుజ్జెనగూళ్ళు
గుండెల్లో గుబులుగూళ్ళు

91. ఎర్ర గులాబీలా నీ అంగీకారం
బుగ్గల్లో పూచాక సంతోషానికి అంతేముంది?

92. చదువులతల్లికెంత మొక్కినా...
అర్థం కానివ్వదు వాళ్ళాయన రాతేంటో!

93. కాలమే కదా
అద్భుతమైన వైద్యుడు

94. నిన్ను చూసాకే గ్రహించా
వెన్నెలనూ పోత పోయొచ్చని

95. బ్రహకు ముద్దులు పెట్టాలనుంది
నిన్ను సృష్టించినందుకు కృతజ్ఞతగా

96. కలం బానిసైంది..
కాగితపు స్పర్శకి

97. తన్మయమౌతూ కాగితకన్నె
కితకితలు పెడుతున్నది కలంకుర్రాడు మరి

98. మౌనం రాజ్యమేలితే ఏలనీ
చూపుల సామ్రాజ్యాల్లో ఉన్నాంగా

99. కులుక్కో కుదుపు
నీ లోలాకుతో... నా గుండెలో

100. బూచాడని భయపెట్టేది
దేవుడే బూచాడై ఎత్తుకుపోయాడు అమ్మని

101. మాఊరు తప్పిపోయింది
రచ్చబండా లేదు.... గంగరావీ లేదు

102. నీ మధుర జ్ఞాపకాలకు
ముత్యాలు అద్దుకుంటున్నా కన్నీటితో

103. కూసింత సోటెట్టు సాలు
మనసంతా మేడ కట్టేస్తా

104. కవితాపల్లకిని మోస్తూ
భావాల బోయీలు

105. అయిష్టంగానే శిశిరమయ్యా
వసంతమై వాటేస్తావని

106. స్థితప్రజ్ఞతలో మేటి.
మనుషుల్ని కలుపుతూ, విడదీస్తూ... రైలు

107. ఓపిక లేని భ్రమరం
రాలు పూలకై చూస్తూ

108. తులసి తీర్థంలా.
చెలి నవ్వు... చివరి క్షణాల్లో

109. పేదోడు ఆకలి వల్ల దొంగ
పెద్దోడు వాళ్ళ వల్ల దొర

110. నా చూపుల గోరింట
చెలి చెక్కిళ్ళలో పండుతూ

111. కాలుతున్న భూగోళం
పట్టుకోవడానికి ఆకులేవీ?

112. సూర్యుని చెర్నాకోల
మేఘాల వృషభాలపై

113. స్రవిస్తున్న శవాన్నయ్యా
నీ జ్ఞాపకాలకాకి పొడిచి పొడిచి

114. జాబిల్లిని వీడని తారల్లా
చెలి మోమున మొటిమలు

115. శ్రీనాథుని కలంలా
నీ వేలికొసలతోనే ఎంత శృంగారమొలికిస్తావు!



**రాంకిషన్ గొల్లపెల్లి**
10-140, గోదావరి రోడ్,
ఓం శ్రీసాయి జ్యోతిష్య విద్యాపీఠం,
ధర్మపురి, కరీంనగర్ జిల్లా.
కలం పేరు: రాఖీ
వృత్తి: సీనియర్ మేనేజర్
(డెక్కన్ గ్రామీణ బ్యాంకు)
మొబైల్ నెం: 9849693324
ఈ-మెయిల్: rakigita9@gmail.com
బ్లాగ్: raki9-4u.blogspot.in

# రాఖీ పుష్యరాగాలు...

1. రెండు కణాలు సంకలిస్తే జననం
ఒకక్షణం ఫఠేల్మని పగిలితే మరణం

2. మతి శ్రీమతి పరంబైనపుడు
మతి మరపు...పునఃపునరుక్తంబగు

3. వెన్నెల రుచి తెలిసిందోచ్
నిను ముద్దు పెట్టుకున్నాక

4. రాయబారమౌ...లేఖ
రాయ భారమైంది...ఎద తట్టుకోలేక

5. మెలకువకి సెలవిక
కలలకి అవుతోంది వేకువ కనుక

6. ఆశనేరవేరితే...కల 'వరం'
ఆశ చేజారితే...'కలవరం'

7. చెలి వరమిస్తే
కల వరం..కరమిస్తే...కలవరం

8. బాధల్లారా...కాస్త ఓపిక పట్టండర్రా
ఆమాత్రం కన్నీరుంటే..ఆనందంగా ఏడవనూ

9. ఘల్లుఘల్లున మ్రోగుతా
నాగుండెని తగిలించుకో నీ తాళంగుత్తికి.

10. మరణం అంటే నీకు నువ్వు లేకపోవడం కాదు
ఈ ప్రపంచానికి నువ్వు లేకపోవడం ..చిత్రం కదూ

11. ఎదురుపడితే ఏమో గాని
పరోక్షంలో.. ప్రతిక్షణం నీదే

12. నీ చూపు గీస్తోంది ...చిత్రాలు మత్తుగా
నీ నవ్వు చేస్తోంది చిత్రాలు గమ్మత్తుగా

13. గుచ్చితేనేమి..గుండెలో సూది
చేరుకుంది మల్లి నీ వాలు జడ కౌగిలి

14. రాత్రంతా నిద్ర లేదు
ప్చ్..!ప్రేమ విఫలమై...కాదు..దోమ సఫలమై

15. హెర్క్యులాస్ భూమిని ఎత్తాడేమో
వాలిపోయే రెప్పలని ఎత్తగలడా

16. నువ్వతికించే..ఉత్తరానికెంత అదృష్టమో
నీ లాలాజలామృత రుచినెరిగింది

17. నీ హృదయం కృష్ణ బిలం
ఒక్కసారి పడ్డామా..అస్తిత్వం మటుమాయం

18. నీ పాద మంజీర నాదం కన్నా ముందుగానే
ఓహ్ ...గుభాళించే నీ పరిమళం నన్ను చేరుతుంది

19. నిప్పూ నీరూ ఒకటె
కడుపుమంటే...కంటివరద...కదా

20. ఏమీ లేని బికారినయ్యాను
స్నేహమంతా మీకే పంచేసి

21. నడయాడే పూదోట మావిడ
నాసిక, నవ్వులు, పెదాలు, బుగ్గలు, కన్నులు, పూలే

22. భాష చెప్పలేని భావం
ఒక స్పర్శ తెలుపుతుంది

23. చంద్రుడికి వేరేపనేం లేదు
భూమిచుట్టూ చక్కర్లు కొడ్తూ, వెన్నెల తాయిలం పెడ్తూ

24. తెలుసుకుంటే సర్వం బ్రహ్మ
తెలియకుంటే సకలం భ్రమ

25. ఊరంతా క్షామం
మాచెరువు మాత్రం నిండింది..నాకన్నీటితో

26. నీ పెదాల మధురిమ
ఏ పదాలకూ..అందదు..ఒక్క..నాపెదాలకు తప్ప

27. చెప్పలేని భావాలు త్రుప్పు పడుతున్నాయి
అప్పుడప్పుడూ ఆకురాయి పట్టాలి కలంతో

28. రోజొక యుద్ధం
మాటలతో...మౌనంతో...తనువులతో...తడికలతో

29. తోలుకప్పిన ఆస్థిపంజరం మనిషి,
మనసూ మానవతా మృగ్యమైతే

30. రోజూ మాకు గృహప్రవేశమే
నిత్యం పాలు పొంగి నేలపాలు ఔతూనే ఉంటాయి

31. రాలాయి దార్లో పారిజాతాలు
నీ పాదాల క్రింద నలిగినా జన్మకు చాలని

32. అలదీ చెలిదీ ఒకటే వైనం
దగ్గరికెళ్తే దూరం వెనుదిరిగితే తీరం

33. పండింది గోరింట కాదు
ఇందాక సిగ్గుతో అరచేతుల ముఖం దాచిన ఫలితం

34. మల్లె గొల్లుమంది
నువ్ తనతో తూచుకొన్నాక... బరువయ్యానని

35 నువ్వు నవ్వితే అమృత మథనమే
హాలహలం తప్ప అన్నీ పుడతాయి



**సాయికామేష్ గంటి**
23-20-1, రెండవ అంతస్థు,
సుబ్బారావు వీధి, సత్యనారయణపురం,
విజయవాడ-520011
కలం పేరు : అన్వేషి
వృత్తి : సీనియర్ పాసింజర్ గార్డ్ (రైల్వేస్)
మొబైల్ నెం. 7702772301
ఈ-మెయిల్: sandyamadhuri@gmail.com
వెబ్: www.facebook.com/sai.o.anveshi

# పారేసుకున్న క్షణాలు...

1. సప్తపదిలో ఏఅడుగు తప్పుగా పడిందో
సమిధగా మారిపోయింది నవవధువు చిరునవ్వు

2. హరివిల్లులో చోటివ్వలేదనా
నలుపు రంగు... రాత్రిలో ఒదిగిపోయింది

3. మాతృదినోత్సవం అనుకుంటా
వృద్ధాశ్రమం గేటుకతుక్కున్నాయ్..కొన్ని కళ్ళు

4. స్కూలుకెళుతూ కనిపించింది పసితనం
పుస్తకాల శిలువని మోస్తూ

5. మనసు అట్టడుగు పొరలలో వెతుకుతున్నా ఆశగా
చిరునవ్వుల తడి ఎమైనా మిగిలుందా అని

6. విరహమంటే ఎప్పటికైనా నువ్వొస్తావనే ఆశ
విషాదమంటే నువ్వెప్పటికి రావన్న వాస్తవం

7. నీమది చేరని నాభావాలు
నీజూకాలను పట్టుకుని వేలాడుతున్నాయి

8. 'ఇప్పటిదాకా నాతోనే ఉన్నాడు'ట
బాధగా అంటోంది మరణ లేఖలో చివరి అక్షరం

9. కన్నీళ్ళతో కడిగేయడానికి
నువ్వు నలుసువి కాదు...కనుపాపవి

10. చెత్తబుట్ట నోరు తెరిచింది
తొలిప్రేమలేఖ రాయడం మొదలెట్టగానే

11. ఆగకుండా ఎక్కిళ్ళ చప్పుళ్ళు
మదిఖర్ఖానాలో జ్ఞాపకాలు తయారౌతుంటే

12. ఆలుమగల మధ్య గొడవట
భార్య ఏకపాత్రాభినయమే వినిపిస్తోంది

13. ఎన్ని తారలు మింగిందో మరి
అమాశలోనూ..చీకటి మెరుస్తోంది..వింతగా

14. హోళీ అంటె తనకిష్టమంది
నల్లరంగే చల్లుతోంది...మనసుపై

15. మాటలు మరణించాయి మరి
నిశ్శబ్దంగా మౌనంచెక్కిలిపై...జ్ఞాపకాలచారికలు

16. నా వేదనతో రమిస్తూ నిశి
అక్షరాలు ప్రసవిస్తోంది..నా డైరీలో

17. వర్షంలో తడవటం ఇష్టమన్నావుగా
ఇదిగో నా కనులు వర్షిస్తున్నాయి.. ఇపుడైనా రావా

18. నా కలానికి పదును ఎక్కువ
ఒక్కోసారి నా మనసునే కోసేస్తుందది.

19. ఎక్కడ ప్రారంభమైనా
నీతోనే అంతమౌతోంది..నా ప్రతీఅలోచన

20. ఎటు వెళ్ళాలో సందిగ్ధం మనసుకి.
అటువైపు తాను...ఇటువైపు నేను

21. తాగిన వెన్నెల చాల్లేదేమో
తొడిమలింకా ఎర్రనే ..పారిజాతాల్లో

22. నీ తలపులు
ప్రతిరాత్రీ నా నిదురని భోంచేస్తూ

23. ప్రేమకు తను పెద్దబాలశిక్ష
విరహానికి నేను విజ్ఞానసర్వస్వం

24. మానవత్వం మరణించింది
నడివేసవిలో..గుక్కెడు నీళ్ళు దొరక్క

25. అమ్మాయి చేతి స్పర్శ తాకినందుకేనేమో
వాకిట్లో ముగ్గులకి అన్నన్ని మెలికలు

26. నా కలం అక్ష(ర)యపాత్ర
అనుక్షణం అక్షరాలు రా(లు)స్తూ

27. కన్నీటిలో తడిసాయేమో కలలు
నా ఆశల వెలుగులు ప్రసరించగానే జ్ఞాపకాల హరివిల్లు

28. ప్రపంచమంతా ఎదురౌ(రి)స్తోంది.
తనకోసం గతంలోకి నేను పయనిస్తుంటే

29. మరోరోజు గడిచిపోయింది
నువ్వు రాకుండానే..విధిచేతిలో నేనోడిపోతూ

30. అమ్మాయి బీకాం అనుకున్నా..కాదు..బీయెస్సీనే
చూపుల్లో యాసిడ్ వర్షం..మనసును దహించేస్తూ

31. ఒంటరితనానికి...ఏకాంతానికి.
ఒకటే తేడా...నీ జ్ఞాపకాలు

32. మనమధ్య దూరం అడుగే
చేరడానికే... జీవితం సరిపోదంతే

33. చీకటిదుప్పటికి చిరుగులెక్కువే
బైటపడుతోంది వెలుగు అక్కడక్కడా...తారలుగా

34. సిగ్గులు గగ్గోలెడుతున్నాయి
చెలి చెక్కిలిని విడిచి వెళ్ళేదారిలేక

35. నీ చూపులు గుర్తుచేస్తూ
వేళ్ళచివర 'చురుక్కు'మంటున్న సిగరెట్

36. కాలం మాత్రం గడియారంలో చక్కర్లు కొడుతుందట
నన్ను మాత్రం వర్తమానంనించి భవిష్యత్లోకి తోసేస్తూ

37. గతానికి ఆకలెక్కువ.
వర్తమాన భవిష్యత్లను మింగేస్తుంది మెల్లగా

38. డైరీ రాస్తుంటే.
నా కన్నీటిలోదూకి కొన్ని అక్షరాలు ఆత్మహత్య చేస్కుంటున్నాయ్

39. నీకై పరచిన నామనసుపై
నీపాదాల స్పర్శ బదులు పరిస్థితుల పదఘట్టనలు...పరిహసిస్తూ

40. నిరీక్షణలో నిర్బంధించకు
ఎదురుచూపులు ఎదని కోసేస్తున్నాయి, కాలమనే రంపంతో నిర్దయగా

41. నామనసు అక్షయపాత్ర
ఎన్ని జ్ఞాపకాలు కన్నీళ్ళుగా ఖర్చైనా

42. విరహం అంటే
వీడిపోవడం కాదు... మానసికంగా వీడలేకపోవడం

43. నువ్వు తీరానివో...లేక అందనంత దూరానివో
నేను మాత్రం కన్నీటి అలనే ఎపూడూ

44. నీ పరిచయం
నా సుస్పష్టాస్పష్టాల మధ్యంతర రేఖ

45. అడుగు బైటకేస్తున్నావా...?
కలికాలం కాదమ్మాయ్..ఇది 'ఆకలి'కాలం

46. వాడిపోయాయనుకున్నా..ఊహు
ఇంకా వాడిగానే..నీ తలపులు

47. భావాలు భారమయ్యాయనేమో
గాలి వీచినా కదల్లేదు...డైరీపేజిలు

48. "పరాణ్ణజీవులు..నీ తలపులు
తరిమేస్తున్నా..నాలోనే బతికేస్తూ

49. పడమర పొందులో సూర్యుడు
తూర్పు..నిట్టూర్పుల విషాదచాయల్లో

50. జ్ఞాపకాల శవాలలో
జీవచ్ఛవాలను వెతుకుతున్నా...ఆశ చావక

51. ఉషోదయాలన్నీ రసోదయాలే
నీవులేనపుడే నీరసోదయాలు

52. కుత్తుకలో నీ తలపుల కత్తులు
పీల్చే శ్వాసని సైతం చీలుస్తూ

53. అరుణవర్ణం చెలి చెక్కిళ్ళలో
సప్తవర్ణాలు నా హృదివాకిట్లో

54. మమ్మీడాడీల చేతిలో
అమ్మానాన్నల హత్య

55. నా హత్యకి
హంతకుణ్ణి..నేనే

56. 'నా'కు 'నీ'కు
మధ్య...'ని'శబ్దం

57. నా డైరీలో తెల్లకాగితం
లిపిలేని భావాలకి సాక్ష్యంగా

58. ఏటుచూసినా నీజ్ఞాపకాలే
కనులు మూసినా రెప్పలను కో(తో)సేస్తూ

59. నా విషాదానికి గణతంత్రం
చెలి 'పరాధీన'గా మారినక్షణం

60. ఊరవతల శ్మశానం
మధ్యకొచ్చింది...కబ్జాలాటలో

61. నా మౌనం చిరుగుల దుప్పటి
నువ్వు నవ్వుతూ ఎదురుగా ఉంటే

62. అలారం శబ్దం మారిపోయింది.
పసిపాప ఇంటికి వచ్చిందిగా

63. అద్దంలో బంధించా చందమామని నీకు ఇద్దామని
నీవైపు తిరిగేసరికి బందీగా నువ్వు... నాకోసం

64. రక్తం... రంగు తెలుపు... నమ్మవా
నువ్వు దూరమయ్యాక నాకన్నీటిని చూడు

65. నిశ్శబ్దమైన యుద్ధం
నా కనురెప్పలకు నీ తలపులకు...నిదుర విషయంలో

66. తను శిథిలం చేసిన నాహృదయాన్ని తడుముకున్నా
తనే తాకిందనుకుని ఆశగా చూసింది మరోసారి

67. నీ నాలుకతో నా కనుపాపను ముద్దడావు
కంటిలో నలుసు పడింది అంటూ...దొంగా

68. ఏదో కోల్పోయిన భావన
నిన్నా? లేక నన్నా??

69. శాఖాహారమే తింటాడట
చెట్లుకు కూడా ప్రాణముందని మరిచిపోయాడు

70. నువ్వే నయం
నీ తలపులు మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి నన్ను

71. చేరుకున్న ప్రతిమజిలీలో ఆశగా చూస్తా నీకోసం
అదేంటో...ఎపుడూ వాస్తవం వెక్కిరిస్తూ కనిపిస్తుంది

72. ఎన్ని వసంతాలు వర్షించి శిశిరమైపోయాయో
నీకై నా ఎదురు చూపులలో

73. నావేళ్ళ కొసలు వణుకుతున్నాయి
'నీ ఇష్టప్రకారమే విడిపోదాం' అని నీకు లేఖరాస్తుంటే

74. నిమిషంలో తిరిగొస్తానంది
యుగాలు కరిగిపోయినా ఆ నిమిషం గడవదే ఇప్పటికీ

75. నా కవనపు ప్రతీ పదం నీవే
నా గమనపు ప్రతీ పథం నీవే

76. ప్రేమలో విఫలమైతే తాగాలా...?
కన్నీళ్ళున్నాయిగా...మందు ఎందుకు..?

77. నవ్వినా ఏడ్చినట్టుంది.
నీ నవ్వుల ఎక్స్‌పైరీడేట్ దాటిపోయిందా

78. నీ పయనంలో నేనో మజిలీ
నాకు మాత్రం నీవే గమ్యం

79. నివేదించనా నీకు నా ప్రతీ అక్షరాన్ని
ఏఒక్కటైనా నీకు నా వేదన తెలుపగలదని

80. అనుమానాలెందుకు అమ్మాయి
నా ప్రతీ స్పందన నీ స్పందనల ప్రతిస్పందనలే

81. తాను వెళ్ళిపోయింది నిశ్శబ్దంగా
పున్నమిరేయికి నల్లరంగు అద్దుతూ

82. కాలం ఎలాంటి గాయాన్నైనా మాన్పుతుందట
కానీ..నువ్వు కాలానికే గాయంచేశావు

83. అడగంగనే వరాలిస్తావట...నిజమా శంకరా...?
అంతేలే...బంగారమడిగినా ఇచ్చెడిది బూడిదేగా

84. నా చేతిలో సిగరెట్
నీ తలపులతో నేను...ఒకేలా...కడదాకా కాలిపోతూ

85. ఎవరు అన్నారు కన్నీటికి రంగులేదని
నీతలపులతో అది సప్తవర్ణాలను సంతరించుకుంది

86. ఒకశబ్దం తర్వాత పూర్తిగా నిశ్శబ్దం
తడిమి చూసుకున్నా...పగిలిన హృదయం

87. ప్రతి ప్రశ్నకి బదులుందా?
'లేదు' ఒక సమాధానమే

88. మదిలో అస్పష్టమైన భావాలకి
చ(చి)క్కటి రూపాన్నిస్తూ...చీకటి

89. అర్ధాంగి అంటే సగభాగమేనట
నాకేమిటి తనే సర్వస్వమనిపిస్తోంది

90. నీకు మేఘసందేశం పంపుదాం అనుకున్నా
మేఘాలే కనపడలేదు...కనులుమాత్రం వర్షించాయి

91. నిన్ను నేను చూసినపుడు
కాలం కొన్నిక్షణాలు పారేసుకుంది

92. కనుపాప జలకాలాడింది
స్మృతిని శృతి చేసిన ప్రతీసారీ

93. జాలువారకే కన్నీరా
జాలిపడేవారు ఎవరూ లేరు ఇక్కడ

94. నేనెవరినని ప్రపంచమంతా అన్వేషించా
సమాధానం నీ చిరునవ్వులో దొరికింది...నీఆనందమే నేనని

95. నిను కలవడమే జీవితగమ్యం అనుకున్నా
కలిసాకే తెలిసింది నాప్రయణం ఆరంభమైందని

96. నన్ను వద్దనుకునేగా వీడిపోయావ్
ప్రతిఅడుగులో ఎదురౌతావే జ్ఞాపకమై

97. నేను
అనేక 'నీవు'ల కలయిక

98. నా కనురెప్పలపై
చెలి పెదవుల సంతకం...ప్రేమ

99. పారేసుకున్న క్షణాల్లో కొన్ని
తిరిగి నను పలుకరిస్తున్నాయ్...డైరీలో

100. మారిపోయా అభిమన్యుడిగా
నీప్రేమ పద్మవ్యూహంలో

101. చెలి పాదాలను ముద్దిడనా
నా"బరువు"ని అవి మోస్తున్నందుకు

102. తన పరిచయం కదలాడింది రెప్పలవెనుక
రేగిన గాయమై..రాయని గేయమై

103. శిశిరమా నువ్వొచ్చి ఎంచేస్తావ్
మదిలో ఆశలు ఎపుడో రాలిపోయాయి..తన వలన

104. గమ్యం వరకు తోడుంటాను
భౌతికంగానో..లేదంటే జ్ఞాపకంగానో

105. నీ పయనంలో నేనో మజిలీ
నాకు మాత్రం నీవే గమ్యం

106. తను రాసిన ప్రేమలేఖ.. ఎపుడు చదివినా
అక్షరాలు అలుక్కునే.. కన్నీరు చూపుకి అడ్డుపడి

107. అలసిపోయిన మదిసంద్రంలో
అలలూ లేవు..కలలూ లేవు

108. నాదైన లోకంలో
నీకు మాత్రమే చోటుంది...నాకు కూడా లేకుండా

109. గాయాన్ని తిరిగి రేపకే సమయమా
చివరి కన్నీటిచుక్క ఎప్పుడో ఇంకిపోయింది.

110. అక్షరాలు అన్నీ పోటీ పడుతున్నాయి
మా మొదటిపరిచయాన్ని అందంగా వర్ణించడానికి

111. కలం కదలదు...కాలం ఆగదు
కొన్నిరోజులుగా అన్ని తెల్లకాగితాలే..డైరీలో

112. ఎండమావిలో నీరు
కనులకే సొంతం

113. ప్రేమ గాయాన్ని చేస్తుందా...?
ఊహూ..చేసింది ప్రియురాలు

114. చెలి అందియగా మారిపోయా
మువ్వల సవ్వడికి నా ఎదలయతో తాళం వేస్తూ

115. నాదంటూ ఏముంది?
నీకు ఇవ్వడానికి.. కన్నీళ్ళతో సహా



**సంతోష్ కుమార్ కొత్తా**
ఫ్లాటు నెం: 203, బ్రిక్స్ వసంతం
అపార్టమెంట్స్, యాదవ్ స్ట్రీట్,
సుదర్శన్ నగర్, హైదరాబాద్ - 27.
కలం పేరు: సంతోషహేలి
వృత్తి: అప్లికేషన్ ఇంజనీర్ (ఒరాకిల్)
మొబైల్ నెం. 9553 575859
ఈ-మెయిల్: santoqriz@gmail.com
వెబ్:www.facebook.com/sanoetics

# సంతోషహేలి...

1. చిరునవ్వా! తారాజువ్వా!!
అంతటి మెరుపెలా సాధ్యం నీకు?

2. నా హృది విస్తరిలో
కమ్మని ప్రేమని వడ్డించాను... ఆరగిస్తావో,విసిరేస్తావో నీయిష్టం

3. వెటకారంలో శాస్త్రవేత్తవి అనుకుంటా
వలచినా పిలిచినా వయ్యారాలు పోతూ వెటకారంగా చూస్తున్నావ్

4. వేసవి తుమ్మెద సూరీడు
ఓపికనే తేనెని జుర్రేస్తూ

5. వెన్నెల మిఠాయి ఊరిస్తుంది
ఉడికిస్తున్న వేడివేడి వేసవిలో

6. చినిగిన కాగితంపై వ్రాసిన కావ్యం
ప్రణయమనే నాగిని కాటేసిన జీవితం

7. మన ప్రేమాయణ రచనకి అంతరాయం
మనసు పాళీకి ప్రేమసిరా అందకపోవటం

8. మనసూ మాటలు నేర్చింది
నీ పేరుని పలికినప్పటినుండి

9. కళ్ళకు బద్దకమే
నీ నుండి చూపుని మరల్చటానికి

10. ప్రేమలేఖ
చదువు అవసరం కోరని దరఖాస్తుపత్రం

11. దేవతలకి సైతం తప్పని కరువు
నీలాంటి సౌందర్యాన్ని భువికి పంపించాక

12. అసూయ శాస్త్రంలో పండితురాలివి
ఆ మాత్రం తెలియదా నా కోపానికి కారణం

13. రేయి రాకాసి
నీ తలపుల గోల చేస్తూ

14. కళ్ళకు కూడా ఆకలి ఎక్కువే
ఆ ప్రకృతి అందాన్ని ఆరగించాలని

15. తీవ్రవాదం భయపెట్టినా
తరగని అందం హిమాలయాల సొంతం

16. నీతో క్షణ కాలం
ఆ తలపుతో జీవితకాలం

17. రాక్షసులైనా భయపడరా
మన రాజకీయ నాయకుల పాలనలో

18. సామాన్యుడి దురాశ
ఎన్నికలలో ఓటేసి ఓటములన్నింటిని జయించవచ్చని

19. పేదవాడి కంటికి వర్షాకాలమే కదా
ఆకలి వెక్కిరించినా... అన్నం ఊరించినా

20. భవిష్యత్ భయపెడుతుంది
ఉచితంగా దొరికేది కన్నీరు మాత్రమేనంటూ

21. నీ కళ్ళేమైనా రెడ్ సిగ్నలా!
చూడగానే నా నడక ఆగిపోయింది!

22. క్షామమే మిగిలింది
కామమేలుతున్న రాజ్యంలో

23. పేదరికం
కన్నీటికి కూడా కరువు రావటం!

24. ప్రేమ
కవికి మాత్రమే పనికొచ్చే వస్తువు

25. నరకాసుని వధించిన స్త్రీకి
నేటి సమాజంలో నరకమే నడి రోడ్డుపై ప్రయాణం

26. సులభం.. అమ్మా అని పిలవటం
దుర్లభం.. అమ్మ ప్రేమకి సమానం

27. విధికి నీమది గది తాళం దొరికిందా
ఎంత కోరినా తలుపు తీయనని మొరాయిస్తుంది

28. పేదవాడికి షరామామూలే
బీటలుబారిన భూములు.. రాతలుమారని బతుకులు

29. జ్ఞాపకాలకి షరామామూలే..
విరహంలో వేధించటం.. వద్దన్నా విసిగించటం

30. ఒక చిలిపి సంశయం
ప్రతి తెలుగువాడి తలరాతనూ బ్రహ్మ తెలుగులోనే రాస్తాడా?

31. ఆదాయం పన్నుశాఖ వారికి తీరని ఆశ
కుబేరుని నుండి పన్నులు వసూలు చెయ్యలేకపోతున్నామని!

32. ఎందుకో అంత కోపం
చెంపల కెంపు ఎరుపు కళ్ళలో నిండితే బాగోదు!

33. నీది దిండులాంటి మనసు..
మెత్తనిది.. హత్తుకునేది.. హాయినిచ్చేది

34. తుంటరివే నువ్వు
కన్ను కొడతావ్.. కనురెప్ప వెయ్యనియ్యవ్

35. ఆగేది కాదు నా కలం,
ఆగిపోయినా సరే ఈ కాలం!

36. నీ మనసుకెంత మోమాటం
నీదైన నా మది మందిరంలో కొలువు ఉండటానికి

37. నీమనసుకెంత మోమాటం
నలుగురిలో నవ్వుల పువ్వులను విసరటానికి

38. పండగ పూట గుడి బాట
కడుపు నిండేలా ప్రసాదం మూట

39. చెలి పలుకులను వర్ణించతరమా అంటూ
అక్షరాలు సిగ్గులొలుకుతూ సమ్మె బాటపట్టాయి

40. గడియారంలేని లోకముంటే బాగున్ను..
ఒద్దులే .. ఇప్పటికే నీ మాటలతో సమయం తెలియట్లేదు

41. బండి కొనుక్కుంటున్నానంటే
పానీపూరీ బండేనా అంది తింగరబుచ్చి

42. ఆకలి చావులు ఆగవు
బియ్యం కిలో రూపాయయినా

43. చెలి చూపుల చమత్కారమా!
చైత్రంలో శిశిరంలా ఆనందభాష్పాల కన్నీటి ధార పొంగినది

44. రుచి చూపితే ప్రణయామృతం
నా తనువు తీరినా.. నీ ప్రేమలో తరిస్తా

45. విరహం
కన్నీరు మాత్రమే తీర్చగల దాహం

46. చిరునవ్వు చెరగదు
నా సంతోషం నీ స్నేహమైనపుడు

47. ఓటమి స్నేహం చెయ్యనంటే
గెలుపు ఒంటరిగా మిగిలిపోతుంది

48. ఓటనేది కాదు అంగటి సరుకు
ఐదేళ్ళ కాలాన్ని ఐదొందలకి అమ్ముకోకు

49. బద్ధకం ఆవకాయ బద్దలాంటిది
అలవాటైతే వదలటం కష్టం

50. గుండెలోతులో గుబులు మిగిలే
జ్ఞాపకాల గాయలు మండుతుంటే

51. వర్ణనకు పదాలు వెతుకుతున్న తరుణం
విరహ వేదనలో గాయపడిన హృదయం

52. చెలి జ్ఞాపకాల గాయం
స్ఫూర్తి నింపి నాతో రచింపచేసింది ఓ గేయం

53. శ్రీ శ్రీ
కాలాన్ని కవిత్వంగా మార్చిన కవి

54. భవిష్యత్ భారతం భుజాలపై
బడి బస్తాల బరువులు

55. నవ్వు 'కునేలా' ఉంది జీతం
నవ్వు 'కొనేలా' ఉంది జీవితం



**సిరి వడ్డే**
44, హుల్లాట్ రోడ్, కేంబ్రిడ్జ్, CBI-8,
యునైటెడ్ కింగ్డమ్,
కలం పేరు: సిరి
వృత్తి: కేషియర్ (మార్కెటింగ్ గ్రూప్స్)
మొబైల్ నెం: 07466651509
ఈ-మెయిల్: vaddaysiri@yahoo.com
వెబ్: www.sirivadday.wix.com/sirimallelu

# సిరిమల్లెలు...

1. నిలువెల్లా గాయాలే చేసినా
మది వేణువుకి ఎందుకో నీ తలపుల గేయాలే

2. తలపుల వనాలను పెంచినది నేను
తుంటరి భ్రమరమల్లె వెంటబడేది నీవు

3. మది సాగరంలో ముత్యపుసౌధాలు
నీ నవ్వులతో కట్టినవే

4. రంగుల కలలై వెలిసిపోతున్నాయి
మది కాన్వాసుపై ముద్రించుకున్న నీ జ్ఞాపకాల చిత్రాలు

5. మనోక్షేత్రం సుసంపన్నమే ఎపుడూ
నీఊసుల చిగురులను తొడుగుతూ

6. చిగురిస్తున్నాయి శిశిరాలు
కుసుమించే ఆశలతో శరత్ చంద్రికలై

7. మౌనభావాలు మధురమే
మనోసాగరతీరాన్ని ఆనందపు అలలుగా తాకుతుంటే

8. సిగ్గుల ముసురులేవో కమ్ముకుంటున్నాయి
నీ చూపుల చినుకులు చిటికెలతో సవ్వడి చేస్తుంటే

9. నా మనసులో వెన్నెల కురుస్తోంది
నీ నవ్వులను దోసిలి పడుతుంటే

10. అడుగులన్నీ అనాధలై మిగిలి పోయాయి
నీతో సప్తపది భాగ్యానికి నోచుకోలేక

11. గెలుచుకున్నా నీ మదిలో స్థానాన్ని
కోల్పోయానని గుర్తించనేలేదు నా హృదయాన్ని

12. సిగ్గుల మరుమల్లెలేవో సైగలు నేర్చుకుంటున్నాయి
అల్లరితుమ్మెదవై నువ్వు చెక్కిలి మీటుతుంటే

13. మనోవనమంతా విస్తరించిన వలపు కొమ్మలే
తీపిరాగాల కోయిలమ్మవై నువ్వు వాలాలని

14. ఉప్పొంగే ఆశల కెరటాలెన్నో
మనోసంద్రమంతా ఉప్పెనలై ఉరకలువేస్తూ

15. గుండెల్లో నీఊహల గాజుదీపం పగిలిపోయింది
జ్ఞాపకాల శకలాలను మాత్రమే మిగిల్చి

16. మది పసిమువ్వై నర్తిస్తోంది
నీ గారాల నయగారాలకు

17. మనోవనమంతా విరబూసిన పున్నాగలే
నీజ్ఞాపకాల పరిమళాలను వెదజల్లుతూ

18. మదిసౌధంలో నీజ్ఞాపకాల ముత్యాలెన్నో
ఆశల సరాలుగా అల్లుకుంటూ

19. కన్నీటి నావనై సాగిపోతున్నా
నీ జ్ఞాపకాల అలలపై

20. నీ జ్ఞాపకాల గమకాలెన్నో
నా గుండె వేగంతో పోటీగా తాళం వేస్తూ

21. నిశిరాతిరి వడిలో కునుకుతీస్తూనే ఉన్నా
నీ ఊసులెంతగా చిచ్చు పెడుతూన్నా

22. వసంతఋతువులో తరువులా
ప్రేమ చిగురులు తొడుగుతోంది మనోవనమంతా

23. నీచెక్కిలిపై చోటిస్తావా ఘడియైనా
కన్నీటి ముత్యాన్నై జారిపోతాను

24. మరణానికైనా అడ్డుచెప్పను
మరుజన్మలోనైనా మనసిస్తానని నువ్వు మాటిస్తే

25. స్వప్నమై మిగిలిపోతా
నీ కనుల మాటునే కొలువిస్తానంటే

26. నీతలపుల వాకిటనే కునుకు తీస్తున్నా
వలపుల తలుపులను తెరుస్తావనే ఆశతో

27. ఇంత మొండిది ఏమిటో నా మనస్సు
నన్ను కాదని నీకే వత్తాసు పలుకుతోంది

28. సిగ్గుల మొగ్గలు విచ్చుకుంటున్నాయి
చెక్కిలిపై నీఅధరపు సంతకాలకు

29. వలపులరేవులో ఊగిసలాడుతోంది ఊహలనావ
నీ జ్ఞాపకాల అల(ల )జడికి

30. అరవిరిసిన నీ నవ్వులనే అద్దుకుంటున్నాను
నా మనోకుసుమంపై , అనురాగపు పుప్పొడిగా

31. వలపుల ముత్యాలెన్నో జాలువారుతున్నాయి
నీచెక్కిలిని తాకిన తమకంతో

32. హృదికి సిరిమువ్వల నర్తనాలే
నీ ఊపిరివేణువు పలుకరిస్తుంటే

33. ఆశల దీపాలనే వెలిగిస్తున్నా
చిరుగాలులకారని జ్ఞాపకాల జ్యోతులుగా

34. మది కెరటం అలసి పోతోంది
నీఊహల ఘోషలమధ్య ఎగసి పడుతూ

35. మనస్సు మూగబోతోంది
నీ తలపుల తపోవనంలో తచ్చాడుతుంటే

36. రెప్పల మాటునే మేఘాలను నింపుకున్నాను
కన్నుల్ని నీకలల వర్షాలతో నింపుకోవాలని

37. కనురెప్పలు నిదురను మరచి కాపలాకాస్తున్నాయి
కలగా నువ్వు మరలి పోతున్నావనే

38. మౌనాలేవో పెదవి విప్పుతున్నాయి
మాటలు నేర్చిన కూనలమ్మలా

39. జ్ఞాపకాల బృందావనిలో విహరిస్తున్నా
మనోవేణువు ప్రణయరాగమే, ఆలపిస్తుంటే

40. నా కనుపాపలకు పరిచయిస్తున్నా
నీ చిరునవ్వుల వెన్నెలను

41. నే ఆశల హరివిల్లునే అల్లుకుంటున్నాను
చినుకువై నువ్వు మదిని తడిపేస్తుంటే

42. లతలు తెగ వయ్యారాలు పోతున్నాయందుకనో ?
కుసుమ కాంతలు తమను హత్తుకున్నాయనేమో !

43. నీనవ్వుల తివాచీని పరిచావా ?
పూలన్నీ మూతి ముడిచాయి.!

44. మదికి తడి తగిలేవరకు తెలియనేలేదు
నీజ్ఞాపకాల బిందువులు సింధువులై తాకాయని

45. నీనవ్వుల కాగడాను వెలిగించాను
నిశీధి నీడలను పారద్రోలుదామని

46. నీజ్ఞాపకాలకే నేనంటే మక్కువ
నీకంటే ఎక్కువగానే అంటిబెట్టుకున్నాయి

47. లాకులు తెరిచినా గంగ పొంగదే ?
రైతుల కన్నుల్లో వరదలై పోటెత్తుతూ

48. అప్పుడప్పుడూ నువ్వు నచ్చవెందుకనో?
ఎప్పుడూ నీపంతాన్నే నెగ్గించుకుంటుంటే..!

49. దుస్తులే భారమట నవతరానికి
ఆది మానవులే నయమనిపిస్తూ

50. భూమాతకెంత మురిపెమో
హరితాంకురాలు ...తన గుండెను చీలుస్తున్నా

51. ఓనమాలను దిద్దడం మొదలెట్టేసాను
నీకు ప్రేమలేఖ వ్రాసేద్దామని

52. ఎవరు గిచ్చారో? గగనాన్ని ప్రేమగా
గోరుముద్రనే నెలవంకగా... తురుముకుంది సిగపూవుగా!

53. కంటతడి పెడుతోంది కంటిపాప, నిదురను మరచి
నను వీడిపోతున్న నానీడవైన నిను చూసి

54. కాలమెంత గడుసరిదో కదా!
మన కోసం తానాగదు, తనతో రమ్మనీ పిలువదు

55. నే చిరునవ్వుగా మారింది
నీ పెదవులపై కొలువుండాలనే

56. మత్తకోకిలకు మరుపు ఎక్కువైనట్లుంది
మధుమాసానికి ముందే మైమరుస్తోంది

57. బిడియాన్నే పూర్తిగా వదిలేసింది నామనసు
నువ్వెంతగా గాయపరుస్తున్నా నిన్నే స్మరిస్తూ

58. ఈ జన్మకెంత ఆత్రమో
మరుజన్మలో నిన్ను ఎలా కలవాలనే ఆలోచనలలో మునుగుతూ

59. నాజాడనే మరిచింది వింతగా
నీ జాడలలోనే గుడ్డిగా నడుస్తున్న నా మనస్సు

60. హోయలొలుకుతోంది శ్రావణ మేఘం
చినుకుల జూకాలను(లోలకులను)పెట్టుకుని

61. నీ పరిచయంతోనే తెలిసింది
జ్ఞాపకాలకూ పరిమళం ఉంటుందని

62. కనుపాపలకు యెంత కలవరమో?
కనుమరుగైపోయే నీరూపాన్ని చూపాలని

63. వేపపూల వసంతం
నీతలపుల ఉగాదిలో

64. కంటి ప్రమిదల్లో...ఆశలవత్తులెన్నో!
కన్నీటి చమురులతోనే వెలిగిస్తూ

65. కలువ భామకెంత మురిపెమో
నెలరాజు కురిపించే వెన్నెల చినుకులు తలంబ్రాలై తాకుతుంటే

66. గరికపూలకు పులుముతున్నా
దోసిలిపట్టిన నీ దరహాసపు పరిమళాలను!

67. నా మౌనానికి బాషను నేర్పేళ్లావు
రోజంతా నీనామమే జపం చేస్తోంది

68. నా ఆత్మకి ప్రతిరూపం
నీ రూపంలో సంచరిస్తూ

69. నీమాటలెపుడూ కమ్మని గేయాలే
తీయని గాయాలనే చేస్తూ

70. రాలిపోయే పూలకెన్ని గాయాలో
కొమ్మను వీడే విషాదంలో

71. రాధమ్మ మనసెంత గాయపడిందో
కన్నయ్య అందరి (అందని)వాడు అవుతున్నందుకు

72. ఎన్ని గాయాలను మోసి ఉంటుందో వెన్నెలమ్మ
ప్రతి తారతో సరసాలాడే నెలరేడును తలచి

73. మారణాయుధమే నేనౌతా
ఆపదే నీకు గాయం చేస్తే

74. జ్ఞాపకాల శబ్దాలు
అంతరంగంపై శాశ్వత శిల్పాలను చెక్కుతూ

75. మది జోగుతోంది కలల లోకంలో
నీ మాటల మత్తుగుళికలను మింగి

76. ఋతువులు విడ్డూరంగా దారి తప్పాయి
వసంతాలన్నీ నీలోనికి...గ్రీష్మాలు నాలోనికి

77. స్వచ్ఛతల కొలనులో ఉన్నట్లుంటుంది
మల్లెలాంటి నీనవ్వులు చూస్తుంటే

78. విసురుతూనే ఉంటాడు వసంతుడు
ప్రతి తరువుపై వలపుశరాలు

79. భావాలకెన్ని పరిమళాలో
నా తలపుల ‘వన‘మాలివి నీవైతే

80. కరుగుతూనే ఉంది కాలం
హృదయాన్ని శిలగా మిగిల్చి

81. నీ జ్ఞాపకాలెపుడూ తీయనివే
మదిని చెరగనిగాయాలుగా మారుస్తున్నా

82. గాలికి ఆరని చిరుదీపాన్నే !
నీ గుండెగుడిలో వెలిగినంతవరకూ

83. మదిలో తారాదీపాలు...నీ నవ్వులు
హృదికి మలయమారుతాలు ...నీ ఊసులు

84. సప్తపదులు నీతో వేస్తున్నా
సప్తజన్మలకు వారధిగా నిలిచిపోవాలని

85. గుప్పెడంత గుండె అలసి సొమ్మసిల్లి పోతోంది
ఉప్పెనంత నీ ప్రేమ ప్రవాహాన్ని దాచుకోలేక

86. నేనౌనంటే నువ్వు కాదంటావు
అచ్చం నా మాట వినని నా మనసులా

87. ఎంత నేర్పరివో
గుండెలోని హాలాహలం చల్లార్చి మాటలతో అమృతాన్ని చిలికించేస్తూ

88. మనస్సు పరిమళిస్తోంది
వసంతునిలా వలపుల పల్లవులేవో  ఆలపిస్తుంటే

89. నీ నవ్వుల తివాచీ పరిచావా ?
అందరాని పాలపుంత చెంతచేరిందని భ్రమపడ్డా !

90. తనువుకే కాదు
మనస్సుకు అలుపేనంట...నీ జ్ఞాపకాల భారాన్ని మోసి

91. అక్షరాలన్నీ మెరిసే తారకలే
నీ పదాలను అల్లుకుంటే

92. కన్నీటితో తొణికింది మదికొలను
నను విడిచిన మరుక్షణమే

93. మనసూ మాటలు నేర్చింది
అధరాలపై దరహాసపులేఖలను లిఖిస్తూ

94. ఆశావిహంగాలు  ఎగిరిపోతున్నాయి
నీగుండెగూటిని చేరే దారి తెలియక

95. గుండె పగిలిన చప్పుడుకేమో
దుఃఖగీతమాలపిస్తూనే..దొర్లిపోతోంది కాలం

96. నిను చేరాలనే తపనతోనే
సెకనుకోసారి లెక్కిస్తున్న నిమిషాలెన్నో

97. నీ కలల ఆమని
మది అంచులలో వేలాడుతూ ఓ సుందర పూవని

98. ఎంతాశో నామదికి
నన్ను నేను నీలా ప్రేమించాలని

99. అంతరంగం విషాద జలసమాధే
ఊహల్లో నువ్వు కనబడకుంటే

100. గాయమై గుండెను కోస్తావెందుకు?
చితిలో కూడా నిను వీడనని బాసలే చేసినా!

101. నిజాలను వెలికి తీస్తూనే ఉన్నా
గత జ్ఞాపకాల తవ్వకాల నుండి

102. హృదయకుసుమం ముడుచుకుంటోంది సిగ్గులమొగ్గై
నీ చిగురుటాకుచూపుల మధ్యచిక్కి

103. స్వర్ణోదయమే కోటిదివ్వెల కాంతులతో
నువ్వు మేల్కొల్పు పాడుతుంటే

104. నీ ప్రేమ హస్తాన్ని చేజారనివ్వకు
పోగొట్టుకున్న నా హృదయం దొరికేవరకు

105. నీ తలపుల అస్త్రాలే
నా ప్రేమాంబులపొది నిండుగా

106. లేలేత ఊహలేవో తప్పటడుగులే వేస్తున్నాయి
గురితప్పని నీ చూపుల శరాలకు

107. జ్ఞాపకాల వంతెనలు నిర్మిస్తున్నా
సుడులుతిరిగే ఊహల సుడిగుండాలపై

108. పూలవాగులా పొంగే నీజ్ఞాపకాలు
మదికోనేటిలో విచ్చుకున్న కన్నెకలువలలా

109. చిలిపి ఊహలకెపుడూ పంతాలే
నీ జ్ఞాపకాలతో పోటీకిదిగుతూ

110. మనోకోయిల మూగబోయింది
వసంతమై నువ్వు వచ్చినా కూయడమేలేదు

111. కరి మబ్బు కన్నీళ్ళలో
ఆనంద భాష్పాలను వేరుచేయడమెలా?

112. మనసును అంతలా గారాం చెయ్యకు
మౌనంగానే మదికి అల్లరిని నేర్పేస్తుంది

113. నిరీక్షణకు ఇంత సంబరం దేనికో
ఎదురుచూపులతోనే నిన్ను ఎదలో నింపేసుకుంటూ

114. విరిజల్లులే!
వసంతం అరనవ్వు నవ్వితే చాలు

115. నా గుండె బరువెక్కింది
చేజారిన పసిజ్ఞాపకాలు తడుముతుంటే



**శ్రీనివాస్ ఆర్. వీ. ఎస్. ఎస్**
D 1/1 దూరదర్శన్ కాలనీ,
శ్యామలా హిల్స్, భోపాల్ - 462013
(మధ్య ప్రదేశ్)
కలం పేరు: "శ్రీ"
బిరుదు: "ఏకవాక్య కవితా విశారద"
వృత్తి: ఇంజినీర్
మొబైల్ నెంబర్: 919425012468
ఈ-మెయిల్: rvsssrinivas666@gmail.com
వెబ్: www.srikavitalu.blogspot.in

# శ్రీ అక్షర నక్షత్రాలు...

1. నీలోని శోకసాగరం పొంగింది
నాకంటిని ఉప్పెనలో ముంచేస్తూ

2 నాకోసం నింగి నుండి వచ్చేసావ్
పాపం! జాబిలిని ఒంటరిని చేసేసావట

3 మనసు పులకిస్తోంది.
నీ మౌనం నాతో భాషిస్తున్నందుకే

4 మూర్ఖుడు...దుఃఖం దాచుకోనేది కన్నీటి వరదలో
వివేకి...శోకాన్ని మూసేది చిరునవ్వుల ముసుగులో

5 చీకట్లో నిన్ను చూసాను
పున్నమనుకొని టపాసులు కాల్చడమాపేసాను

6 నీవు నాచెంతనుంటే తెలియని తిథి
అందరూ చీకటిమయం అనుకొనే అమావాస్య

7. నీ జ్ఞాపకాలు కదిలేవి కాదు
నీ రూపం చేరిగేది లేదు.

8. మన పేర్లు ఇసుకలో వ్రాసినా
జ్ఞాపకాలు మాత్రం దాచుకున్నవి మదిలోనే

9. చంద్రకాంతులు కనిపించడమే కాదు
వినిపిస్తాయి…నీ పాదాలనల్లుకొని!

10. కలం పడితే కవితయ్యేవరకు ఆపకు
కత్తి ఎత్తితే సంహరించేదాకా ఆగకు

11. అడుగులు చూసి వేయవూ?
పారిజాలకు కూడా ముళ్లుంటాయి

12. నీ ముక్కుకి ఎంత పొగరో?
అలక ముక్కెర అస్తమానూ సర్దుకుంటూ

13. ప్రత్యూషం పారిపోయింది నిన్ను చూసి
తొందరగా ఎందుకు వచ్చానా? అనుకుంటూ

14. నా కన్నులడుగుతున్నాయి నీ కళ్ళని
నాలాగే రాత్రంతా నిదురపోలేదా? అని

15. అక్షరాల లోయల్లో వెదుకుతున్నా
పదాల పువ్వుల కోసం

16. మాట గుండెను భేదిస్తే
మౌనం మనసును కోసేస్తుంది

17. నిన్ను చూసాకే అనుకున్నా
కంటికి తలుపులు ఎందుకని?

18. సూర్యుడంటే కోపం తొందరగా వచ్చేసాడని
చంద్రుడంటే కోపం త్వరగా వెళ్లిపోయాడని

19. నా కన్నీటికి అసూయ
నువ్వుండగా దరి చేరనీయవని

20. కొత్త హీరొయిన్ ఇంట్లో దొరికాయి అగ్గిపెట్టెలు
అందులో ఉన్నాయి వేల జతల బట్టలు

21. మొబైల్ జారిపడింది
ఇల్లంతా ముత్యాలే

22. విరితేనెలకు...అధరసుధల్తో పోటీ
పొట్టేలు కొండతో ఢీకొన్నట్లే!

23. గుడిలో దేవునికి చక్కరపొంగలి
మెట్లమీద బిచ్చగత్తెకు నేడు కూడా లేదు అంబలి

24. అమాసలో నీరేడు రాలేదనా?
సిగమల్లెలు ఆకాశాన విసిరేసావ్

25. సత్యభామ రియల్ ఎస్టేట్లో ప్రవేశం
తులసివనాల కొనుగోలుతో వ్యాపారం ప్రారంభం

26. కావాలని కళ్ళు మూసుకొనేదీ నువ్వే
తర్వాత నన్ను తుంటరనేదీ నువ్వే

27. నీ చెవిరింగులు ఎవరికీ ఇవ్వకు
నా గుసగుసలు బట్టబయలు చేయకు

28. కన్నీళ్ళతో నింపాను కొలనంతా
వచ్చావ్... స్నానమాడి వెళ్లిపోయావ్

29. మదనునికొక్కటే ధనువు
వేయి ధనువుల కొలువు నీతనువు

30. పున్నమొస్తే తరగలకెంత సంబరమో!
తీరాన్నెక్కువ అల్లరి పెట్టొచ్చని

31. నీవు దొరికాక ఆపేసాను
వేలుపుకై చేస్తున్న నా అన్వేషణని

32. నీవు లేవని తెలుసేమో!
వెండికొడవళ్ళతో భయపెడుతోందీ వెన్నెల

33. పూసే 'కొమ్మ'కే గోటిగిచ్చుళ్ళు
కాసే చెట్టుకే రాళ్ళదెబ్బలు

34. ఏ గిరుల మీద మనసు పడిందో !
నా సందేశం నీకింకా చేర్చలేదు మేఘం

35. 'నా తనువు'ను చూసుకున్నా సిగ్గే
అందులో 'నా' 'నువ్' ఉన్నావనేమో!

36. నీ ప్రేమగాలితో ఊపిరి పోసావా?
మదివేణువు నీ వేదం పలుకుతోంది

37. మిన్నాగు తలపై జాజుల మాలలు
నీలి అంబరాన మెరిసే తారాపథాలు

38. ప్రేమ తాకిడి... మంచుపువ్వు తాకినట్లు
వియోగపు అలికిడి... నిప్పుకణిక తగిలినట్లు

39. పాదాల కింద ప్రేమరేణువులు జారుతున్నాయి
ముంచేందుకు వియోగతరంగాలు కోరలు చాస్తున్నాయి

40. కరవాలం పుష్పించిన కొమ్మనే నరుకుతుంది
కవికులం ఫలించని ప్రేమనే లిఖిస్తుంది

41. రెప్ప మూయాలంటే నీకు చీకటౌతుందని భయం
కన్ను తెరవాలంటే నువ్వు వెళ్ళిపోతావనే సంశయం

42. సాగరానికి చెలియలికట్ట దాటడం కష్టమే
నీమదిని జయించడం నాకు అసాధ్యమే

43. నీ అందానికి కొలబద్ద నా దగ్గర లేదు
నా ప్రేమకి తులాభారం నువ్వు ఎప్పటికీ వేయలేవు

44. ఆశల కెరటం నింగికెగసింది
జీవనతీరం తాకకుండానే పతనమైంది

45. ప్రతీ స్వప్నం సత్యమే
మనసుకి మెలకువ వచ్చేదాకా

46. ప్రాణం నిలవదు నువ్వు కాదంటే
అవునన్నా పోతుందేమో...పట్టరాని సంతోషంతో

47. ప్రేమకావ్యానికి అక్షరాభ్యాసం చేయించావు
ఎందుకో ముందుమాటతోనే ఆపేసావు

48. ప్రేమ ఫలిస్తే పరవశంతో కన్ను మూత పడుతుంది
వలపు 'విష'మిస్తే ఆ దుఃఖంలో కన్ను మూసేస్తుంది

49. తాంబూలంలో సున్నం ఎక్కువైతే నాలుక మంట
జీవితంలో వలపు ఎక్కువైతే బ్రతుకు పంట

50. నిదరోతే కలలో కనిపిస్తావని ఆశ పడేవి కళ్ళు
కల కన(పడ)క మండేవి మదిలో విరహపు నెగళ్లు

51. నీ చెలిమి దినదిన క్షయం
నా వలపు అహరహం అక్షయం

52. ఆలయం కట్టాక విగ్రహ స్థాపన సాధారణం
దేవీప్రతిష్టతొ గుండె...గుడిగా మారటం అద్భుతం

53. నువ్వు నవ్వితే మదిలో మంచుకుసుమం రాలినట్లు
అలిగితే మనసువెన్నపై కొరకంచుతో మెత్తగా తాకినట్లు

54. అందాల జాబిల్లి మోముపై మచ్చలు
వెన్నెలమ్మ పెంచిందేమో వాడి గోళ్ళు

55. ప్రేమఊసుల్ని బిడియంగా వింటాయి లోలాకులు
గుండెగడియారంలో వలపు డోలనాలు చేస్తూ

56. ఎంతగా ప్రేమిస్తున్నానో నీకు ఎన్నటికీ తెలియదు
ఎందుకు ప్రేమిస్తున్నానో నాకు ఎప్పటికి అర్ధమవదు

57. భావమాలికలతో అలంకరిస్తున్నా నిన్ను
కనకానికి కరువు గానీ అక్షరాలకు కొదవ లేదుగా

58. ఊహాచిత్రాలు గీస్తూనే ఉంటాను అసంఖ్యాకంగా
అస్పష్టమైన నీరూపం స్పష్టమయ్యే దాకా

59. రెప్ప మూసిన క్షణం ఎదుట ఉన్నావనిపిస్తుంది
కన్ను తెరిచిన నిముషం వాస్తవం వెక్కిరిస్తుంటుంది

60. నేను ప్రవరాఖ్యుడినే
మనసు మార్చుకుంది నిన్ను చూసాకనే

61. నీతో గడిపిన తీయని క్షణాలివ్వు!
వియోగపు యుగాలని నిర్దయగా చంపనివ్వు

62. నీ వియోగం మధురమైన జ్ఞాపకాలను మెల్లగా మింగేస్తోంది
ఆకలిగొన్న అజగరం చిక్కిన లేడిని నిదానంగా కబళిస్తున్నట్లు

63. నువ్వు భాషిస్తే నా చెవులకి వినబడుతుంది
శ్వాసిస్తే నీలోని నా మనసుకి ఊపిరందుతుంది

64. రెండు మనస్సుల పెదవులు
ఇచ్చిపుచ్చుకుంటున్నాయి తీయగా మధువులు

65. రాధామాధవం చూసిందేమో!
బృందావనం దగ్గర మరీ సిగ్గు పడుతోంది యమున

66. 'ముత్యం' రాధమ్మ...'నీలం' క్రిష్ణయ్య
'రాధామాధవం' మాత్రం కంటికింపైన 'కెంపే'

67. ప్రేమగా చూడకు
పెదవి మాట సైతం మరచిపోతోంది

68. అపుడు సాగింది మనమధ్య ప్రణయప్రవాహం
ఇపుడు కదలనంటోంది ఘనీభవించిన జ్ఞాపకాలనదం

69. నీకై వేచి చూసిన క్షణాలు
కాలం గడియారంలో కదలని యుగాలు

70. మన జీవనగ్రంథం చాలా క్లిష్టమైనదే
గ్రాంథికంకంటే కష్టమైన నిన్నర్థం చేసుకోలేకట

71. నిశీధికి ధవళవర్ణం పూస్తుంది నీ మాటలవెన్నెల
కౌముదికే కవనం నేర్పిస్తుంది నీ సౌందర్యాలవెల్లువ

72. సూదంటురాయల్లే మనసును లాగేస్తావు
చూపులకత్తులతో మెత్తగా కోసేస్తూ

73. వేరు చేసే పనిలో 'వన'మాలి
పూలతోటలో నీవు నవ్వులు రువ్విపోయాక

74. కళ్ళల్లో వెన్నెలపాతాలు నీ జతలో
నిప్పుల ఉప్పెనలు నీ వియోగంలో

75. కళ్ళకెప్పుడూ కనబడేవి కల్లలే
రెప్పలమాటున దాగున్నవి సత్యాలే

76. నా రెండుకళ్ళకి వరమైన నీ సోయగం
ఇంద్రుని వేయికళ్ళకి సైతం దక్కని మహార్భాగ్యం

77. కన్నుకీ కన్నుకీ గమ్మత్తైన పోటీ
నిన్నెవరు ముందు చూస్తారో...అని

78. అన్నులమిన్న కన్నులు పన్నేవి వలపువలలు
కనుపాపలలో బంధిస్తూ... కదలనీయని పద్మవ్యూహాలు

79. మధురక్షణం వద్దే ఆగిపోనీ కాలాన్ని
మరో చేదుజ్ఞాపకం తలుపు తట్టకుండా

80. నిశిలో నిద్రిస్తోంది ప్రతి రేయి హాయిగా
మదిలో నీ జ్ఞాపకాలనెగళ్ళు అవిశ్రాంతంగా మండుతున్నా

81. తారలన్నీ మిలమిలలతో వేస్తాయి శశాంకునికి 'వల'
చందమామ దాగేది వయ్యారి వెన్నెలమ్మ కొంగుకా'వల'

82. నమ్ము'కొని' శిశిరంలో నీ కౌగిళ్ళనెగళ్ళని
విసిరేసాను ఉన్న అన్ని ఉన్నికంబళ్ళని

83. తీరంలా 'అల'జడితో నేను
సాగరకేంద్రంలా ప్రశాంతంగా నీవు

84. నీ చింతన మానలేని బలహీనత నాది
నాచింతని దూరం చేయలేని అసహాయత నీది

85. నిన్నటిదాకా గతమనిపించిన
శిశిరంనేడెందుకో వర్తమానమై భయపెడుతూ

86. నాకు దగ్గరౌతోంది మృత్యువు.
నీవు దూరమౌతున్న క్షణాలలో

87. ఇద్దరం ప్రేమిస్తున్నాం
నువ్వు నన్ను … నేను నీసంతోషాన్ని

88. నీసిగ్గుల్లో మందారాలు నాకిష్టం
బాగా తెలుసు నీ బొటనవేలు గీసే అర్ధచంద్రికలకర్ధం

89. వేయికళ్ళు లేవని చింతిస్తున్నా
రెంటిలోనే ప్రేమంతా నింపుకొని నీకోసం ప్రతిక్షణం నిరీక్షిస్తున్నా

90. తుమ్మెద రెక్కలపై సుమాలగుంపు వాలే వింతైన దృశ్యం
మల్లెలు నీ కొప్పెక్కినప్పుడు మాత్రమే కనబడే సోయగం

91. శిశిరాన్ని చీల్చేస్తూ వసంతం
నిరీక్షణానేత్రాలకి నీ సందర్శనం

92. వసంతుడు ఋతువంతా బిజీనే
ప్రతీ 'కొమ్మ' కొప్పులో రంగురంగుల పూలు ముడుస్తూ

93. కలల నిండా నీ తలపుల పరిమళాలు
కన్ను విప్పితే…తలగడ తడిసిన గుర్తులు

94. విలపించవు సుమాలు
'కొమ్మ' నుంచి తెంచినా…'కొమ్మ' కొప్పులో అమరితేట

95. మరుమల్లె మరీ మూతి తిప్పుతోంది
తన సోయగాన్ని నీతో పోల్చలేదని

96. ఊరించే మరీచికలే
అరచేతిలో నీవు చూపే స్వర్గాలు

97. రాజకీయ చ(చద)తురంగం
ఎవరికి పావులౌతున్నామో తెలియకుండా సామాన్యుడు

98. ఊహల పల్లకిలో ఊరిస్తూ నీవు
తలపుల సందిట్లో మైమరుస్తూ నేను

99. పరిమళాల పండుగే
నీ జ్ఞాపకాలు కూడా విరులైపోతే

100. నేను రోజూ కొలుస్తున్నా
మన మధ్య దూరాన్ని ఎన్నో కాంతి సంవత్సరాలలో

101. పూలకి దారంతోనే ఏకసూత్ర బంధనం
జ్ఞాపకాలు మదిని వేధించే కంటకనందనం

102. నీ(నా) కలలకి యవనికలా
మూసిన కనురెప్పల చీకటి

103. కన్నీళ్లు కూడా కన్నీళ్లు పెట్టుకుంటున్నాయి
జ్ఞాపకాలు గుండెల్లో గునపాల్లా దిగబడుతుంటే

104. జాణతనం అంటే నీదే...
కొంటెసైగలు నువ్వు చేస్తూ...నిందలు నాపై మోపుతూ

105. గరళం కూడా మధురమే
అది నీ వియోగప్రసాదమైతే

106. మన... మధురాలన్నీ ఒక్కటొక్కటిగా మరణం
వియోగ గరళాన్ని అయిష్టంగానే త్రాగుతూ

107. నీ నవ్వులీయవూ
పెదవిపై పేరుకున్న విషాదానికి పైపూతగా

108. రాత్రిబడిలో చంద్రుడే మేష్టారు
చుక్కల చక్కదనాన్ని కళ్ళజోడు సందు నుండి చూసేస్తూ

109. అందాన్నే హరివిల్లుగా చేస్తూ నీవు
అనుక్షణం లక్ష్యమైపోతున్న సంబరంలో నేను

110. కన్నుల్లో నీరూపం చేసే నృత్యాలు
చీకటి యవనికపై సిరివెన్నెల లాస్యాలు

111. రెప్పల చాటున దాగిన నీరూపం
వెన్నెల్లో సైతం తళుకులీనే తారాదీపం

112. నీవు ప్రాణప్రదమన్నది నేనైనా...
నాలో ప్రాణదీపమై అఖండకాంతులు వెదజల్లేది మాత్రం నీవే

113. నేనూ నిన్ను ప్రేమించడం మొదలెట్టేసా
నన్ను ప్రేమలో మిం(ముం)చావని తెలిసాక

114. గగనకుసుమమే జాబిల్లి
అందంలో...అందనితనంలో అచ్చం నీలా

115. జ్ఞాపకవనాలను పెంచుతున్నా...
బాధిస్తున్నా...వాటి నీడలోనే మం(ఉం)డిపోతూ



**శ్రీ వెంకటేష్ గ్రంథి**
డోర్ నెం.: 70-1A-2,
లేక్ వ్యూ కాలని, రమణయ్య పేట,
సర్పవరం జంక్షన్, కాకినాడ 533001
వృత్తి: సాఫ్ట్ వేర్ ఇంజనీర్
మొబైల్ నెం: 099597 60365
ఈ-మెయిల్: venkatesh.nikith@gmail.com

# శ్రీ మనసులో...

1) నువ్వు మిన్నువి,నేను మన్నుని
అసాధ్యమని తెలిసినా ఆలింగనంకై ఎదురుచూస్తూ

2) నువ్వు రోజావే
నీ మాటల్నే ముల్లులుగా మార్చుకుని

3) రాజకీయాల్లో షరా మాములే
కలవాల్సినప్పుడు పొత్తు పెట్టుకుని, కలహాలొస్తే జుత్తుజుత్తు పట్టుకోవడం

4) నా విలువ "సున్నా"నే
నువ్వు నాతో "ఒకట"య్యేంతవరకు

5) ఆవేశంలో తీసుకునే నిర్ణయం ప్రాణంతీసే ఆల్కహాల్ వంటిది,
ఆలోచించి తీసుకునే నిర్ణయం ప్రాణంపోసే ఆక్సిజన్ వంటిది

6) నేను మళ్ళీ పుట్టా నీ ప్రేమలో కొత్తగా
కాని ఈ జన్మకి ఆయువు ఎన్ని రోజులో?

7) వయసు వేగాన్ని పెంచుతూ
నడక వేగాన్ని తగ్గిస్తూ "కాలం" ఆడే ఆట

8) నీలో కలిగే అణువంత భయం
నువ్వు అధిరోహించబోయే ఎత్తుకు అవరోధం

9) నేటి మీద రేపు బాగుంటుందనే ఆశ
నిన్నటి మీద నేడు బాగుందనే సంతృప్తి

10) టెక్నాలజీ...
విజ్ఞానాన్ని,విభేధాల్ని రెండూ పెంచుతూ

11) కాలమనే బడిలో
జీవితం జీతం అడగని గురువు

12) నమ్మకాన్ని హతమార్చింది
విషం వేసుకున్న అబద్ధమనే వేషం

13) మనిషికి ఉండొచ్చు గర్వం
చెడగొట్టనంత వరకు మనగౌరవం

14) ముఖస్తుతి కరువయ్యిందట
ముభావంగా ఉన్నాడు

15) ఆకలి ఖరీదు
ఈకలికాలాన చుక్కలలో

16) వ్యర్థంలో కూడా
అర్థం ఉంటుంది వెతికే మనసుంటే

17) నా ఊహాసుందరి
నా ఊహల్లో మాత్రమే సుందరి

18) నా ఎదకి ఎక్స్‌పైరీ డేట్
నువ్వు ప్రేమకి పేకప్ చెప్పినప్పుడే

19) రోగులమే అందరం,
రంగులలో బ్రతికేస్తున్నామంతే

20) గుండెవేగం రెట్టింపయ్యింది
తన గొంతులో నాపేరు పలుకగానే

21) ఆరు పలకల దేహం
తినకపోవడం వల్ల కాదు తినడానికి లేకపోవడం వల్ల

22) పట్నం చీర కట్టింది
పల్లె ఆ చీర కట్టుకు సిగ్గు పడింది

23) నాగుండెచెక్కపై చెక్కా నీపేరు
నామనసును మేకులా మార్చి ప్రేమను సమ్మెటలా చేసి

24) ప్రకృతి స్వయంపాకానికి పూనుకున్న వేళ
పుట్టుకొచ్చిన సహజసిద్ధ అమృతానివి నువ్వు

25) అడవిలో లేడి పిల్ల
అడవి బయట ఆడపిల్ల

26) పోలికేలేని కవలలు
కష్టం, సుఖం

27) దరిద్రం దండోరా వేస్తే
దాహానికి  దానిమ్మ జ్యూసు కూడా దొరకదు, దారుణంగా

28) చెప్పే మాటలు అర్ధమవ్వాలి
చేసే పనిలో అర్ధముండాలి

29) నన్ను పాలిస్తున్నావుగా
నా మనసును ఆక్రమించి, నా నుంచి విభజించి..

30) శారీరకదెబ్బతో కన్నీటి అనుబంధం కొన్నాళ్ళే
మానసికదెబ్బతో వీటి చుట్టరికం బ్రతికున్నన్నాళ్ళు

31) చుక్కలడిగింది నాచెలి
తన చెక్కిల్లపై మెరుపులుగా అద్దడానికట

32) ప్రేమించింది నీ గతాన్ని కాదు
నీ జతలో నా భవిష్యత్తుని

33) నీ రాకతో వేల కోట్ల విద్యుత్కాంతులు
నీ పోకతో ఒక్క క్రొవొత్తిరాల్చిన కన్నీటిచుక్కలు

34) అదృష్టం అవకాశవాది
కృషి ఆత్మీయవాది.

35) నీ అదరామృతాన్ని అపహరించా
నాలో మరణించిన సరసుడికి సంజీవని కావాలి మరి

36) నా కలం కదలికకి ప్రేరణ నువ్వు
నా కాలం కదులటకి కారణం నువ్వు

37) ఏవో మాయలు తెలుసు మా అమ్మకి
నాకే తెలియని నా ఆకలిని పసిగడుతుంది

38) నేను స్నేహమనే విత్తునే వేసా నీమదిలో
నువ్విప్పుడు ప్రేమనే మహావృక్షంలో నాకు నీడనిస్తున్నావు

39) మనిద్దరి మాటలే సమాంతరాలు
మనసులకు లేవు అంతరాలు

40) నా ప్రేమ
నేను నీకిచ్చిన మొదటి బహుమతి

41) ఎగసే కెరటం లాంటిది వయసు
తీరం చేరేకొద్దీ వేగం తగ్గుతూ

42) విచిత్రం
నడవలేని గడియారంలో, పరుగులెత్తే కాలం

43) తన పొడిపొడి మాటలు
నా చెంపలకు తడి స్పర్శను పరిచయం చేసాయ్

44) నీ అలక మామిడి పులుపు,
నీ కులుకు చెరుకుగడ తీపి

45) చలి తాకిడికి చర్మం చల్లబడితే
చెలి తాకిడి తగిలి వెచ్చబడింది

46) నే నిద్రపోతే నీకెవరు కాపలా అనుకున్న
నేనిక్కడ భద్రమే అంటూ కలవై వచ్చావుగా

47) నాసిగ్గు రూపం లేని ముగ్గైతే
నీపై నాఇష్టం ఆకాశమంత రంగవల్లి

48) ప్రేమ ముడుపు తెచ్చా
నీ హృదయపు హుండి తలుపు తెరువవా జారవిడుస్తా

49) నాబుడిబుడి అడుగులు
బహుకాలానికి పలకరించిన అమ్మ ఆనందభాష్పాలు

50) చూస్తావా నీటిపై అక్షరం
ఇదిగో నా గుండె సంద్రంపై నీ నామం

51) నా ప్రేమకు కొలబద్దా?
అయితే గగనపు చుట్టుకొలతను కొలువుటలో పెట్టు శ్రద్ధ....

52) మొదట మరుపవ్వవా
తరువాత జ్ఞాపకమవుదువుగాని

53) అమ్మా... నీ దెబ్బల వల్లనే
నా వీపును నేను అందుకోగలిగాను

54) మనసు విరిగింది
ప్రతి ముక్కలోను నీ నవ్వులే

55) నీ ఇష్టం అంతరంగిక ప్రశంస
నీ కొపం బహిరంగ విమర్శ




**సుకన్య బీగుడెం**
హౌస్.నెం: 19-1-586,
దూద్ బౌలి, మహారాజ్ గంజ్,
కామాటిపుర, బహదూర్‌పుర,
హైదరాబాదు - 500 064
కలం పేరు: సుకన్య
వృతి: అకౌంటెంట్
మొబైల్ నెం: 9948187064
ఈ-మెయిల్: sukanya.baby71@gmail.com
వెబ్: facebook.com/ooheoopirimanasepandiri


# సుకన్య భావసుమాలు...

1) ఊహా తరంగాలకు అడ్డేముంది?
మనసే తీరం అయినప్పుడు !

2) సుమాలమే
ముఖపుస్తక వనంలో భావాలు పంచుకొంటూ

3) తారాజువ్వలమే
ప్రేమసామ్రాజ్యంలోకి దూసుకుపోతూ

4) సుకుమారినే
మల్లెలతో తాకినా కందిపోతూ

5) ఉడికించి ఊరించడం గోపాలునివంతు
భక్తిపరవశంలో మునగడం గోపికలవంతు

6) మనసును అంతలా గారాం చెయ్యకు
వలపులో చిలిపి సరాగాలు కావాలంటుంది

7) మనసు లేడైతే వయసు ఉరకలేస్తుంది
కోరికలకు కళ్ళెమేస్తే ధనం పొదుపౌతుంది

8) అక్షరం నాదే
భావావేశం నువ్వే

9) నా గుండె బరువెక్కింది
తల్లికి పుట్టేది ఆడపిల్లనిని గర్భంలోనే సమాధి చేసేస్తే

10) మౌనం నీ అంగీకారాన్ని తెల్పింది
నా మనసుని తేలిక పరుస్తూ

11) నీ మౌనం
నిశిలో దాగిన వెన్నెలలా నా ప్రేమను దాచుకుంది

12) పుష్పమైన వికసించని మొగ్గే
బిడ్డ యెంత యెదిగిన కన్న ప్రేగు ప్రేమకు

13) కాలాన్ని ముద్దాడాలి అనిపిస్తుంది
నిన్ను పరిచయం చేసినందుకు

14) కాలం గమనాన్ని తగ్గించవూ
మనం కలిసే సమయంలో

15) ఏగాలం వేసావో కలానికి
చిత్రంగా చిక్కుతున్నాయి భావకవనాలన్నీ

16) మొట్టినా సమ్మతమే
అందులో నీప్రేమే ఉందిగా నిండుగా

17) నిజం చెబుతావా నిన్నొకటి అడుగుతున్నా
పెళ్లయ్యాక నామాటే వింటావు కదా!

18) మనిషిలో మంచితనం
కాలంలో కాలి బూడిద అయ్యింది

19) ప్రతి నిముషం గుర్తుకొస్తావు
నేను బ్రతికున్నందుకు సాక్షిగా

20) మల్లెలు కురులలో చేరినప్పుడే
పరవశాల పరిమళములు మగువలకు

21) అమ్మ ప్రేమామృతంతో
ప్రేమ జగతిలో సజీవులమే ఎప్పటికీ

22) కౌగిలింతల స్వప్నాలు
కరిగిపోవు మనసుల పెనవేతల మధురిమలో

23) ఎడబాటుకు చోటేలేదు
ముడిపడిన మమతానురాగాల మనసుల కలయికలో

24) పెదవులకు సింగారం నీ చిరునవ్వులు
వీనులకు విందులు ఆ సవ్వడులు

25) నా మనసు సరిగమలంటుంది
చెవిలో చేసిన నీగుసగుసలకు

26) అమాయకంగా సిగ్గుల మొగ్గ అంటావే?
ఓరకంట వలపు శరాలు గుచ్చి !

27) అమ్మానాన్నల జ్ఞాపకాలు
మాటలకు అందనివి...అక్షరాల్లో ఒదగనివి

28) కాలం జాడలేకుండా పోయింది
నీముద్దు మురిపాల మునిగాక

29) అక్షరాల భావానికి ముద్దివ్వాలి
నీ మదిని తాకినందుకు

30) నా మౌనాన్ని అర్థం చేసుకోలేని నువ్వు
నా మాటలని ఎలా అర్థం చేసుకోగలవు?

31) పాత రోత్తైపోయింది
కొత్తకి కొమ్ములొచ్చాక

32) నీ అంతరాత్మని అడిగిచూడు ఒక్కసారి
మన జ్ఞాపకాల తుంపరలు తడుపుతాయి

33) మనుసు ఉలితో పదిలంగా చెక్కా
మదికోవెలలో ఆరాధ్య దేవతవే అయ్యావు!

34) మునిపంటిని నొక్కి మౌనంగా భరించకు
ఆది శక్తివై దుష్టులను చెండాడు

35) ప్రేమికుడవే...
ప్రేమ మకరందానికి తూనీగవై భ్రమణాలుచేస్తూ...



**సురేష్ బాబు రావి**
ఫ్లాట్ నెం.205, శ్రీ శ్రీనివాస విహార్,
రుక్మిణిపురి కాలనీ,
డా॥ ఎ.ఎస్.రావు నగర్,
హైదరాబాద్-500 062.
కలం పేరు: స్నేహితుడు
వృత్తి: మెకానికల్ డిజైనర్
మొబైల్ నెం. 9959864000
ఈ-మెయిల్: ravisureshbabu@gmail.com
వెబ్: www.facebook.com/snehitudu.suresh

# స్నేహాక్షర మాలికలు...

1. మాయదారి మనస్సు కదా
మనోమందిరాన్ని మయసభని చేసేసింది

2. మదిని మీటిన కమ్మని జ్ఞాపకం
ఎదపై చేసెను వెన్నెల సంతకం

3. మనిషిలో రాతి గుండె ఉండగా
రాతిలో దేవుడు మిథ్య కాదుగా

4. ఎదురుగా ఉంది ముళ్ళబాటే అయినా
గమ్యమెంతసేపు...? అడుగులు ఉక్కు పాదాలవైతే

5. కలలసేద్యం చేద్దామనుకుంటున్నా
నీ చిత్తరువుల విత్తనాలు పంపించవా?

6. నా కలలలోగిలి లోకి తొంగిచూడు నేస్తం
అక్కడఉన్న నీ రూపాన్ని మాత్రం దొంగిలించకు

7. ఎప్పుడూ జ్ఞాపకాల దుప్పటిలో పవళించటమేనా
వెన్నలశిల్పమై ఎదురుగా ఉన్నా... భాషించవూ

8. నాపెదవులు పృథ్విని తాకుతున్నాయి
నువ్వేసిన పాదముద్రలను స్పృశించటానికి

9. నిదుర నదిలో
ఎదురుపడే కలల నావలన్నిటిలో నీవే

10. మౌనం దుప్పట్లో నువ్వు దాచిన మాటల పరిమళం
నా మనసు పొరల్ని మీటుతుంది మృదు మధురంగా

11. నా జ్ఞాపకాల పొత్తిళ్ళలో పవళించిన పసిపాప
అలసిపోయిన ఒత్తిళ్ళలో నీవో వెన్నెల రేఖ

12. ఏకాంతం నా నేస్తం అయినప్పుడు
నన్ను కమ్ముకునే జ్ఞాపకం నానువ్వే

13. మది కాంచే కలలన్నీ నిజాలై నను తడిమితే
ఆ స్పర్శతో మారనా నేనో నిశ్శబ్దపు శిలలా

14. నా నిద్రలోన నిద్రపోని తలపుల ఘోష నువ్వు
నా కలమింకా రాయని భావాల భాష నీనవ్వు

15. నాహృదయం బకాసురుని అంశ అనుకుంటా
రోజంతా నీతలపుల విందే కావాలంటా

16. సడి చెయ్యవేమి నీ తలపులు
మది వడి చేరాక కూడా

17. ఈ క్షణపు ఓటమే మరుక్షణపు గెలుపేమో
ఈ నిమిషపు గెలుపే జీవితాన మలుపేమో

18. నీ మేని చిరుచెమట చుక్క
నా నాలుకకి అమృతపు బిందువేగా

19. మనిషికీ మనసుకీ మల్లయుద్ధమట
మనిషి తనువు కోసం మనసు తలపు కోసం

20. జీవాత్మవే
ఏకాత్మవై నాలో ఇంకిపోతూ

21. విశ్వకర్మనే
వేవేల ప్రేమసౌధాలు తలపుల్లో నిర్మిస్తూ

22. మధుర జ్ఞాపకాలు మనసును తాకుతున్నాయ్
మదిభాండాగారంలో ఒడిసి పట్టాలని ఆశగాఉంది

23. కాంతితీరాన ఆవిరవుతున్న తిమిరంలా
నీ మాటల ప్రవాహంలో కరిగిపోతుంది నా మౌనం

24. నిన్నే ఊహగా నాలో వంపుకున్నా
నువ్వే శిల్పిగా నన్నే చెక్కుకున్నా..

25. నన్ను నేను కోల్పోతూ ఉన్నా
నాలో నువ్వు ఇంకిపోవాలని

26. అలకల్లో ఆవిరైన మాటలకి
ఊపిరిలూదే మంత్రం 'మౌనం'

27. మౌనం దుప్పట్లో మాటలు దాచేసా
కనురెప్పల సవ్వడితో నీమనసే వింటున్నా

28. నాలో నీ ఉద్భవాన్ని అవలోకిస్తున్నా
నీలో నే ప్రభవించాలని ఆరాటపడుతున్న

29. నిన్నలో కలిసిపోయిన నేను
నీజ్ఞాపకాల్లో రేపటికీ పదిలమేగా

30. నిలకడగా ఉండదు నీ నీడైనా నీతో
నీ ప్రతి ఉనికిలోనూ తోడుగా నేను

31. నీతలపులని తాగేస్తున్న అక్షరాలు
ఒలికిపోతున్నాయి చరిత్ర పుటల్లోకి

32. ఈ లోకం
బతుకున్న శవాల రంగుల రాట్నం

33. అప్పుడప్పుడూ అంతే
నవ్వులు ఏడిపిస్తాయి ఏడ్పులు నవ్విస్తాయి

34. నిదురన్నది నను చేరనంటున్నది
రెప్పవాల్చితే నీరూపు కరుగుతుందని

35. నా అద్దంలో నీ రూపం
మరి నన్ను నేనెక్కడ చూడాలి?

36. నాలో నేను మోడువారిపోయా
నీలో చిగురించానేమో చూడు

37. ఆ క్షణం వారు చిన్న పిల్లలే
తమని తాము మరచిపోయే క్షణాలు కావాలంతే

38. నాక్కొంచం వెన్నెల కావాలి
నువ్వోసారి ఇటు తొంగిచూడు

39. నా జీవితకాలాన్ని అద్దెగా చెల్లిస్తా
కాస్త నీ హృదయంలో చోటియ్యవూ

40. నడకే రాదనుకున్నా నా మనసుకి
పరుగే పెడుతుందేమిలా నీ మనసుకై

41. మలిక్షణం ఎప్పుడూ కొత్త కాల పరిచయమే
కొత్త క్షణమెప్పుడూ ఆశను నిలిపే జీవమే

42. కావ్యం రాయడానికి ఆలోచనలు కావాలా?
కాలపు జ్ఞాపకాల సమీరాలు చాలవూ

43. నిన్నేగా నిన్ను చూశా
నేటికల్లా నా జీవితమయ్యావే!

44. ఎప్పుడూ భ్రమల్లోకేనా ప్రయాణం
దాటిచూడు తెలుస్తుంది జీవితం

45. లెక్కల పుస్తకం కాదుగా జీవితం
లాభనష్టాల బేరీజుతో సహాయం చెయ్యటానికి

46. నాకు నేనే బహుమతినయ్యా
నువ్వు నాలోకి ఇంకిపోయాక

47. నిన్నలోనే ఒదిగిపోతావెందుకు?
నేడుకూడా నీదేలే రా ముందుకు

48. అక్షరం చిన్నబోతుంది
ఆదర్శం అంతా తనలోనేనా అని

49. నా నిన్నలో నుండి నువ్వు జారిపోరాదూ
నేడు నీ జ్ఞాపకాల పుట లేకుండేది

50. రెప్పమాటునే తారాడుతానంటే ఎలా
లోకానికీ పరిచయమవ్వు ఒకసారి

51. విజేతల హస్తాలతో రాసిన చరిత్రలో
పరాజితుల వాదనలకు వేదనలకు చోటెక్కడ?

52. క్షణం విలువెప్పుడూ క్షణమే
నిన్ను కలిసిన తొలిక్షణం విలువ మాత్రం నాజీవితం

53. కాలపురుషుడు ఎంత నిర్దయుడు
క్షణానికో క్షణాన్ని చంపేస్తూ

54. కాలాన్ని అభిషేకిస్తున్నా
ప్రతి క్షణమూ చెలి ఊసుని తోడుగా తెమ్మని

55. నీ నిశ్శబ్దం నను తాకిన క్షణమే
నా శబ్దం ఆవిరయ్యింది... నిను చదవటానికి



**స్వర్ణలతా నాయుడు సోమిశెట్టి**
హౌస్.నెం: 71, సెక్టర్ 61,
"D" బ్లాక్, నోయిడా,
ఉత్తరప్రదేశ్ - 201305
కలంపేరు : శ్రీస్వర్ణ
మొబైల్: 09958960068
ఈ-మెయిల్: chittifbd@gmail.com

# శ్రీ స్వర్ణ మాలికలు...

1. నా కలలకి దీర్ఘాయుష్షు పోసివెళ్ళావు
   నీ జ్ఞాపకాలతో చెలిమి చేయమని

2. గడ్డిపరకల కౌగిట్లో తుషారకన్య
   విడదీయడానికొచ్చిన భానుడు...అసూయతో

3. అవని పులకరిస్తోంది
   మేఘుడు పంపిన నీటిశాలువాని కప్పుకుని

4. నిలువెల్లా నీ ప్రేమలో తడుస్తున్నా
   నీ తలపుల తేనెజలపాతాలలో మునిగిపోతున్నా

5. మేఘం పులకిస్తే స్వాతిచినుకులు
   మనసు తడిస్తే వలపుచివుర్లు

6. రెప్పల తాళపత్రంపై లిఖించు
నీ అధరలేఖినితో మనప్రణయకావ్యాన్ని

7. అబద్దాలతో నిజాల చెలిమి
నేటి ఆధునిక సమాజంలో

8. నిలువెల్లా నీప్రేమలో తడుస్తున్నా
నీ వలపుగంధాలలో మైమరిచిపోతున్నా

9. నువ్వు ప్రేమగా పిలిచి చూడు
శతకోటిస్వరాలతో పలికిస్తా నా మానసవీణను

10. శిశిరంలోనూ వసంతమే
నీ సహచర్యంలో

11. నా గుండె కోమాలోకి వెళ్ళింది
నీ మధురమైన మాటలు వినీవినీ

12. గుండెలో గుజ్జెనగూళ్ళు కడుతున్నా
మన వలపులని పండించుకోడానికి

13. గుండెలో గుచ్చుకున్న చూపుల బాణం
శ్రీకారం చుట్టింది జీవన ప్రణయానికి

14. మధుర జ్ఞాపకాలు మనసును తాకుతున్నాయ్
మౌనపు సుమాలు పుప్పొడిని రాలుస్తున్నాయి

15. ఎదలో మోహనరాగాలు
అధరాలపై మౌనలేఖలు

16. ముద్దులఅల్లరి ఎక్కువైంది
అచ్చు నీలాగే కొంటెకబుర్లే చెప్తున్నాయి

17. పాలరాతి శిల్పానికి అసూయ
నీ నునుపు తనకులేదని

18. కరిగే వెన్నెల శిల్పాన్నే
నీ కొంటె చూపులకి

19. జ్ఞాపకాల పుస్తకం తెరిచి చూసా
నవ్వింది కొంటెగా ...నీ అల్లరిపుట

20. మధురభాషిణివే
చిలుకలకు ముద్దుగా పలుకులు నేర్పుతూ

21. నా శ్వాసకి సిగ్గేస్తోంది
నీ ఊపిరిలో కలిసాక

22. నీ కంటిపాపనన్నావ్
'పాప'లచుట్టు తిరుగుతావేం?

23. కలంతో సేద్యం చేస్తున్నా
కవనం బాగా పండించాలని!

24. నవనీతం శిలగా మారింది
కరిగి మైనపుముద్దలా ఎప్పుడవుతుందో

25. నిత్యం స్వప్నాల కౌగిళ్ళతో సహజీవనం
నేడు వీడ్కోలు...నీ రాకవల్ల

26. మాటలు రాని మూగదాన్నంటావు
మౌనంగా మంచుకత్తితో కోస్తావు

27. మంచు వెన్నెల్లో తడిసిన కలువలు
తమకంతో శశాంకునిపై విసిరే మన్మధబాణాలు

28. కాలం వెలివేసింది నీ కలల్ని
నిర్దాక్షిణ్యంగా నా ప్రేమను కాలరాసావని

29. అర్ధభాగం ఇచ్చానన్నావ్
అన్నిట్లోనూ నీదే పై చేయంటావ్

30. సరసాలసంద్రం చిన్నబోయింది
మమతల అలలు కినుక వహించాయని

31. నీవు నవ్విన ప్రతిసారీ
నవరత్నాల నవ్యకాంతుల పులకింతలు

32. నా గుండెకు స్వాంతన
నీ వలపుగాంధలతో లేపనంపూస్తే

33. నీ బుంగమూతి విరుపులు
నామదిలో కోహినూర్ వజ్రాలమెరుపులే

34. కన్నుల మాటున దాగిన కోరికలు
ఎదను ఆశ్రయించాయి హత్తుకుంటావేమోనని ఆశగా

35. నీస్వరానికి సంపెంగలు
నీ నడకకి నాగమల్లియలు దాసోహమే



**విశ్వనాథ్ గౌడ్ ఈడిగ**
అగవేలి పోస్ట్, కృష్ణగిరి మండల్
కర్నూల్ జిల్లా - 518225
వృత్తి: ఎకౌంటెంట్
మొబైల్ నెం. 9885761467
ఈ-మెయిల్:
edigaviswanath@gmail.com

# విశ్వనాదాలు...

1. నేను తమకాలతో గమకాలు పాడుతున్నా
నువ్వు శృంగార వీణ మీటుతుంటే

2. కనురెప్పలు మూసి నీధ్యానం
కనుల ముందు సాక్షాత్కరిస్తావేమోనని

3. నా కనుల ముందు నీ రూపం
ప్రేమ తపస్సు ఫలించి నీ సాక్షాత్కారం

4. చితిమంట వెలుగుతుంది నాగుండెల్లో
చిరుబురులాడుతూ చిరాకుగా నీవెళ్ళిపోతే

5. దొంగల్లే దూరావుగా
దొరసాని మూసిన కనురెప్పల దొంతరలోకి

6. నా ఎదురుచూపులను పంపించా
నువ్వెక్కడైనా ఎదురవుతావేమో వెతకమని

7. ప్రతినిత్యం ప్రేమాభిషేకమే
నాగుండె గుడిలో కోలువైన దేవతకి

8. రైలుకూత నాగుండెలో
నువ్వొస్తున్నావని తెలియజేస్తూ

9. విరహాగ్ని చల్లబడింది
నీమనసు మంచుకొండలో

10. విక్రమార్కుడినయ్యా
నీ జ్ఞాపకాల శవాన్ని మోస్తూ

11. వేటగాడినే
నీచూపులను వెంటాడుతూ

12. చిత్రకారుడినే
ఊహల్లో నీ రూపు చిత్రిస్తూ

13. సతమతమవుతూ సంస్కృతి
నాగరికం పేరుతో నాశనం అవుతుంటే

14. నీకోసం సంస్కృతం నేర్చుకుంటున్నా
దేవతలు ఆభాషే మాట్లడతారటగా

15. మా పల్లె పాడుబడింది
పట్నం పద్ధతులకు పట్టంకడుతూ

16. గర్భం నుండే మొదలు ఆడపిల్లకు
చావు, బ్రతుకుల సుదీర్ఘ పోరాటం

17. ప్రతిరోజు వసంతమే వాలుజడకి
రోజుకోరకం పువ్వు విరబూస్తుంది

18. నామనసుకు ప్రేమతో కూడికలే వచ్చు
ద్వేషంతో తీసివేతలు ఇంకా నేర్చుకోలేదు

19. చోద్యం చూస్తావే...
కుదుటగా ఉన్న మనసుని కుదిపేసి

20. చీకటిది విజయగర్వం
తారకలను, వెన్నెలను వెలుగులోకి తెచ్చానని

21. మౌనరాగం ఆలపిస్తున్నా
నీ మది వీణలో సరిగమలు పలికించడం తెలియక

22. మౌనం రాజ్యమేలుతోంది
అలసిన ప్రపంచాన్ని చీకటి నిద్రపుచ్చాక

23. సంద్రపు అలదీ నీది ఒకేరీతి
చెంత చేరినట్లే చేరి వెనక్కెళ్ళిపోతారు

24. కన్నీళ్ళు కారిపోతున్నాయి
కంటికుండకి చిల్లు ఎవరు పెట్టారో

25. నింగి...నేలతో కరచాలనం
వానచినుకుల చేయి అందిస్తూ

26. మనసు ప్రమేయం లేకుండా మనిషి ప్రయాణం
మానవత్వపు శిఖరం నుండి మృగత్వపు అగాధంలోకి

27. నాట్య మయూరివే
నాపై కోపం వచ్చినప్పుడల్లా చిందేస్తూ

28. రాయి, రాయి దగ్గరైతే అగ్ని
నువ్వు, నేను దూరమైతే విరహాగ్ని

29. భూమి విశాలమైనదే
నాది, నీదంటు కంచెలు వేస్తారంతే

30. జాతరేదో జరుపుకుంటోంది నామది
నీ జ్ఞాపకాలన్నీ పోగేసుకుని

31. మదిమూత తీయవూ
ప్రేమరసం నింపాలి

32. వెన్నెల మైదానమైంది
మన రాసక్రీడలకు

33. తీరం కనపడదే
నీజ్ఞాపకాల నావలో ఎంత పయనించినా.

34. జడివానవే నువ్వు
ఎడతెరిపి లేకుండా నీతలపులు కురిపిస్తూ

35. నా గుండె వేగంగా కొట్టుకుంటోంది
నువ్వేమైనా మది తలుపు తట్టావా?

36. ఆటలో మేటినే
నన్ను ఓడి నిన్ను గెలిచానుగా

37. సూరీడు తాంబూలం వేసుకుంటాడా?
అంత ఎర్రగా పండిపోయాడు

38. మనం వేసిన అడుగు అడుగును అడుగు...
అడుగడుగుకో అర్థం చెబుతాయి ఏడడుగులంటే ఏంటో

39. పూలన్ని పోటీపడి పరిమళిస్తున్నాయి...
నీ సిగలో నిలిచే అదృష్టం ముందెవరికి దక్కుతుందంటూ

40. నామనసు గోడ రంగు వెలిసింది...
నీప్రేమని పూసి వర్ణశోభితం చేస్తావా?

41. కొండాకోనలకు ప్రతిధ్వనించడం నేర్పిస్తున్నా
నీ పేరుతో మొదలుపెట్టి!

42. విత్తు విప్లవాల బాటపట్టింది
భూమిలో పాతేస్తే పొరలు చీల్చుకుని మరీ బయటకువస్తూ

43. గతాన్ని జ్ఞాపకాల గునపంతో తవ్వుతున్నా
నీ గుర్తుల గుప్తనిధులేమైనా దొరుకుతాయేమోనని

44. వాడిన వలపుతీగ చిగురు తొడిగింది
నువ్వు ప్రేమధారలతో నామనసును తడుపుతుంటే

45. రాత్రంతా మోహానికి అబద్ధపు నవ్వుల రంగేసుకున్నా
తెల్లారగానే జీవితనాటకం మళ్ళీ నవ్వుతూ మొదలుపెట్టాలని

46. నీకంటే నీఊహలే నయం
నానుండి ఎన్నటికి విడిపోవు

47. తారలు చీకటింటికి తోరణాలు కడుతున్నవి
ఆకాశానికి పండుగొచ్చిందని నిండుపున్నమి రాకతో

48. నిజంగా వికటకవివే నువ్వు
ఇరకాటంలో కూడా వెటకారం జోడించి సమస్యను సాధిస్తావు

49. పిడుగుల దాటికి మబ్బులకు గాయాలయ్యాయి
చూడు శ్వేతరుధిరాన్ని ఎలా కారుస్తున్నాయో

50. వడ్రంగిపిట్టలా మనసును తొలుస్తున్నా
నీజ్ఞాపకాలలో గూడు కట్టుకోవాలని

51. దిగాలు పడ్డది ఒంటరితనం
నిరంతరం నువ్వు నా జ్ఞాపకాలతో సహజీవనం చేస్తుంటే

52. మనసు నావ విరహపు కొండను ఢీకొంది
ప్రణయ జీవుల్ని విషాద సంద్రంలో ముంచేస్తూ!

53. దొంగ పోలీస్ ఆటాడుతున్నాం...
కళ్ళకు కనపడకుండా నువ్వు, కలల్లో వెదుకుతూ నేను

54. కర్ణుడు పారబోసిన నెయ్యి రథాన్ని కుంగదీస్తే
నేను పారేసుకున్న మనసు బ్రతుకును కుంగదీసింది

55. తానెళ్ళిన దారిలో అన్వేషణ
జ్ఞాపకాల గుర్తుల కోసం

56. నిద్రలోను మెలకువగానే నేను
కలలో నీతో కబుర్లుచెప్తూ!

57. కనీసం ఈ ఒక్కరోజైనా ప్రేమించవూ
ఈ రోజు ప్రేమికులదినం అంటగా!

58. శిలనై ఉన్నాను నేను
సమ్మెటతో కొట్టకు పగిలిపోతా...ఉలితో చెక్కు శిల్పాన్నౌతా

59. పూలు వాడినా వీడదులే దారం
నువ్వు వీడినా వదలదులే నీజ్ఞాపకం

60. నా మనసు పుస్తకం అందంగా అచ్చయింది
నీ ముఖచిత్రం నా ఎదపై ముద్రించాక

61. రామాయణంలో సీత ఒక్కతే అగ్నిప్రవేశం నాడు
ఇంటింటా వంటింటి అగ్నికాహుతయ్యే సాధ్వీమణులెందరో నేడు

62. డొంకతిరుగుడు ఎందుకు?
కల్లోకి కాకుండా ఎదురుగా రావచ్చుగా..!

63. అరకొర చదువుల బ్రహ్మయ్యా
మాబ్రతుకులపై నీ పిచ్చిరాత ఏ ఒక్కరికి అర్థంకాదేమయ్యా?

64. కాలానికి ఎందుకింత కక్ష
కనీసం నిన్ను కల్లో అయిన ఉండనీయకుండా తెలవారుతుంది

65. నీ విరహం వేడి
నిప్పులనే తలపిస్తోందిగా మరి!

66. కాలం బందీ అయ్యింది
మన బిగికౌగిళ్ళలో చిక్కుకుని ముందుకు, వెనక్కు వెళ్ళలేక

67. చేతులు చాపి హత్తుకుంటావా
పిడికెడు గుండెలో నా జీవితాన్ని నింపుకు నీముందుంచుతా

68. కళ్ళలో వత్తులు వెలిగించుకు చూస్తున్నా
కన్నీటి చమురు ఆవిరవకముందే వచ్చెయ్

69. జలపాతాలే నీ కురులు
తలనుండి మెడ మీదుగా జాలువారి నడుంపై పడుతూ

70. నేనెప్పుడూ విఫలమే...
నీ ఊసుల వలయాన్ని దాటడంలో..!

71. మనసుపై రాసిన పుస్తకాలు చదువలేని పామరుడినే
అయితేనేం నీ మనసును చదవడంలో పండితుడినే

72. నాకళ్ళు కలల ఖజానాలే
దానికి కోశాధికారిణివి నువ్వైనప్పుడు

73. ఎంత తిక్కశంకరుడివిరా ఈశా....పరమేశా...
లోకం కోసం గరళాన్ని దిగమింగావు

74. నీ పెదవులు ముద్దాడినందుకేనేమో
మురళీ గానానికి ఈమాధుర్యం

75. నీ మనసుకెంత మోమాటం...
ప్రేమించిన మాటైనా చెప్పలేనంతగా..!

76. నన్ను తాకిన గాలేంటి ఇంత వెచ్చగుంది
నిన్ను గాని తాకి రాలేదు కదా

77. కళ్ళ తీరాన్ని తాకుతూ కలల అలలు
మనస్సంద్రం ఉప్పొంగిన భావాలతో ఎగిరెగిరి పడుతుంటే

78. పగలే వెన్నెల కాయడమంటే ఇదే
నువ్వు నా ముందు సాక్షాత్కరించావుగా

79. మతి తప్పిన మనసు
గతి తప్పిన కలలతో

80. కలలు కరుస్తున్నాయి
నువ్వేమైనా ఉసిగొల్పావా?

81. నీ జ్ఞాపకాలు కమ్మేసాయి మనసంతా
తనువంతా ఆనందపు జడివాన కురిపిస్తూ

82. రెండు సుడులున్నాయి!
ఒక్క పెళ్ళైనా కావట్లేదింకా ఏంటో

83. షరామామూలే!
నేను కవ్వించడం, నువ్వు కన్నెర్రజేయడం.

84. నాగుండె కల్లోలకడలే
నీజ్ఞాపకాల కెరటాలు నిత్యం హోరెత్తుతుంటే!

85. సాగుతూనే ఉంటుంది కాలం
కాలంతీరిన వారిని సాగనంపుతూ

86. కళ్ళ పొలిమేర దాటని కలలు
ఎక్కడ పుట్టాయో అక్కడే సమాధవుతూ

87. ఆమె... ఒక పాలకడలి
తన జీవితాన్ని మథించి అమృతమంటి ప్రేమ పంచుతుంది.

88. ఓర్చుకోవడం ఏ గురువు వద్ద నేర్చుకుందో
గుండెల్లో అగ్నిపర్వతం బ్రద్దలవుతున్నా చలించదు స్త్రీ

89. వలపన్నుతోంది నిద్ర
కళ్ళలో సంచరించే కలలను పట్టుకోవాలని

90. ఎంత దోపిడి...కష్టం చేతులదైతే
అలసిపోయి సుఖనిద్రను అనుభవించేదేమో కళ్ళు

91. నీతో జీవించాలనే నా ఆశల కెరటం
నువ్వు చేరువయిన రోజు తాకుతుందది ఆనందాలతీరం

92. నీ జ్ఞాపకాలు 'చల్లకుండ'
నా గుండె తడారినప్పుడల్లా ఆశల నీరు పోస్తూ

93. పెత్తనమంతా నీదే
నామనసునెపుడో నీ దాసిగా చేశా

94. ఇద్దరిదీ ఏకగ్రీవ ఎన్నికే
పగటి నియోజకవర్గంలో సూరీడు రాత్రి నియోజకవర్గంలో చంద్రుడు!

95. జ్వలిస్తూ మది గుండంలోని జ్ఞాపకాల కణకణాలు
కలకలం రేపుతూ బూడిదవుతున్న ఆశల ఆనవాళ్ళు

96. అసంపూర్ణమే నాజీవితం
నువ్వు తోడులేని ఏ జన్మైనా

97. నీఊహలెంత తుంటరివి
నామనసుని అల్లరిపెడుతూ తుళ్ళిపడేలా చేస్తున్నాయి

98. దిష్టితీయాలి నా కళ్ళకు
నిన్ను రెప్పలమాటున దాచినా కూడా చూసేస్తున్నాయి కలలు

99. ఆకలేసిన నా మది
నెమరేస్తూ నీ జ్ఞాపకాలు

100. నాదేహం… రెండు ముక్కల కలయిక
నువ్వో సగం… నేనో సగంగా

101. సంగమించిన మన మది నదులు
ప్రేమ సంద్రంలో లీనమయ్యేందుకు ఉరకలెత్తుతూ

102. యుగాలు క్షణాల్లా పరిగెడుతున్నాయి
నీతో సాగే నాజీవితకాలంలో

103. అఖండజ్యోతిలా వెలిగిపోతూ కాలం
క్షణాలు ఆజ్యంలా కరుగుతుంటే

104. మది భావాలను మస్తిష్కంతో మథించా
దొరికింది అక్షయపాత్ర నిండా కవితామృతం

105. నాది రోజూ చుక్కలతో పక్కే
నా చక్కదనాల చుక్క పక్కనుంటే

106. రెండిళ్ళపూజారి.... సూరీడు
ఉదయం తూరుపింట్లో....సాయంత్రం పడమరింట్లో

107. దాగుడుమూతలు ఆడుతున్న సూర్యచంద్రులు
ఒకరికొకరు యుగాలుగా పట్టుబడకుండా

108. వెతుకుతూనే ఉంటాయి నా కళ్ళు
ఇలలోనో, కలలోనో నువ్వు పట్టుబడేవరకు

109. మగజాతికిది తీరని అన్యాయమే
కవులు, కవయిత్రులు అందరూ...మగువల గురించే వర్ణిస్తుంటే

110. భారంగా నా కనులు
నిద్ర కరువై కాదు సుమా... నీతలపులు కరువయే

111. పచ్చనోటుపై బాపూజీ బోసినవ్వుల తెల్ల'ధనం'
నల్లధనంగా మిగిలిపోతున్నానని తెలియదు పాపం

112. మాసానికోసారి ఉప్పొంగే వెన్నెల సంద్రం
భూమి తీరాన్ని వెలుగులతో తడుపుతూ

113. జీవనది కాలం
ప్రవహిస్తుంటుంది సమయం

114. కళ్ళు మాయాదర్పణాలు
తనను తప్ప అందరిని చూపెడతాయి

115. ఆయుధ సరఫరా చేస్తున్న వసంతుడు
మన్మథుడి వింటికి పూబాణాలను అందిస్తూ